www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 3-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 245 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: విదియ మ. 1.09 తదుపరి తదియ; నక్షత్రం: మూల సా. 4.42 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: మ.3.02-4.42, రా.2.31-4.09; దుర్ముహూర్తం: ఉ.8.46-9.30, రా.9.51-10.42; అమృతఘడియలు: ఉ.10.02-11.42; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.34; సూర్యాస్తమయం: 5.35 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



పెళ్లి పీటలెక్కనున్న సింధు

హైదరాబాదీని మనువాడనున్న స్టార్ షట్లర్

వరుడు దత్తసాయి ఓ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

ఈ నెల 22న రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో వేడుక

24న హైదరాబాద్‌లో రిసెప్షన్ 11

కులోన్మాదానికి మహిళా కానిస్టేబుల్ బలి



నాగమణి (ఫైల్)

కులాంతర వివాహం చేసుకుందని అక్కపై తమ్ముడి కక్ష

స్కూటీపై వెళ్తుండగా కారుతో ఢీ.. ఆపై కొడవలితో దాడి

మెడ నరికి దారుణ హత్య.. వివాహమైన 22 రోజులకే ఘోరం

రూ. కోట్ల విలువైన భూమి తగాదాలూ కారణమేనా?

ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అక్క కులాంతర వివాహం చేసుకోవడాన్ని తమ్ముడు జీర్ణించుకోలేకపోయాడు. ఆమె పెళ్లాడిన వ్యక్తి తమ ఊరివాడే కావడంతో తలెత్తుకోలేకపోతున్నానని కక్ష పెంచుకున్నాడు. ఈ ఆగ్రహంతో ఉన్మాద స్థితికి చేరుకొని, పథకం ప్రకారం దారికాచి మరీ తోబుట్టువును వేటకొడవలితో నిర్దాక్షిణ్యంగా నరికి చంపాడు. ఈ కులోన్మాద హత్య రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పరిధిలోని రాయపోల్‌లో జరిగింది. ఈ హత్యకు భూ తగాదాలు కూడా కారణం అని స్థానికులు చెబుతున్నారు. హతురాలి పేరు కొంగర నాగమణి (28). ఆమె పోలీస్ కానిస్టేబుల్. తాను ఇష్టపడిన వ్యక్తిని పెళ్లాడిన 22 రోజులకే

మిగతా 10వ పేజీలో...



వాజేడు ఎస్సై ఆత్మహత్య

రిసార్టులో రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణం

2020లో పోలీసు ఉద్యోగానికి ఎంపికైన హరీశ్

ఆర్నెల్లుగా వాజేడులో విధులు

ఆత్మహత్య సమయంలో ఆయనతో ఓ యువతి

వీరి మధ్య ప్రేమ.. పెళ్లి కోసం ఒత్తిడి అంటూ కథనాలు

వ్యక్తిగత కారణాలతోనే ఎస్సై బలవన్మరణం: ఎస్పీ

వాజేడు/రేగొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ (29) ఆత్మహత్యకు పాల్పడ్డారు. పూసూరు జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రైవేటు రిసార్టులో సోమవారం ఆయన సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకున్నారు. తల కింది భాగం నుంచి తూటా వెళ్లడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందారు. పేలుడు శబ్దం విన్న రిసార్టు సిబ్బంది గదిలోకి వెళ్లి చూడగా.. హరీశ్ రక్తపుమడుగులో కనిపించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఆత్మహత్యకు కారణాలపై వదంతులు వ్యాపించాయి. పని ఒత్తిడి వల్లేనని తొలుత ప్రచారం జరగ్గా.. ప్రేమ వ్యవహారంతోనే అనే చర్చలు

మిగతా 10వ పేజీలో...



ఆలూరు వద్ద రైతులను ఢీకొట్టిన అనంతరం చెట్టు వద్ద ఆగిపోయిన లారీ

రైతులపైకి దూసుకెళ్లిన లారీ.. నలుగురి దుర్మరణం

మరో నలుగురికి తీవ్ర గాయాలు.. ఇద్దరు విషమం

రంగారెడ్డి జిల్లా ఆలూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతున్న రైతులపైకి లారీ

అప్రమత్తతతో కొందరికి తప్పిన ముప్పు 10

బైక్‌పై తిరగబడ్డ బొలేరో వ్యాన్

ఇద్దరు యువకుల మృతి

వికారాబాద్‌లో ఘటన

సర్పంచి ఎన్నికలకు

సంక్రాంతి గంగిరెద్దుల్లా!

కొన్ని రాజకీయ పార్టీలు ఓట్ల కోసం వస్తున్నాయ్

పది సంవత్సరాల్లో ఏమీ చేయని పార్టీలు పది నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాయి

కర్రు కాల్చి వాతపెట్టాలి.. విష ప్రచారం తిప్పికొట్టాలి

రుణ మాఫీ, భరోసాతో కొందరి గుండెల్లో పిడుగులు

ఫామ్‌హౌజ్‌లో పడుకున్నోళ్లకు మనశ్శాంతి లేదు

చిన్న ఆరోపణ కూడా లేకుండా టీజీపీఎస్సీ పనితీరు

త్వరలోనే గ్రూప్-1 నియామక పత్రాలు అందజేస్తాం

ప్రపంచ పారిశ్రామిక ఆకర్షణ శక్తిగా తెలంగాణ

ఆరోగ్య ఉత్సవాలు, కోకాకోలా ఫ్యాక్టరీ ప్రారంభంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

వైద్య, ఆరోగ్య మంత్రి దామోదర పనితీరుకు కితాబు



ములుగులో కోకాకోలా పరిశ్రమ ప్రారంభంలో సీఎం రేవంత్, మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సిద్దిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): "సంక్రాంతి పండుగకు గంగిరెద్దులు వస్తాయి. జోలెలో బిచ్చంపడగానే పోతాయి. అలాగే, ఇప్పుడు కొన్ని రాజకీయ పార్టీలు సర్పంచ్ ఎన్నికల కోసం వస్తున్నాయి. కాంగ్రెస్ సర్కారును బద్నాం చేసే ఆ పార్టీలకు కర్రుకాల్చి వాత పెట్టాలి" అంటూ బీఆర్ఎస్, బీజేపీలను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్, పదకొండో ఏడాది అధికారంలో కొనసాగుతున్న బీజేపీ ఏం చేశాయని నిలదీశారు. పదేళ్లపాటు వాళ్లు ఏమీ చేయలేనప్పుడు పది నెలల్లోనే తాము ఎలా అభివృద్ధి చేయగలుగుతామని ప్రశ్నించారు. ఆ రెండు పార్టీలు తమ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయని, సర్కారుపై జరుగుతున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని, ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత తెలంగాణ ప్రజలదేనని వ్యాఖ్యానించారు. ప్రపంచ పారిశ్రామిక పెట్టుబడులకు ఆకర్షణ శక్తిగా తెలంగాణ వెలుగొందుతోందని, వ్యాపారాభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో సోమవారం నిర్వహించిన ఆరోగ్య ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండ తిమ్మాపూర్‌లో హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ (హెచ్‌సీసీబీ)కి చెందిన

మిగతా 14వ పేజీలో...

వాన నీటి సంపుల డిజైన్ మార్చండి

హైదరాబాద్‌లో 141 చోట్ల సంపులను నిర్మించండి

వానాకాలానికి పూర్తి చేయండి

అధికారులకు సీఎం ఆదేశాలు 14

ఇదీ మా రికార్డు

"75 ఏళ్ల స్వతంత్ర భారత చరిత్రలో ఏ రాష్ట్రం ఒకే ఏడాదిలో 50 వేల ఉద్యోగాలు ఇవ్వలేదు. ఈ విషయంలో దేశంలోనే తెలంగాణ గొప్ప చరిత్ర సృష్టించింది. ఏడాదిలో రూ.835 కోట్లను సీఎంఆర్ఎఫ్ కింద ప్రజలకు ఇచ్చాం. ఇదొక రికార్డు. ఎవరు అడ్డు పడినా.. డీఎస్సీ నిర్వహించి 55 రోజుల్లోనే నియామక పత్రాలు అందించాం. మొదటి ఏడాదిలోనే 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణ మాఫీ చేశాం".

\- సీఎం రేవంత్ రెడ్డి

'బిల్డ్‌నౌ'గా టీజీ-బీపాస్ 13

5 నిమిషాల్లో డిజైన్లకు అనుమతి

ఏఆర్‌తో భవనాలు, లేఅవుట్ల వీక్షణ

జీవోల నిబంధనల కోసం ఏఐ సేవలు

తొలుత జీహెచ్ఎంసీలో పరిచయం

ఫిబ్రవరి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా..

10 రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 14

లేబర్ సెస్ పంపకానికి ఓకే

విభజన వివాదం

1 తెలుగు రాష్ట్రాల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం

1 క్లాస్ 3, 4 ఉద్యోగుల చేరికకు మరో 45 రోజులు!

1 వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ నిధుల వివాదాలు కొలిక్కి

1 విద్యుత్ బకాయిలు, షెడ్యూల్ 9పై రాని పరిష్కారం

1 విభజన సమస్యలపై.. సీఎస్‌ల నేతృత్వంలో భేటీ

1 15 అంశాలపై సుదీర్ఘ చర్చ.. డ్రగ్స్‌పై సంయుక్త కమిటీ

అమరావతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నడుమ రూ.861 కోట్ల లేబర్ సెస్ నిధుల పంపకంపై ఏకాభిప్రాయం కుదిరింది. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ నిధుల పంపకాలకు సంబంధించిన వివాదాలపై చర్చలు ఒక కొలిక్కి వచ్చాయి. అలాగే, రెండు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల బదిలీకి మరో 45 రోజుల సమయం ఇవ్వాలని సోమవారం మంగళగిరి (ఏపీ)లోని ఏపీఐఐసీ భవనంలో జరిగిన ఉన్నతస్థాయి అధికారుల కమిటీ భేటీలో నిర్ణయించారు. ఏపీ, తెలంగాణ మధ్య ఉన్న విభజన సమస్యల పరిష్కారం నిమిత్తం జరిగిన ఈ సమావేశానికి.. ఏపీ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, తెలంగాణ సీఎస్ శాంతికుమారి అధ్యక్షత వహించారు. మొత్తం రెండు రాష్ట్రాల మధ్య పరిష్కారం కావాల్సిన సమస్యలు 15 ఉండగా.. లేబర్ సెస్ పంపకాలు, ఉద్యోగుల

మిగతా 3వ పేజీలో...


కెనడా వద్దంటోంది.. 2

తాత్కాలిక పర్మిట్లపై ఉన్న 50 లక్షల మంది భవిత ప్రశ్నార్థకం

వచ్చే ఏడాది ఆఖరుకు ముగియనున్న వారి పర్మిట్ల గడువు

విద్యార్థులు గడువు పెంచుకోవచ్చు.. వలస చట్టాలపై దూకుడు

ఆర్థిక ఇబ్బందులతో శాశ్వత, తాత్కాలిక రెసిడెంట్స్‌లో భారీ కోత



మావోయిస్టుల మృతదేహాలను భద్రపర్చండి

నేటి వరకు ఏటూరునాగారంలోనే ఉంచండి

ఫోరెన్సిక్ నిపుణులతోనే పోస్టుమార్టం చేయించారా

శవ పరీక్షలో పాల్గొన్న వారి వివరాలివ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరు నాగారం ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలను మంగళవారం వరకు ఏటూరునాగారం ఆస్పత్రిలోనే భద్రపర్చాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తన భర్త మల్లయ్య మృతదేహాన్ని చూసేందుకు పిటిషనర్ కాల్వల ఐలమ్మకు అనుమతి ఇవ్వాలని చెప్పింది. అలాగే పోస్టుమార్టంలో పాల్గొన్న డాక్టర్లు, ఫోరెన్సిక్ నిపుణుల వివరాలను అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను మంగళవారానికి

మిగతా 2వ పేజీలో...

విశ్వ బ్రాహ్మణులను ఒకటిగానే లెక్కించండి

రాష్ట్ర సర్కారుకు హైకోర్టు ఆదేశాలు 13

జగన్‌పై కేసుల వివరాలన్నీ ఇవ్వండి

ఏయే కోర్టుల్లో ఏమేం కేసులున్నాయో తెలపండి

విచారణ ఏ దశలో ఉందో పట్టికగా అందించండి

2 వారాల్లో సమగ్ర అఫిడవిట్లు దాఖలు చేయండి

దర్యాప్తు సంస్థలకు సుప్రీంకోర్టు ఆదేశం

కేసుల విచారణలో జాప్యంపై అసహనం

తదుపరి విచారణ ఈ నెల 13కు వాయిదా



న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించిన సమగ్ర వివరాలు అందించాలని సీబీఐ, ఈడీలను దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. జగన్ బెయిల్‌ను రద్దు చేయాలని, కేసుల విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ మాజీ ఎంపీ, ఏపీ అసెంబ్లీ ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు గత ఏడాది నవంబరు 1న సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జగన్ సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని, తెలంగాణ సీబీఐ కోర్టులో విచారణ మందకొడిగా సాగుతోందని, అందుకే విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేసి రోజువారీ విచారణ జరపాలని ఆ పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఆ పిటిషన్

మిగతా 3వ పేజీలో...

ఫిరాయింపులు.. దబాయింపులు.. బుకాయింపులు

వీటితోనే కాంగ్రెస్ ఏడాది పాలన

మోసగించడం సీఎం రేవంత్‌రెడ్డి నైజం

మాట మార్చడంలో ఆయన పీహెచ్‌డీ

అరాచక పాలనపై 7న చార్జిషీట్: హరీశ్

కార్యకర్తలపై అక్రమ కేసులు సహించం

చేనేతపై జీఎస్టీని రాష్ట్రం చెల్లించాలి: కవిత



హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మోసం, దగా, వంచనకు రేవంత్‌రెడ్డి ఏడాది పాలనే నిలువెత్తు నిదర్శనమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అధికారం కోసం ప్రజల్ని మోసగించడం ఆయన నైజమని ఆరోపించారు. ఫిరాయింపులు, దబాయింపులు, బుకాయింపులతోనే కాంగ్రెస్ ఏడాది పాలన సాగిందని ధ్వజమెత్తారు. సోమవారం తెలంగాణ భవన్‌లో హరీశ్ మీడియాతో మాట్లాడారు. గతంలో మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలన్న రేవంత్‌రెడ్డి.. సీఎం అయ్యాక, ఉన్న రైతుబంధునే ఇవ్వడం లేదని విమర్శించారు. కౌలు రైతులకూ ఇస్తామని సీఎం ఓవైపు చెబుతుండగా.. మరోవైపు వ్యవసాయ శాఖ మంత్రి మాత్రం రైతు భరోసా డబ్బులపై రైతు, కౌలు రైతు మాట్లాడుకోవాలని

మిగతా 3వ పేజీలో...



ఫుట్‌బాల్ మ్యాచ్ రణరంగం

ఆఫ్రికా దేశం గినీలో 125 మంది మృతి 2

తీవ్ర వివాదానికి దారితీసిన రిఫరీ నిర్ణయం



కుమారుడికి బైడెన్ క్షమాభిక్ష 2

ఆయుధ కొనుగోలు, పన్ను ఎగవేత కేసుల్లో ఊరట

దిగిపోయే ముందు సంచలన నిర్ణయం

బెయిల్ వచ్చిన వెంటనే మంత్రిగా నియామకమా?

» తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ కేసులో సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ, డిసెంబరు 2: ఉద్యోగాల నియామకాల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సెంథిల్ బాలాజీని బెయిల్ వచ్చిన వెంటనే మళ్లీ మంత్రిగా తీసుకోవడంపై సోమవారం సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. సీనియర్ మంత్రిగా విధులు నిర్వర్తిస్తుంటే సాక్షులు ప్రభావితం కారా? అని ప్రశ్నించింది. ఈ చర్య కారణంగా నిందితులు స్వతంత్రంగా, నిబ్బరంగా ఉండగలరా అన్న సహేతుక సందేహాలు కలుగుతాయని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఎ.జి.మాసిహ్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. చెన్నైలోని మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఉద్యోగాల నియామకంలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై అప్పట్లో రవాణా మంత్రిగా పనిచేసిన సెంథిల్ బాలాజీని 2023 జూన్‌లో అరెస్టు చేశారు. ఈ ఏడాది సెప్టెంబరు 26న ఆయనకు సుప్రీంకోర్టులో బెయిల్ మంజూరయింది. సెప్టెంబరు 29న ఆయన ఎం.కె.స్టాలిన్ మంత్రివర్గంలో విద్యుత్తు, సంప్రదాయేతర విద్యుత్తు, ఎక్సయిజ్ శాఖల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఫిర్యాదుదారుల్లో ఒకరైన కె.విద్యా కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. దీనిపై సమాధానం చెప్పాలని సెంథిల్ బాలాజీకి నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.

బూత్‌లో ఓటర్ల సంఖ్య పెంపుపై వివరణ ఇవ్వండి

న్యూఢిల్లీ, డిసెంబరు 2: ప్రతి పోలింగ్ బూత్‌లో ఉండాల్సిన గరిష్ఠ ఓటర్ల సంఖ్యను 1200 నుంచి 1500 వరకు పెంచడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిల్‌పై సుప్రీంకోర్టు ప్రాథమిక విచారణ చేపట్టింది. దీనిపై సమాధానం ఇవ్వాలని ఎన్నికల సంఘాని(ఈసీ)కి నోటీసులు ఇచ్చింది. గరిష్ఠ ఓటర్ల సంఖ్యను పెంచుతూ 2019లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం కారణంగా ఇబ్బందులు కలుగుతాయని పేర్కొంటూ ఇందు ప్రకాశ్ సింగ్ అనే వ్యక్తి ఈ పిల్ దాఖలు చేశారు. ఓటర్ల సంఖ్య పెంపు కారణంగా ఎక్కువ సేపు నిలబడాల్సిన పరిస్థితి వస్తుందని, అందువల్ల బడుగు వర్గాల వారు ఓట్లు వేయలేని పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. సోమవారం ఈ పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం ఈసీకి నోటీసులు ఇస్తూ ఏ ఒక్కరు కూడా ఓటు వేయలేని పరిస్థితి రాకూడదని వ్యాఖ్యానించింది. అయితే, ఈసీ తరఫు న్యాయవాది మణీందర్ సింగ్ పిటిషనర్ వాదనను ఖండించారు. ఓటర్లందరూ ఒకేసారి వచ్చే పరిస్థితి ఉండదు కాబట్టి ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. రాజకీయ పార్టీలను సంప్రదించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

ఎఫ్ఐఆర్ లేకున్నా ఆస్తులు స్వాధీనం చేసుకోవచ్చా?

న్యూఢిల్లీ, డిసెంబరు 2: నేరాలపై ఎఫ్ఐఆర్ నమోదు కాకమునుపే మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద నిందితుల ఆస్తులను ఈడీ స్వాధీనం చేసుకోవచ్చా అన్న కీలక ప్రశ్నపై సుప్రీంకోర్టు విచారణ జరపనుంది. ఈ అంశం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పి.వి.సంజయ్ కుమార్‌ల ధర్మాసనం ముందుకు వచ్చింది. అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రయివేటు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోకూడదంటూ మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకొంది. విచారణలో భాగంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎల్ఎంఏ)లోని సెక్షన్-5లో ఉన్న రెండు నిబంధనలపై సామరస్యపూర్వక భాష్యం చెప్పనుంది. మొదటి నిబంధన ప్రకారం...ఆస్తులు నమోదు చేయాలంటే ఎఫ్ఐఆర్ నమోదు తప్పనిసరి. రెండో నిబంధన ప్రకారం...మనీలాండరింగ్ కింద విచారణ ప్రారంభించాలనుకుంటే మాత్రం ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసుకోకుండానే ఆస్తులను స్వాధీనం చేసుకునే అధికారం ఈడీకి ఉంది. దాంతో మొదటి నిబంధనను పాటించకుండానే స్వతంత్రంగా రెండో నిబంధనను అమలు చేయవచ్చా? అన్న ప్రశ్న తలెత్తింది. దీనిపై తదుపరి విచారణ ఫిబ్రవరి 17కు వాయిదా పడింది.

కోర్టు ధిక్కరణ కేసులో పిచాయ్‌కు నోటీసులు

ముంబయి, డిసెంబరు 2: వీడియోను తొలగించాలన్న ఆదేశాలను పాటించలేదన్న కారణంతో ముంబయి బల్లార్డ్ పియర్‌లోని అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు న్యాయస్థానం గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు పంపించింది. యూట్యూబ్‌లో తనపై పెట్టిన వీడియో పరువు నష్టం కలిగించేదిగా ఉందంటూ తొలుత ధ్యాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యోగి అశ్విని కోర్టును ఆశ్రయించారు. దాన్ని తొలగించాలని మార్చి 2023న కోర్టు ఆదేశించింది. ఆ వీడియోను ఇంకా పూర్తిగా తొలగించలేదని, భారత్‌లో మినహా మిగిలిన చోట్ల అందుబాటులో ఉందని పిటిషనర్ కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. దాంతో సమాధానం ఇవ్వాలని యూట్యూబ్ అధిపతి పిచాయ్‌కు కోర్టు నోటీసు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి మూడో తేదీకి వాయిదా వేసింది.

బీజేపీ నేత హెచ్. రాజాకు ఏడాది జైలు శిక్ష

చెన్నై, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ సిద్ధాంత పితామహుడు పెరియార్ విగ్రహాన్ని పగులగొడతానని ప్రకటించడం, డీఎంకే ఎంపీ కనిమొళిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేసుల్లో బీజేపీ సీనియర్ నేత హెచ్.రాజాకు చెన్నై ప్రత్యేక కోర్టు ఒక్కో కేసులో ఆరు నెలల చొప్పున జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. ద్రవిడ ఉద్యమనేత పెరియార్ విగ్రహాన్ని పగులగొడతానని హెచ్.రాజా 2018 ఏప్రిల్‌లో తన ఎక్స్‌పేజీలో ప్రకటించారు. అదే ఏడాది మార్చిలో డీఎంకే ఎంపీ కనిమొళిని కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు చేశారు. ఈ రెండు సంఘటనలకు సంబంధించి ఈరోడ్ నగర పోలీసులు, కరుంగల్‌పాళయం పోలీసులు కేసులు నమోదు చేశారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జయవేల్ ఈ పిటిషన్‌లపై విచారణ జరిపారు.

తెల్లారితే తొలి పోస్టింగ్.. కాటేసిన మృత్యువు..

» రోడ్డు ప్రమాదంలో యువ ఐపీఎస్ అధికారి దుర్మరణం

బెంగళూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ కావాలన్నది ఆ యువకుడి కల.. ఎంతో కష్టపడి చదివి తన కలను నెరవేర్చుకున్న ఆ యువకుడు విధుల్లో చేరేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. పోలీసు వాహనం టైరు పేలి అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో కర్ణాటక కేడర్ యువ ఐపీఎస్ అధికారి హర్షవర్ధన్(26) దుర్మరణం పాలయ్యారు. కర్ణాటకలోని హాసన్ జిల్లాలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. బిహార్‌కు చెందిన హర్షవర్ధన్ 2023లో ఐపీఎస్‌కు ఎంపికై శిక్షణ పొందారు. ఇటీవల మైసూరులో 4వారాల శిక్షణ ముగించుకుని, హాసన్‌లో ప్రొబేషనరీ ఏఎస్పీగా నియమితులయ్యారు. సోమవారం సాయంత్రం విధుల్లో చేరడానికి పోలీసు వాహనంలో బయల్దేరి వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

కెనడా వద్దంటోంది..

తాత్కాలిక పర్మిట్లపై ఉన్న 50 లక్షల మంది భవిష్యత్తు ప్రశ్నార్థకం

» వచ్చే ఏడాదితో ముగియనున్న పర్మిట్ల గడువు

» విద్యార్థులు గడువు పెంచుకునేందుకు చాన్స్



న్యూఢిల్లీ, డిసెంబరు 2: తాత్కాలిక పర్మిట్లపై కెనడాలో ఉంటున్న లక్షలాది మంది భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. వలస విధానంలో కొత్త పాలసీలు తీసుకొచ్చిన నేపథ్యంలో వారిని దేశంలో కొనసాగనిస్తారా? లేదా.. అవన్నీ రద్దవుతాయా? అనే దానిపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వచ్చే ఏడాది ఆఖరుకు సుమారు 50 లక్షల తాత్కాలిక పర్మిట్లకు గడువు తీరిపోతోంది. ఇందులో వర్క్ పర్మిట్‌పై, స్టడీ పర్మిట్‌పై ఉన్న వారితో పాటు శరణార్థులు కూడా ఉన్నారు. కెనడా ప్రస్తుత పరిస్థితుల్లో వీరందరికీ మళ్లీ పర్మిట్లు కొనసాగించే పరిస్థితి కనిపించడం లేదు. వలస వచ్చిన వారు స్వచ్ఛందంగా తిరిగి వెళ్లిపోతారని కెనడా ప్రభుత్వం కూడా భావిస్తోంది. ఇదే విషయాన్ని కామన్ ఇమిగ్రేషన్ కమిటీ సమావేశంలో ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ కూడా తెలిపారు. గత వారం జరిగిన ఆ సమావేశంలో కన్జర్వేటివ్ ఎంపీ టామ్ కిమియెక్ ఈ అంశాన్ని లేవనెత్తారు. తాత్కాలిక పర్మిట్స్‌పై ఉన్న సుమారు 49 లక్షల మందిని అవసరమైతే దేశం నుంచి పంపించడానికి సిద్ధంగా ఉన్నారా? అని ఆ ఎంపీ ప్రశ్నించారు. దీనికి మార్క్ మిల్లర్ సమాధానమిస్తూ.. కెనడియన్ బోర్డర్ సర్వీసెస్ ఏజెన్సీ (సీబీఎస్ఏ) వలస చట్టాలను అమలు చేయడంలో చురుకుగా పనిచేస్తోందని, అయినా చాలా మంది స్వచ్ఛందంగానే దేశాన్ని వదిలి వెళ్లిపోతారని భావిస్తున్నామని తెలిపారు. అలాగే స్టూడెంట్ వీసాపై ఉన్న సుమారు 7.66 లక్షల మందికి డిసెంబర్ 2025తో గడువు ముగుస్తున్న నేపథ్యంలో వారిని సీబీఎస్ఏ ట్రాక్ చేస్తుందా అన్న ప్రశ్నకు కూడా మార్క్ మిల్లర్ జవాబిచ్చారు. కొంత మంది విద్యార్థులు వారి పర్మిట్స్‌ను పునరుద్ధరించుకుంటారని లేదా పోస్టు గ్రాడ్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటారని ఇలా చేయడం వల్ల వారి పర్మిట్ల గడువును పెంచుకునే అవకాశం ఉందన్నారు. దీనికి సబంధించిన ఓ వీడియోను కెనడా మీడియా సంస్థ నేషనల్ పోస్టులో ఆయన షేర్ చేశారు.

భారతీయులకే ఇబ్బంది ఎక్కువ?

దేశంలో మౌలిక వసతులు తగ్గిపోతున్నాయనే ఆందోళనల నేపథ్యంలో ఎన్నికల ముందు ట్రూడో ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. ఏటా తీసుకుంటున్న శాశ్వత, తాత్కాలిక రెసిడెంట్స్ సంఖ్యను వచ్చే మూడేళ్లలో గణనీయంగా తగ్గించాలని నిర్ణయించింది. దీని కోసం కొత్త పాలసీలు ప్రవేశపెట్టింది. ఇది భారతీయులకు పెద్ద ఇబ్బందిగానే భావిస్తున్నారు. ఎందుకంటే కెనడాకు వలసల్లో భారతీయులే ఎక్కువగా ఉంటున్నారు. శాశ్వత రెసిడెంట్స్‌లో 2022లో మొత్తం భారతీయులు 27 శాతం ఉన్నారు. అయితే తాత్కాలికంగా పర్మిట్లు పొందిన వారిలో భారత జాతీయులు ఎంతమంది అనేది స్పష్టంగా లెక్కలు లేవు. పర్మినెంట్ రెసిడెంట్స్‌కు పర్మిట్లను 2025 కల్లా 5 లక్షల నుంచి 3.95 లక్షలకు తగ్గించాలని కెనడా ఇమిగ్రేషన్ కొత్త పాలసీలో పేర్కొన్నారు. ఇది 21 శాతం తగ్గుదల. కాగా తాత్కాలిక వర్కర్స్, స్టూడెంట్స్ విషయంలో కూడా పర్మిట్లను భారీగా తగ్గించనున్నారు. 2026 కల్లా తాత్కాలిక విదేశీ వర్కర్ల సంఖ్యలో 40 శాతం, అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యలో 10 శాతం కోత పడుతుందని భావిస్తున్నారు. కొత్త పాలసీ వల్ల దేశంలో జనాభాను నియంత్రించడమే కాకుండా, ఇళ్ల నిర్మాణం, హెల్త్ కేర్, ఇతర సేవలపై ప్రభుత్వ ఖర్చు పెంచే అవకాశం ఉంటుందని కెనడా అధికారులు భావిస్తున్నారు. ఇక ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో దేశంలో ఖర్చులన్నీ పెరిగిపోయిన కారణంగా కెనడాకు వలసపై భారతీయుల పునరాలోచించుకోవాలని ఇమిగ్రేషన్ విశ్లేషకుడు దర్శన్ మహారాజ్ సూచించారు. కెనడాకు వద్దామనుకునే భారతీయులు వేరే దేశంలో అవకాశాలు చూసుకోవడం మంచిదని సలహా ఇచ్చారు.

మహారాష్ట్రకు ఇద్దరు పరిశీలకులు

» నిర్మల, విజయ్ రూపానీలకు బాధ్యత

» రేపు బీజేపీ శాసనసభాపక్ష నేత ఎన్నిక

ముంబై, డిసెంబరు 2: మహారాష్ట్రలో కొత్త సీఎం ఎవరన్న అంశంపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించేందుకు బీజేపీ అధిష్ఠానం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీలను పరిశీలకులుగా నియమించింది. వీరిలో రూపానీ నేడు ముంబై చేరుకోనుండగా నిర్మల 4న చేరుకుంటారు. వీరి ద్వారా కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై మహాయుతి నేతలతో చర్చలు జరుపుతారు. ఈ నెల 4న ఉదయం 10 గంటలకు ముంబైలోని విధానసభ సెంట్రల్ హాల్‌లో బీజేపీ శాసనసభాపక్ష నేత ఎన్నిక ఉంటుంది. ఫడణవీస్‌ను బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నాక ఆయననే ముఖ్యమంత్రిగా ప్రకటిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆర్ఎస్ఎస్ మద్దతు కూడా ఫడణవీస్‌కే ఉన్నట్లు సమాచారం. ఈ నెల ఐదున సాయంత్రం 5 గంటలకు ముంబై ఆజాద్ మైదానంలో కొత్త సీఎం ప్రమాణ స్వీకారం ఉంటుంది. అనారోగ్యంతో బాధపడుతున్న మహారాష్ట్ర ఆపద్ధర్మ సీఎం ఏక్‌నాథ్ శిందేకు ఫడణవీస్ ఫోన్ చేశారు. ఆరోగ్య వివరాలు కనుక్కోవడమే కాక తన సన్నిహితుడైన గిరీశ్ మహాజన్‌ను శిందే దగ్గరకు పంపారు. అంతకు ముందు అనారోగ్యం కారణంగా శిందే మహాయుతి నేతల సమావేశంతో పాటు మిగతా కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకున్నారు. వాస్తవానికి డిప్యూటీ సీఎం పదవితో పాటు హోం శాఖ కూడా ఇవ్వాలని శిందే పట్టుబడుతున్నట్లు సమాచారం. హోంమంత్రిత్వ శాఖ తనకు కేటాయిస్తే సీఎం పదవి లేకపోయినా తన ప్రతిష్ఠ తగ్గదని, ఒకవేళ తాను కోరిన మంత్రిత్వ శాఖలు ఇవ్వకపోతే ప్రతిపక్ష నేతగా అయినా కొనసాగుతానంటూ శిందే బీజేపీ అధిష్ఠానానికి చెప్పినట్లు సమాచారం. మరోవైపు, తాను డిప్యూటీ సీఎం రేసులో లేనని శిందే తనయుడు శ్రీకాంత్ చెప్పారు. ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్, ఇతర ఎన్సీపీ నేతలు భేటీ అయ్యారు. కొత్త ప్రభుత్వంలో చేపట్టబోయే మంత్రిత్వ శాఖల కేటాయింపులపై చర్చించారు. ఇప్పటికే జరిగిన చర్చల ప్రకారం బీజేపీకి 20, శివసేనకు 12, ఎన్సీపీకి పది మంత్రిత్వ శాఖలు దక్కే అవకాశం ఉంది. ఈ నెల 5న కూటమి తరపున కనీసం 20 మంది మంత్రులు ప్రమాణం చేస్తారని సమాచారం.

లోకం తీరు



ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఫ్యాన్స్ ఘర్షణ

గినీలో 125 మంది మృతి

జెరెకొరె, డిసెంబరు 2: పశ్చిమాఫ్రికా దేశం గినీలో ఓ ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా రెండు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. అభిమానులు పరస్పరం ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో దాదాపు 125 మంది వరకు మృతి చెందగా చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. గినీ మిలటరీ జుంటా నేత మమాడీ డౌంబోయా గౌరవార్థం దేశంలోని రెండో అతిపెద్ద నగరం జెరెకొరెలో ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్ మధ్యలో రిఫరీ తీసుకున్న ఓ నిర్ణయం వివాదాస్పదమైంది. దీన్ని వ్యతిరేకించిన ఓ జట్టు అభిమానులు మైదానంలోకి దూసుకెళ్లారు. దీంతో అవతలి జట్టు అభిమానులు వీరిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఘర్షణ చెలరేగింది. వేలాది మంది అభిమానులు వీధుల్లోకి వచ్చి పరస్పరం ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది.

పది అగ్రశ్రేణి సైనిక శక్తుల్లో పాక్!

న్యూఢిల్లీ, డిసెంబరు 2: ప్రపంచంలోని పది అగ్రశ్రేణి సైనిక శక్తుల్లో ఒకటిగా పాకిస్థాన్ నిలిచింది. పలు విభాగాల్లో భారత్ కంటే కూడా ముందంజలో ఉంది. ఫైర్ పవర్ ఇండెక్స్ కథనం మేరకు ప్రపంచంలోని 9వ అతిపెద్ద మిలిటరీ శక్తిగా పాకిస్థాన్ నిలిచింది. ఆ దేశం వద్ద వేలాదిగా యుద్ధ ట్యాంకులు, యుద్ధ వాహనాలు, యుద్ధ విమానాలు ఉన్నాయి. ఫైర్ పవర్ ఇండెక్స్ ప్రకారం.. పాక్‌లో 6.54 లక్షల మంది సైనికులు, 1,434 సైనిక విమానాలు, 387 ఫైటర్ జెట్‌లు ఉన్నాయి. భారత్, పాక్ రెండూ అణ్వస్త్ర దేశాలే. సిప్రి నివేదిక ప్రకారం 2024 జనవరి నాటికి భారత్ వద్ద 172, పాకిస్థాన్ వద్ద 170 అణ్వాయుధాలు ఉన్నాయి. అయితే, ఇప్పటి వరకు నాలుగు సార్లు భారత్‌తో యుద్ధానికి దిగగా, ప్రతి సందర్భంలోనూ భారత సైన్యం చేతిలో పాకిస్థాన్‌కు భంగపాటు ఎదురైంది.

పార్లమెంటులో ప్రతిష్టంభనకు తెర!

న్యూఢిల్లీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటులో పలు అంశాలపై చర్చ జరపాలన్న అంశంపై కేంద్రం, విపక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు తెర పడింది. ఉభయ సభల్లో రాజ్యాంగంపై చర్చకు కేంద్రం అంగీకారం తెలపడంతో ఎట్టకేలకు మంగళవారం నుంచి సభ సజావుగా సాగేందుకు ఇరు పక్షాల మధ్య సయోధ్య ఏర్పడింది. నవంబరు 25న శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి అదానీ, సంభాల్ హింసాకాండ, మణిపూర్ అశాంతి వంటి విషయాలపై విపక్షాల తీవ్ర ఆందోళనల ఫలితంగా లోక్‌సభ, రాజ్యసభలు నిరంతరం వాయిదా పడుతూ వస్తున్నాయి. అయితే.. పార్లమెంటులో ఈ ప్రతిష్టంభనను తొలగించేందుకు అధికార బీజేపీ, ప్రతిపక్ష పార్టీలు సోమవారం ఒక ఒప్పందానికి వచ్చినట్లు పార్లమెంటు వర్గాలు తెలిపాయి. ఈమేరకు పార్టీల ఫ్లోర్ లీడర్లతో స్పీకర్ ఓం బిర్లా సమావేశం నిర్వహించారు. ఆ సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మీడియాతో మాట్లాడుతూ... రాజ్యాంగంపై డిసెంబరు 13, 14 తేదీల్లో లోక్‌సభలో, డిసెంబరు 16, 17 తేదీల్లో ఎగువసభలో చర్చ జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పార్లమెంటు ఉభయ సభల్లో చర్చలు జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయన్నారు. కాగా, పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఐదోరోజైన సోమవారం సైతం అంతంతమాత్రంగానే జరిగాయి. అదానీ ముడుపుల వ్యవహారంపై ప్రధాని మౌనం వీడాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ అంశంపై జేపీసీ వేయాలని ఉభయ సభల్లో విపక్ష ఎంపీలు పట్టుబట్టారు. దీంతో, రెండు సభలను వాయిదా వేశారు.

పెద్దపాదం మార్గం బంద్

» పులిమేడు రూట్‌లో రెడ్ అలర్ట్

» పంపా, సన్నిధానానికి ఎల్లో అలర్ట్

» శబరిమలలో భారీ వర్షాలు



శబరిమల, డిసెంబరు 2: ఫెంజల్ తుఫాన్ ప్రభావం శబరిమల యాత్రపైనా పడింది. రెండ్రోజులుగా తెరిపినివ్వకుండా వర్షాలు కురుస్తుండడం.. మంగళ, బుధవారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరికలను జారీ చేయడంతో.. అయ్యప్ప భక్తుల వనయాత్రలను నిషేధించారు. కేవలం పంపా బేస్ నుంచి మాత్రమే యాత్రకు అనుమతిస్తున్నారు. శబరిమలకు చేరుకునేందుకు ప్రధానంగా మూడు మార్గాలుంటాయి. అవి.. పులిమేడు మార్గం, ఎరుమేళి నుంచి పెద్దపాదం మార్గం, పంపా బేస్ నుంచి చిన్నపాదం మార్గాలు. ఫెంజల్ తుఫాన్ ప్రభావంతో మంగళ, బుధవారాల్లో మలప్పురం, కోళిక్కోడ్, వయనాడ్, కన్నూర్, ఇడుక్కి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ అయ్యింది. ఈ నేపథ్యంలో వండిపెరియార్ నుంచి పులిమేడ్ మార్గాన్ని మూసివేసినట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటికే ఈ మార్గంలోని కుజుత్తకులి వద్ద 12 మంది భక్తులు చిక్కుకుపోగా.. వారిని జాతీయ విపత్తు నిర్వహణ బృందం(ఎన్‌డీఆర్ఎఫ్) కాపాడింది. ఈ మార్గమంతా చిత్తడిగా మారడంతో.. చిన్నపాటి లోయలోకి జారిపడ్డ ఇద్దరు భక్తులకు తీవ్ర గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. ఎరుమేళి నుంచి పెద్దపాదం మార్గాన్ని కూడా అధికారులు మూసివేశారు. ఈ మార్గంలో కాలికట్టై ఆశ్రమం, అజుతా వద్ద చిక్కుకుపోయిన 450 మంది భక్తులను ఎరుమేలికి.. అక్కడి నుంచి 11 బస్సుల్లో పంపాబేస్‌కు తరలించారు. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు.. పులిమేడు, పెద్దపాదం మార్గాల్లో వనయాత్రను నిషేధించారు. రాత్రిళ్లు శబరి కొండపై రాకపోకలను నిషేధించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదాలుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎరుమేలి పుంగావనంలో స్నానాలను నిషేధించినట్లు, పంపాలో హైఅలర్ట్ కొనసాగుతోందని ప్రకటించారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో శబరిమల భక్తులకు భద్రత కల్పించాలని కేరళ హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో శబరిమల స్పెషలాఫీసర్ నాయర్ నేతృత్వంలో వివిధ శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు ప్రస్తుత పరిస్థితులను సమీక్షించారు. వరద ఉధృతి పెరిగితే.. పంపాలో స్నానాలను నిషేధించాలని నిర్ణయించారు.

కుమారుడికి బైడెన్ క్షమాభిక్ష



న్యూయార్క్, డిసెంబరు 2: మరి కొద్దిరోజుల్లో అధికార పీఠం నుంచి దిగిపోబోతున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్.. అక్రమ ఆయుధ కొనుగోలు, పన్ను ఎగవేత కేసుల్లో నిందితుడుగా ఉన్న తన కుమారుడు హంటర్ బైడెన్‌కు సంపూర్ణ, బేషరతు క్షమాభిక్షను ప్రసాదించారు! హంటర్‌పై పన్ను ఎగవేతకు సంబంధించి తొమ్మిది కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్లో అతడి నేరం రుజువైతే 17 ఏళ్ల దాకా జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అలాగే.. మాదక ద్రవ్యాలను వినియోగించే వ్యక్తి అయి ఉండీ తుపాకీని కలిగి ఉండడంపై మూడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో అతడికి 25 ఏళ్ల దాకా శిక్ష పడే అవకాశం ఉంది. ఈ కేసుల్లో అతడికి శిక్ష పడితే.. ఒక సిటింగ్ ప్రెసిడెంట్ కుమారుడు దోషిగా తేలడం అమెరికా చరిత్రలోనే ఇది తొలిసారి అయ్యేది. కానీ, ఆదివారం అనూహ్యంగా బైడెన్ అతడికి క్షమాభిక్ష ప్రసాదించడం సంచలనం సృష్టించింది. "న్యాయ వ్యవస్థ నిర్ణయాల్లో నేను జోక్యం చేసుకోనని అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచీ చెబుతూనే ఉన్నా. అందుకే.. ఇన్నాళ్లుగా నా కుమారుడిపై అన్యాయంగా విచారణ జరుపుతున్నా చూస్తూ ఉండిపోయాను. కానీ, నా కుమారుడిపై పెట్టిన కేసులన్నీ.. నాపై దాడి చేయడానికి రాజకీయ ప్రత్యర్థులు పన్నిన కుట్రలో భాగమే. అందుకే దీనిపై నేనొక నిర్ణయం తీసుకున్నా. దీన్ని అమెరికా ప్రజలు అర్థం చేసుకుంటారని నేను ఆశిస్తున్నా" అని బైడెన్ పేర్కొన్నారు.

మావోయిస్టుల మృతదేహాలను భద్రపర్చండి

(మొదటి పేజీ తరువాయి)



ఏటూరునాగారం వైద్యశాలలో కాకతీయ మెడికల్ కాలేజీ ఫొరెనిక్స్ బృందం

వాయిదా వేసింది. పోలీసులు తన భర్త మల్లయ్య మృతదేహాన్ని చూడనివ్వడం లేదని కాల్వల ఐలమ్మ అనే మహిళ సోమవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది డి.సురేశ్ కుమార్ వాదనలు వినిపించారు. పిటిషనర్ తన భర్త మృతదేహాన్ని చూసేందుకు అనుమతించాలని ములుగు ఎస్పీకి ఈ-మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశారని.. అలాగే పోస్ట్‌మార్టం చేసేటప్పుడు బంధువులెవరినైనా అనుమతించాలని కోరినట్లు తెలిపారు. పిటిషన్‌ను అనుమతించకపోవడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలకు పోలీసులు హడావుడిగా, ఫోరెన్సిక్ నిపుణులు లేకుండానే పోస్టుమార్టం చేయించారని ఆరోపించారు. పోలీసులు.. మావోయిస్టుల ఆహారంలో విషం, మత్తు పదార్థాలు కలిపారని.. వారు అపస్మారక స్థితిలోకి వెళ్లాక చిత్రహింసలకు గురిచేసి కాల్చేశారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోస్టుమార్టం జరిపించాలని కోరారు. అదేవిధంగా పిటిషనర్ తన భర్త మృతదేహాన్ని చూసేందుకు అనుమతించాలని కోరారు. అది నిజమైన ఎన్‌కౌంటర్ అయితే మృతదేహాలను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి ఎందుకు తరలించలేదని.. ఫోరెన్సిక్ నిపుణుల ఆధ్వర్యంలో ఎందుకు పోస్టుమార్టం చేయించలేదని ప్రశ్నించారు. మరోవైపు పోలీసులు, ప్రభుత్వం తరఫున హోంశాఖ న్యాయవాది మహేశ్‌రాజే వాదనలు వినిపించారు. ఆదివారం మృతదేహాలకు ఏటూరునాగారంలో పోస్టుమార్టం నిర్వహించామని.. డాక్టర్ల బృందంలో ఫోరెన్సిక్ నిపుణులున్నారని పేర్కొన్నారు. పిటిషనర్‌ను సైతం మృతదేహాలను చూసేందుకు అనుమతించామని చెప్పారు. శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున మృతదేహాలను వరంగల్ తరలించలేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. పోస్టుమార్టం చేసిన డాక్టర్లు, ఫోరెన్సిక్ నిపుణుల వివరాలతోపాటు పోలీసుల వైఖరిని లిఖితపూర్వకంగా చెప్పాలని పేర్కొంది. ఈ మేరకు విచారణ మంగళవారానికి వాయిదాపడింది.

మావోయిస్టుల మృతదేహాలకు పోస్టుమార్టం

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలకు సోమవారం పోస్టుమార్టం జరిగింది. ఏటూరునాగారం మండలం చల్పాక- ఐలాపురం అడవుల్లోని పొలాకమ్మ వాగు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. వారు మృతదేహాలను ఆదివారం రాత్రి ట్రాక్టర్ ద్వారా ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. కాకతీయ మెడికల్ కళాశాల ఫోరెనిక్స్ బృందం ఆధ్వర్యంలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఆ బృందంలో ఇద్దరు ప్రొఫెసర్లు, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ముగ్గురు పీజీ డాక్టర్లు ఉన్నారు. ఏడుగురి మృతదేహాల పోస్టుమార్టానికి సుమారు 8 గంటలు పట్టింది. అనంతరం మృతదేహాలను మార్చురీలో భద్రపరిచారు. కాగా, చల్పాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్ ముమ్మాటికీ బూటకమేనని మృతుల బంధువులు ఆరోపించారు. తమ వారిని విషమిచ్చి, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారని తెలిపారు. మృతదేహాలను చూసేందుకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని, కర్కశంగా వ్యవహరించారని మండిపడ్డారు.

ఎన్‌కౌంటర్లలో భద్రాద్రి జిల్లా ఫస్ట్

పదేళ్లలో 28 మంది మావోయిస్టుల మృతి.. ములుగు జిల్లాలో 17 మంది వరకు హతం

హైదరాబాద్, డిసెంబర్ 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మావోయిస్టుల కదలికలు కొంత తగ్గుముఖం పట్టినా.. అడపాదడపా జరిగిన ఎన్‌కౌంటర్లలో 60మందికి పైగా మావోయిస్టులు చనిపోయారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్లలో 22మంది మావోయిస్టులు చనిపోయారు. తాజాగా ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారిలో భద్రు అలియాస్ పాపన్న.. మధు అలియాస్ మల్లయ్య తెలంగాణకు చెందిన వారు. మిగతా ఐదుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు. పాపన్న ఇల్లందు-నర్సంపేట ఏరియా కమాండర్‌గా ఉన్నారు. మల్లయ్య ఏటూరునాగారం-మహదేవపూర్ డివిజన్ కార్యదర్శిగా ఉన్నారు. ఈ ఏడాది సెప్టెంబరులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమాండర్ లచ్చన్నతో పాటు ఆరుగురు మావోయిస్టులు మరణించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో అత్యధికంగా భద్రాద్రి జిల్లాలోనే 28 మంది మావోయిస్టులు చనిపోయారు. ఆ తర్వాత ములుగు జిల్లాలో 17 మంది వరకు మావోయిస్టులు మరణించారు. ఛత్తీస్‌గఢ్‌లో పోలీసుల కూంబింగ్ ముమ్మరం కావడంతో మావోయిస్టులు తెలంగాణ వైపు కదులుతున్నారు.

గిన్నెలు తోమండి...బూట్లు తుడవండి



సుఖ్‌బీర్ బాదల్‌కు అకాల్‌తఖ్త్ శిక్షలు

న్యూఢిల్లీ, డిసెంబరు 2: పంజాబ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ పార్టీ అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌కు సిక్కు మత సర్వోన్నత సంస్థ అయిన అకాల్ తఖ్త్ సోమవారం శిక్షలు విధించింది. 2007-17 మధ్య కాలంలో అకాలీదళ్ పార్టీ, ఆ పార్టీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం చేసిన తప్పులకుగానూ ఈ శిక్షలు వేసింది. 'సేవాదార్ (సేవకుడు) వేషం వేసి అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం వద్ద గిన్నెలు తోమాలని, బూట్లు తుడవాలని ఆదేశించింది. ఆయన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి ప్రకాశ్ సింగ్ బాదల్‌కు ఇచ్చిన 'ఫక్రే-ఎ-క్వాం' (జాతికి గర్వకారణం) బిరుదును ఉపసంహరించుకొంది. అకాలీదళ్ అధ్యక్షునిగా సుఖ్‌బీర్ రాజీనామాను ఆమోదించాలని, ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని ఆ పార్టీ వర్కింగ్ కమిటీని ఆదేశించింది.

చెన్నారెడ్డి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత

- గొప్ప పాలనాదక్షుడు.. ఆయన సేవలు మరువలేనివి
- గవర్నర్లు జిష్ణుదేవ్, దత్తాత్రేయ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

కవాడిగూడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మర్రి చెన్నారెడ్డి గొప్ప పరిపాలనాదక్షుడు, మార్గదర్శకుడు, రాజనీతిజ్ఞుడు, తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన మహోన్నత వ్యక్తి అని పలువురు ప్రముఖులు కొనియాడారు. మర్రి చెన్నారెడ్డి 28వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం ఇందిరాపార్కులోని చెన్నారెడ్డి మెమోరియల్ రాక్‌గార్డెన్‌లో ఆయన సమాధి వద్ద తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ తదితరులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడారు. చెన్నారెడ్డి ముందు చూపు ఉన్న వ్యక్తి అని అన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను నేటి యువత



మర్రి చెన్నారెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న గవర్నర్లు జిష్ణుదేవ్ వర్మ, బండారు దత్తాత్రేయ, మర్రి శశిధర్ రెడ్డి తదితరులు

ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణ ఉద్యమానికి చెన్నారెడ్డి స్ఫూర్తి అని దత్తాత్రేయ అన్నారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా, రెండుసార్లు గవర్నర్‌గా, కేంద్రమంత్రిగా సేవలందించారని పేర్కొన్నారు. చెన్నారెడ్డి గొప్ప రాజకీయ వేత్త అని, ముందుచూపు కలిగి ఉన్న వ్యక్తి అని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. ఆయన స్ఫూర్తితోనే ఎంపీటీసీగా, జడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశానని.. నేడు స్పీకర్ అయ్యానని తెలిపారు. చెన్నారెడ్డి విషయ పరిజ్ఞానం కలిగిన అనుభవజ్ఞుడు, దూరదృష్టి గల గొప్ప నేత అని ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. మాజీ మంత్రులు సమర సింహారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, మర్రి చెన్నారెడ్డి తనయులు మర్రి శశిధర్‌రెడ్డి, మర్రి రవీందర్‌రెడ్డి, చెన్నారెడ్డి కుటుంబసభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయనకు అంజలి ఘటించారు.

పెళ్లయిన నాలుగోరోజే..
పెను విషాదం!

- ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్
- తల పగిలి వరుడి దుర్మరణం
- తీవ్రగాయాలతో వధువు చావుబతుకుల్లో
- సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో విషాదం



ఉపేందర్(ఫైల్)

మేళ్లచెర్వు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నూరేళ్ల బంధంలోకి అడుగుపెట్టిన వారి వివాహం నాలుగు రోజులకే ఘోర ప్రమాదంతో చిన్నాభిన్నమైంది. రాత్రిపూట వధూవరులు ద్విచక్ర వాహనం మీద వేగంగా వెళుతూ రోడ్డు పక్కన ట్రాలీతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలై వరుడు అక్కడికక్కడే మృతిచెందాడు. వధువు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ విషాద ఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో జరిగింది. మరో 10 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా జరిగిన ఈ ఘోరం, పెళ్లి వేడుక తాలూకు ఆనందకర జ్ఞాపకాల్లో ఉన్న ఇరు కుటుంబాలు, బంధువుల్లో పెను విషాదాన్ని నింపింది. బంధువులు వెల్లడించిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తడకమల్ల గ్రామానికి చెందిన రాచూరి ఉపేందర్ (36)కు కొంత పొలం ఉంది. వరికోత యంత్రం డ్రైవర్‌గానూ పనిచేస్తున్నాడు. అతడికి మేళ్లచెర్వు మండల పరిధిలోని వెల్లటూరుకు చెందిన రత్నకుమారితో గత నెల 29న (శుక్రవారం) పెళ్లయింది. వధువు స్వగ్రామం వెల్లటూరులో నిద్ర చేసేందుకు తడకమల్ల నుంచి సోమవారం సాయంత్రం బయలుదేరారు. వధూవరులు ఒక ద్విచక్ర వాహనంపై, బంధువులు వెనుక ఆటోలో బయలుదేరారు. రాత్రి ఏడు గంటల సమయంలో వీరు ప్రయాణిస్తున్న బైక్ ఘోర ప్రమాదానికి గురైంది. రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఓ గడ్డి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఉపేందర్ ఢీకొట్టాడు. బైక్ వేగంగా నడపడం, రాత్రిపూట ఆగివున్న ట్రాక్టర్ కనిపించకపోవడంతో ఈ ప్రమాదం సంభవించింది. ట్రాలీకి బలంగా తగలడంతో ఉపేందర్ తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. రత్నకుమారికి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.

లేబర్ సెస్ పంపకానికి ఓకే

(మొదటి పేజీ తరువాయి)

బదిలీ గడువు, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ నిధుల పంపకాల వ్యవహారాలు ఈ భేటీలో ఒక కొలిక్కి వచ్చాయి. ఇరు రాష్ట్రాలనూ తీవ్రంగా వేధిస్తున్న డ్రగ్స్, గంజాయి నివారణపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. డ్రగ్ ట్రాఫికింగ్ నిరోధం కోసం రెండు రాష్ట్రాల పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులతో జాయింట్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే.. అత్యంత కీలకమైన షెడ్యూల్ 9లోని సంస్థల విభజన, విద్యుత్ బకాయిలపై మాత్రం సయోధ్య కుదరలేదు.

ఆ వివాదాలు కొలిక్కి..

వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో ఉండే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ 2014 మే నాటికి రూ.208.24 కోట్లు ఉందని రెండు రాష్ట్రాల అధికారుల సమక్షంలో 2017 జూన్ 6న ఏజీ నిర్ణయించింది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను డీలర్లవారీగా సర్దుబాటు చేయడానికి ఏపీ సర్కారు మార్గదర్శకాలు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం కూడా డీలర్లవారీ సర్దుబాటు పూర్తిచేయాలని కోరింది. తెలంగాణ నివేదిక వచ్చాకే ఈ అంశంపై ముందుకెళ్లాలని భేటీలో నిర్ణయించారు. 2014 మే నెలకు సంబంధించిన ఎక్సైజ్ ఆదాయాన్ని జూన్‌లో ఏపీకి రూ.295 కోట్లు, తెలంగాణకు రూ.350 కోట్లు చెల్లించినట్టు తెలంగాణ ప్రభుత్వం 2015 ఫిబ్రవరి 6న లేఖ రాసింది.

ఫ్రీజింగ్ ఎత్తివేత..

లేబర్ సెస్‌కు సంబంధించి రూ.861.35 కోట్లలో.. రూ.732.18 కోట్ల ఎఫ్‌డీలను తెలంగాణ ప్రభుత్వం ఫ్రీజ్ చేసింది. రూ.129.19 కోట్లు సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలో ఉన్నాయి. ఎఫ్‌డీల మీద ఫ్రీజింగ్ ఎత్తేయాలని ఏపీ అధికారులు ఈ సమావేశంలో కోరగా తెలంగాణ అధికారులు సానుకూలంగా స్పందించారు. దీనికి సంబంధించి పన్నులు చెల్లించి, తెలంగాణ వాటా నుంచి వాడిన మొత్తాన్ని తగ్గించాక.. మిగిలిన డబ్బును పంచుకోవాలని రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులు నిర్ణయించారు. అలాగే.. ఏపీ నుంచి తెలంగాణకు, తెలంగాణ నుంచి ఏపీకి శాశ్వతంగా వెళ్లాలనుకుంటున్న క్లాస్ 3, క్లాస్ 4 ఉద్యోగులకు అందుకు మరో 45 రోజుల సమయం ఇవ్వాలని నిర్ణయించారు.



ఏపీఐఐసీ కార్యాలయంలో జరిగిన ఏపీ, తెలంగాణ అధికారుల సమావేశంలో సీఎస్‌లు, అధికారులు

అయితే, ఏపీకి చెల్లించిన రూ.295 కోట్లలో జూన్ నెల ఆదాయం కూడా ఉందని, దీనివల్ల తెలంగాణ తనకు రావాల్సిన ఆదాయంలో రూ.81.1 కోట్లు నష్టపోయిందని, ఆ మేరకు ఏపీకి అదనంగా సొమ్ము వెళ్లిందని తెలంగాణ చెప్తోంది. అయితే, జూన్‌లో ఏపీ ట్రెజరీకి 2014 మే నెల ఆదాయం రాలేదని, తెలంగాణ చెప్తున్నట్టుగా రూ.295 కోట్లు జమ అయినట్టు తమ వద్ద రికార్డులు లేవని ఏపీ చెప్తోంది. ఈ వివాదంపై స్పష్టత రావడం కోసం ఏజీ వద్ద ఉన్న వివరాలు పరిశీలించి దాని ప్రకారం ఈ వివాదం పరిష్కరించుకోవాలని సూత్రప్రాయ అంగీకారానికి వచ్చారు. అలాగే 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఏపీ ఖాతాలో జమ చేసిన కేంద్ర ప్రభుత్వప్రాయోజిత పథకాల గ్రాంట్లను రెండు ప్రభుత్వాలూ లెక్క చూసుకుని పంచుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ విభాగంలో మొత్తం 4పథకాలకింద పంచుకోవాల్సిన గ్రాంట్లు రూ.5991.22కోట్లు ఉన్నాయి. ఇక.. రాష్ట్రం విడిపోయేనాటికి అమల్లో ఉన్న 15 ఈఏపీ ప్రాజెక్టులకు సంబంధించి మరోసారి రెండు రాష్ట్రాలూ లెక్కలు చూసుకుని చెల్లింపులు చేసుకోవాలని అధికారులు నిర్ణయించారు. షెడ్యూల్ 9, 10లోని సంస్థల బ్యాంకు ఖాతాల్లో పంపకం కాకుండా మిగిలిపోయిన రూ.8 వేల కోట్లపైనా ఈ భేటీలో చర్చించారు. షెడ్యూల్ 9లోని సంస్థల విభజనపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు.

కోర్టులో తేల్చుకుందాం..

ఉన్నతాధికారుల సమావేశంలో విద్యుత్ బకాయిలు చర్చకు వచ్చిన సమయంలో "ఆపర్చ్యునిటీ" విధానంలో ఏపీ తమకు రూ. 21,000 కోట్లను ఇవ్వాలని తెలంగాణ డిమాండ్ చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ అకస్మాత్తుగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడం వల్ల.. తాము బహిరంగ మార్కెట్లో అధిక ధరలు చెల్లించి విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సి వచ్చిందని రాష్ట్ర అధికారులు తెలిపారు. తాము ఖర్చు చేసిన ఆ మొత్తాన్ని చెల్లించాల్సిందేనని పట్టుబట్టారు. దీనికి ఏపీ అధికారులు.. తమకు తెలంగాణ నుంచి విద్యుత్ బకాయిల కింద రూ. 14,000 కోట్ల దాకా రావాల్సి ఉందని.. తాము సరఫరా చేసిన విద్యుత్‌కు తెలంగాణ ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించి ఉంటే తామెందుకు కరెంటు సరఫరాను నిలిపివేసేవారమని ప్రశ్నించారు. ఆస్తులు, అప్పుల పంపకంలో భాగంగా రెవెన్యూ రిజర్వ్ నుంచి విద్యుత్ బకాయిలను మినహాయించుకోవాలని ఏపీకి తెలంగాణ సూచించగా.. ఆ పంపకాలు తేలాక ఇక రెవెన్యూ రిజర్వు ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. విద్యుత్ బకాయిల వివాదం ఎటూ తేలకపోవడంతో.. దీన్ని రెండు రాష్ట్రాల విద్యుత్ సంస్థలే తేల్చుకోవాలని ఏపీ సీఎస్ సూచించారు. అలా రెండు కంపెనీల మధ్య తేలిపోయే వివాదమైతే ఇన్నాళ్లు ఎందుకు పరిష్కారం కాకుండా ఉంటుందన్న తెలంగాణ సీఎస్ శాంతి కుమారి.. ఈ వివాదం న్యాయస్థానంలో తేలాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ అంశంపై వాదప్రతివాదాలు జరిగాయి. చివరకు.. న్యాయస్థానమే దీనికి పరిష్కారం చూపుతుందని రెండు రాష్ట్రాల అధికారులూ అభిప్రాయపడ్డారు. కాగా.. రెండు రాష్ట్రాల సీఎస్‌ల అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో తెలంగాణ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు, హోం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి రిజ్వీ, కార్మిక ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్, పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ పాల్గొన్నారు. ఏపీ నుంచి.. ఆర్థిక శాఖ కార్యదర్శి జానకి, హోం ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా, ఏపీ జెన్కో సీఎండి చక్రధర్‌బాబు, వాణిజ్యపన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మా కార్యకర్తలపై
అక్రమ కేసులు పెడితే ఊరుకోం

- చేనేతపై జీఎస్టీని రీయింబర్స్ చేయాలి: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన సాగిస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రశ్నిస్తున్న తమ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యాలకు దిగుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడులు, అక్రమ అరెస్టులకు పాల్పడితే ఊరుకోమని ఆమె హెచ్చరించారు. కోరుట్ల నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో సోమవారం కవిత తన నివాసంలో సమావేశమయ్యారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, కేసీఆర్ మొక్కలాంటి వారని పీకేస్తానంటూ సీఎం వ్యాఖ్యానించడం హాస్యాస్పదం అని అన్నారు. పీకేయడానికి కేసీఆర్ మొక్కకాదని ఆయన ఒక వేగుచుక్కని పేర్కొన్నారు. బ్రిటీష్ పాలనలో కూడా చేనేతపై పన్నులేదని, అలాంటిది ప్రధాని మోదీ చేనేతపై జీఎస్టీ విధించడం దౌర్భాగ్యమని అన్నారు. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రప్రభుత్వం తరఫున చేనేతపై జీఎస్టీని రీయింబర్స్ చేస్తామని రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని తక్షణం నిలబెట్టుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

- 3 జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఫెంగాల్ తుపాను ప్రభావంతో తెలంగాణలో మంగళ, బుధవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బుధవారం పలు జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇక సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అల్లపల్లిలో అత్యధికంగా 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, వరంగల్ జిల్లా సంగెంలో 1.8, అదే జిల్లా చెన్నారావుపేటలో 1.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. మరోవైపు తుపాను ప్రభావంతో తెలంగాణ అంతటా రాత్రిపూట ఉష్ణోగ్రతలు పెరిగాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18-23 డిగ్రీల మధ్య నమోదు కావడంతో చలి తీవ్రత కాస్త తగ్గింది.

మే 18న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

- షెడ్యూల్ విడుదల చేసిన ఐఐటీ కాన్పూర్

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఐఐటీల్లో బీటెక్ సీట్ల భర్తీకి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 పరీక్షను వచ్చే ఏడాది మే 18న జరపనున్నట్లు ఐఐటీ కాన్పూర్ తెలిపింది. ఈ మేరకు సోమవారం పరీక్ష షెడ్యూల్‌ను విడుదల చేసింది. పరీక్షను రెండు సెషన్లలో నిర్వహించనున్నామని వెల్లడించింది. మే 18న ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పేపర్-1, అదే రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష ఉంటుందని పేర్కొంది.

5 నుంచి టీపీబీవో అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ ఆఫీసర్స్(టీపీబీవో) పోస్టుల భర్తీలో భాగంగా ఈ నెల 5 నుంచి 7వ తేదీల మధ్య అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెల్లడించింది. తెలుగు యూనివర్సిటీలో ఉదయం 10.30 గంటల నుంచి ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

- బైక్‌లను ఎత్తుకెళ్లే ముఠా..
- 30 లక్షల విలువైన 35 బైకులు రికవరీ, ఆరుగురి అరెస్టు

గద్వాల క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు అలవాటు పడి రాత్రి సమయాల్లో ఇళ్ల ముందు నిలిపిన బైక్‌లను దొంగతనం చేసే ముఠాను జోగుళాంబ గద్వాల జిల్లా పోలీసులు పట్టుకొని వారి నుంచి సుమారు రూ. 30 లక్షల విలువైన 35 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్వాలలోని రాంనగర్ కాలనీకి చెందిన రేణుక అనే మహిళ తన ఇంటి ముందు ఉంచిన యమహా ఫాసినోని ఎవరో దొంగిలించారని గత నెల 28న పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నిఘా ద్వారా ఈ దొంగతనాలకు గద్వాల జిల్లా కేంద్రంలోని చింతలపేట కాలనీకి చెందిన గాంధీ చిన్న, నాగరాజు, నల్లకుంటకు చెందిన రఫీ, రెండవ రైల్వేగేట్‌కు చెందిన వంశీ, వనపర్తి జిల్లా మదనాపురం మండలం దంతనూరుకు చెందిన నవీన్, మదనాపురం మండల కేంద్రానికి చెందిన రాధాకృష్ణ, కొత్తకోటకు చెందిన వహీద్, ఆదర్శ్ కారకులుగా గుర్తించారు. వారిలో వంశీ, రాధాకృష్ణ పరారీలో ఉండగా మిగిలిన ఆరుగురిని అరెస్టు చేసి విచారించారు. గతంలో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కూడా వీరిపై ఏడు బైక్ దొంగతనాల కేసులు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఎనిమిది మంది పరిచయం ద్వారా స్నేహితులై ఒక ముఠాగా ఏర్పడి రాత్రి సమయాల్లో ఇళ్ల ముందు ఉంచిన బైక్‌లను దొంగిలించి వాటిని తక్కువ ధరకు విక్రయిస్తూ వచ్చిన డబ్బుతో జల్సా చేసేవారని పోలీసుల దర్యాప్తులో తేలింది. పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ ప్రత్యేక టీంలతో సోమవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించాడు. ఆపి వాహన పత్రాలను చూపించమనగా దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. ఇలా కేసును ఛేదించిన పోలీసులు ఆరుగురిని రిమాండ్ చేయగా ఇద్దరు పరారీలో ఉన్నారు. కేసు దర్యాప్తు చేసిన ఎస్ఐ కళ్యాణ్‌కుమార్, సిబ్బంది చంద్రయ్య ఇస్మాయిల్‌లను ఎస్పీ రివార్డులతో అభినందించారు.



శోకసంద్రంలో మునిగిన శ్రీదేవి కుటుంబసభ్యులు

21 ఏళ్ల పిల్లి మృతి

- కన్నీటి పర్యంతమైన దాని యజమానులు
- శోకసంద్రంతో అంత్యక్రియలు

అంబర్‌పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొంతమంది పెంపుడు జంతువులను ఇంట్లో మనుషులతో సమానంగా పెంచుకుంటారు. వాటికి చిన్న దెబ్బ తగిలినా తల్లిడిల్లిపోతుంటారు. ఈ నేపథ్యంలో తాజాగా ఇంట్లో 21 ఏళ్ల పాటు అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లి మృతి చెందడంతో దాని యజమానులు కన్నీటి పర్యంతమయ్యారు. తమ సొంత కుటుంబసభ్యులను కోల్పోయినట్లు బాధపడ్డారు. భారతదేశంలో సాధారణంగా పిల్లుల జీవితకాలం 14 నుంచి 16 ఏళ్ల పాటే ఉంటుంది. అయితే ఈ పిల్లి రికార్డు స్థాయిలో 21 ఏళ్ల పాటు జీవించింది. 2004 సెప్టెంబర్ 19న జన్మించిన ఈ పిల్లిని హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నివాసం ఉంటున్న జూలూరు శ్రీదేవి కుటుంబసభ్యులు ముద్దుగా పొట్టి అని పిలుచుకుంటూ అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. 2011లో ఓ అర్ధరాత్రి తాను ఛాతీ నొప్పితో అవస్థలు పడుతుంటే పక్కనే ఉన్న పొట్టి గట్టిగా అరుస్తూ కుటుంబసభ్యులను నిద్రలేపిందని, ఆసుపత్రికి తీసుకెళ్లగా గుండెపోటుగా వైద్యులు నిర్ధారించి స్టంట్ వేశారని దాని యజమాని శ్రీదేవి తెలిపారు. పొట్టి వల్లనే తాను ప్రాణాలతో బయటపడ్డానని ఆమె చెప్పారు. ఇలా ప్రతి విషయంలో తమకు దగ్గరైన పొట్టి మృతి శ్రీదేవి కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. బాధాతప్త హృదయాలతో అంబర్‌పేట హిందూ శ్మశాన వాటికలో పొట్టి అంత్యక్రియలు నిర్వహించారు.

జగన్‌పై కేసుల వివరాలన్నీ ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ తీరుపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఆ కేసులపై రోజువారీ పద్ధతిలో విచారణకు ఇప్పటికే తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని ఇరుపక్షాల న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అయితే, విచారణలో ఇంత జాప్యం ఎందుకు జరుగుతోందని ధర్మాసనం ప్రశ్నించింది. దానికి డిశ్చార్జ్, వాయిదా పిటిషన్లు, ఉన్నత కోర్టుల్లో విచారణ పెండింగ్ కారణమని న్యాయవాదులు తెలిపారు. దీంతో పెండింగ్ కేసుల వివరాలన్నీ ఇస్తే తగు ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం తెలిపింది. 'కింది కోర్టుల్లో ఉన్న డిశ్చార్జ్ పిటిషన్ల వివరాలన్నీ ఇవ్వండి. తెలంగాణ హైకోర్టులో ఉన్న పెండింగ్ అప్లికేషన్ల వివరాలు సమగ్రంగా అందించండి. అన్ని కోర్టులకు సంబంధించిన సీబీఐ, ఈడీ కేసుల వివరాలను విడివిడిగా పట్టిక రూపంలో అందించండి. సమగ్ర అఫిడవిట్లను రెండు వారాల్లో దాఖలు చేయండి. అఫిడవిట్ రూపంలో ఇచ్చిన పట్టిక చూసిన తరువాత ఏం చేయాలో చెబుతాం' అని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది.

జగన్‌పై సుప్రీంకోర్టులో పిల్

వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌పై సుప్రీం కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణపై అప్పటి సీఎం జగన్ పలు ఆరోపణలు చేశారని, అవన్నీ నిరాధారమని పిటిషనర్ సునీల్ కుమార్‌సింగ్ పేర్కొన్నారు. ఈనేపథ్యంలో జగన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్మాసనం ఈ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించి.. జనవరికి వాయిదా వేసింది.

ఫిరాయింపులు, బుకాయింపులు!

(మొదటి పేజీ తరువాయి)

చెబుతున్నారని, ఇదెక్కడి విడ్డూరమని అన్నారు. రేవంత్ అరాచక, బుకాయింపు పాలనపై తెలంగాణ ప్రజల ముందు చార్జిషీట్ పెడతానని హరీశ్ చెప్పారు. కాంగ్రెస్ సర్కారు పాలనా వైఫల్యం, మోసాలను ఈ నెల 7న ప్రజలకు పూర్తిస్థాయిలో వివరిస్తానని తెలిపారు. శిలా ఫలకాలపై సీఎం పేరు ఉండొద్దన్న రేవంత్.. ఇప్పుడు ఏకంగా ఫొటోనే వేయించుకుంటున్నారని ఆరోపించారు. యూట్యూబ్ చానళ్లను గతంలో మెచ్చుకొని, ఇప్పుడు వారిపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ, రేవంత్‌రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలు.. బూటకపు ఎన్‌కౌంటర్లపై సీఎం అయ్యాక అనుసరిస్తున్న విధానాలను వీడియోల రూపంలో హరీశ్ వెల్లడించారు. గ్రూప్స్, పోటీ పరీక్షల వాయిదా, బతుకమ్మ చీరలు, ఎల్ఆర్ఎస్, కులగణన సర్వే, అక్రమ కట్టడాల కూల్చివేతలు, ఏక్ పోలీస్, మద్యం అమ్మకాలు, కాళేశ్వరం ప్రాజెక్టు, పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా గతంలో మాట్లాడిన మాటలపై ఆయన ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. పోలీస్ కుటుంబాలను రాచిరంపాన పెడుతున్నారని విమర్శించారు. ఏక్ పోలీసింగ్ విధానం తెస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని పోలీసు కుటుంబాలు డిమాండ్ చేస్తే.. పోలీసులతోనే వారి కుటుంబసభ్యులను అరెస్టులు చేయించారని ఆరోపించారు. 'గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయమని నిరుద్యోగులు డిమాండ్ చేస్తే అది ప్రతిపక్షాల కుట్ర అన్నావ్. మేం డిమాండ్ చేస్తే తలకు మాసినోడే పరీక్షలు వాయిదా వేయమంటాడన్నావ్. చివరికి నువ్వే పరీక్షలు వాయిదా వేశావ్. ఇప్పుడు ఎవరు తలమాసినోడో నువ్వే చెప్పాలి' అని హరీశ్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని చెప్పి.. దాని పరిధిలోని మల్లన్న సాగర్ ద్వారానే హైదరాబాద్‌కు నీళ్లు తెస్తా అంటున్నారని, ఆ ప్రాజెక్టు ఉన్నందుకే ఇక్కడ కోకాకోలా కంపెనీని ప్రారంభించారని గుర్తుచేశారు.



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న హరీశ్‌రావు, తదితరులు

తెలంగాణభవన్ అంటే గుర్తుకొచ్చే పేరు శ్రీనివాస్‌రెడ్డి

- పార్టీకి ఆయన సేవలు ఎనలేనివి: హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణభవన్ అంటే అందరికీ గుర్తుకొచ్చేది శ్రీనివాస్‌రెడ్డి అని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు కొనియాడారు. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీగా కేంద్ర కార్యాలయ ఇంచార్జిగా మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి చేసిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో శ్రీనివారెడ్డికి బీఆర్ఎస్ ఆత్మీయసత్కారం జరిగింది. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... శ్రీనివాస్‌రెడ్డి స్థానంలో రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న రావుల చంద్రశేఖర్ రెడ్డిని తెలంగాణ భవన్‌కు ఇంచార్జిగా నియమించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అసమర్థ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ శాఖకూ పనిలేకుండా పోయిందని మాజీమంత్రి జి.జగదీశ్ రెడ్డి ఆరోపించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

ఇద్దరు ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్య

- బాచుపల్లి, పోచారం..లలో ఘటనలు
- యాజమాన్యాల ఒత్తిడే కారణమని కుటుంబీకుల ఆరోపణలు



ప్రజ్ఞ, తనుష్‌నాయక్(ఫైల్)

దుండిగల్, ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): యాజమాన్యాల ఒత్తిడి తట్టుకోలేక ఇద్దరు ఇంటర్ విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు. ఈ రెండు వేర్వేరు ఘటనలు సోమవారం బాచుపల్లి, పోచారంలలో జరిగాయి. బాచుపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోర్గం మండలం చింతాడు గ్రామానికి చెందిన ప్రజ్ఞ(18) ప్రగతినగర్ సింహపురికాలనీలోని ఇంపల్స్ కళాశాలలో ఎంపీసీ రెండో ఏడాది చదువుతూ అదే కళాశాల వసతిగృహంలో ఉంటోంది. సోమవారం ఉదయం హాస్టల్ గదిలో ఎవరూ లేని సమయంలో ప్రజ్ఞ చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ప్రజ్ఞ తరగతి గదికి రాకపోవడంతో కళాశాల యాజమాన్యం హాస్టల్‌కు వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఆస్పత్రికి తరలించగా విద్యార్థిని అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు స్పష్టం చేశారు. కళాశాల యాజమాన్యం వేధింపుల వల్లే తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఘటనలో బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం పెద్దపలుగు తండాకు చెందిన బానోత్ జగన్నాథం చిన్న కుమారుడు బానోత్ తనుష్ నాయక్(16) అలియాస్ టింకు పోచారం మునిసిపాలిటీ అన్నోజిగూడలోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం టీ విరామం అనంతరం తనుష్ కనిపించ లేదు. తోటి విద్యార్థులు వెతకగా బాత్‌రూంలో బెడ్‌షీట్‌తో ఉరివేసుకొని కనిపించాడు. కళాశాల యాజమాన్యం హుటాహుటిన తనుష్‌ను హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకుని వచ్చిన మృతుడి బంధువులు కళాశాల లోపలికి వెళ్లి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. పోలీసులు వారిని బయటకు పంపించగా, న్యాయం జరిగే కదిలేది లేదని కళాశాల గేటు ఎదుటే బైఠాయించారు. మృతుడి బంధువు ఒకరు ఒంటిపై కిరోసిన్ పోసుకోని ఆత్మహత్యకు యత్నించారు. రెండు ఘటనల్లోనూ తాము రాకముందే మృతదేహాలను ఎలా తరలిస్తారంటూ బాధిత తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలకు యాజమాన్యాల ఒత్తిడే కారణమంటూ విద్యార్థి సంఘాలు రెండు కళాశాలల దగ్గర ఆందోళనలు నిర్వహించాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అంతుచిక్కని రాజకీయం

ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిత్యం కాట్లాడుకొనేకంటే, వెన్నుపోట్లతో ప్రజాతీర్పును వక్రీకరించడం కంటే, ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో పదవులు చక్కగా పంచుకొని, బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొని, నాలుగుకాలాలు ఏలుకోవడమే ఉత్తమం. అయినా, మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం ఏర్పాటుకు ఏకంగా పదిరోజులు పైనే పడుతూండటం చాలామందికి ఆశ్చర్యం కలిగిస్తోంది. గత ఐదేళ్ళ వెన్నుపోటు రాజకీయాల అనుభవం రీత్యా కాబోలు, బీజేపీ అతి జాగ్రత్తగా, మర్యాదగా వ్యవహరిస్తోంది. అత్యధికస్థానాలు గెలుచుకొని కూడా మరీ ఇంత వినయం ఎందుకని పార్టీ నాయకులే ఆశ్చర్యపోయే రీతిలో పెద్దలు నడుస్తున్నారు. ఏక్‌నాథ్ శిందే ఒత్తిళ్ళు, అలకల వల్లనే ప్రభుత్వం ఏర్పాటులో ఇంతటి జాప్యం జరుగుతోందన్నది కాదనలేని నిజం. సోమవారం మహాయుతి నాయకుల సమావేశం మరోమారు రద్దయింది. శిందే అందుబాటులో లేని కారణంగా ఇలా జరగడం గత నాలుగురోజుల్లో ఇది రెండోసారి. పాపం ఆయనకు ఒంట్లో బాగుండడం లేదట. శిందే కోరుతున్నదానిని కాదనడానికి, మెడలు వంచడానికి బీజేపీ ఎందుకు వెనకడుగువేస్తోందో, సాధారణ జనానికి అంతుచిక్కని మరో వ్యూహం ఏమైనా ఇందులో ఉన్నదో తెలియదు.

ఎవరు ముఖ్యమంత్రి అన్నది తేల్చుకోకుండానే, ప్రమాణస్వీకారోత్సవాన్ని మాత్రం బాగా ముందుగానే నిర్ణయించుకున్నారు. ఐదవతేదీ ప్రమాణం చేయబోయేవారెవ్వరో నాలుగున నిర్ణయమవుతుంది. నిర్మలా సీతారామన్, విజయ్ రూపానీ సమక్షంలో బీజేపీ శాసనసభాపక్షనేతగా దేవేంద్ర ఫడణవీస్ ఎన్నిక, సీఎంగా ఆయన పేరు ప్రకటన జరిగిపోతాయని వార్తలు వస్తున్నాయి. ఫడణవీస్ తరఫున శిందేను పలకరించి, పరామర్శించి వచ్చిన గిరీశ్ మహాజన్ ఆయన అలకబూనలేదన్న విషయాన్ని మీడియాకు మరీ ప్రత్యేకంగా విన్నవించారు. డిప్యూటీ సీఎంతో పాటు, హోంశాఖ కూడా తనకే కావాలని శిందే పట్టుబడుతున్నారనీ, కావస్తే మరో రెండు తీసుకోగానీ, హోం మాత్రం ఇచ్చేది లేదని బీజేపీ అన్నందుకు శిందే ఆగ్రహించారని వార్తలు వెలువడుతున్న తరుణంలో, తనకు అసలు మంత్రిపదవే అక్కరలేదని జూనియర్ శిందే చేసిన వ్యాఖ్యకు ఎంతో కొంత విలువైతే ఉంది.

ఫడణవీస్ కాక, మరొకరు తెరమీదకు వస్తారన్న ఊహాగానాలేమీ లేవు కానీ, శిందే ఎందుకు తగ్గడం లేదన్నది ప్రశ్న. సామాన్యుడిలాగా ఉంటాను కనుక, ప్రజలు మళ్ళీ తననే ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నారని ఓ పక్క అంటూనే, మోదీ మాటకు కట్టుబడతానని మాట ఇచ్చిన ఆయన, ఆ తరువాత పట్టుబిగించిన విషయం తెలిసిందే. 288మంది ఎమ్మెల్యేలున్న సభలో బీజేపీకి 132 వచ్చిన తరువాత కూడా శిందేయే మళ్ళీ సీఎం అని ఆయన పార్టీచెప్పుకుంటూ బిహార్‌లో నితీశ్ ప్రభుత్వాన్ని ఉదాహరించింది. ఎవరెన్ని గెలిచినా, మళ్ళీ మీ నాయకుడే సీఎం అని బీజేపీ తమకు ఎన్నికలముందు హామీ ఇచ్చిందని కూడా శిందేసైన్యం వాదించింది. ఫలితాలు వెలువడిన నాలుగురోజులకు దిగివచ్చి, నేను అడ్డంకికాబోను అని ప్రకటించిన శిందే, సీఎం పదవిలో రాజీపడినా హోం మాత్రం వదలడం లేదు. నిన్నటివరకూ తాను సీఎంగా ఉన్నప్పుడు, డిప్యూటీ సీఎం ఫడణవీస్ దగ్గర హోం ఉన్నందున, ఇప్పుడు కూడా అదే న్యాయం అమలు కావాలి కదా అన్నది మంచి ప్రశ్న. కానీ, ఉద్ధవ్‌పార్టీని చీల్చి, అగాడీ ప్రభుత్వాన్ని నిలువునా కూల్చినప్పుడు బీజేపీ తాను పక్కకు తప్పుకొని, అనూహ్యంగా శిందేను ముఖ్యమంత్రిగా కూచోబెట్టడానికీ, ఇప్పటి అవసరాల్లోనూ, సంఖ్యాబలాల్లోనూ ఎంతో తేడావుంది. శిందే ప్రోద్బలం మేరకు శివసేన ఎమ్మెల్యేలు రాత్రికిరాత్రి విమానాలు ఎక్కి ఇతరప్రాంతాలకు తరలిపోతున్న విషయం అప్పట్లో ముఖ్యమంత్రి ఉద్ధవ్‌ఠాక్రేకు తెలియరాలేదని, హోంశాఖ ఎన్సీపీ చేతుల్లో ఉండటం ఇందుకు కారణమని అప్పట్లో విశ్లేషణలు వచ్చాయి. ఆ సంగతి అటుంచితే, విపక్షాలతో సహా సమస్తపార్టీలనూ, రాష్ట్రరాజకీయాలను నియంత్రించగలిగే శక్తిమంతమైన హోం చేతుల్లో ఉండటానికీ, కేవలం డిప్యూటీ సీఎం అనిపించుకోవడానికీ ఎంతో తేడా ఉన్నదని శిందే అభిప్రాయం. ఏక్‌నాథ్ శిందేలను సృష్టిస్తాం అని విపక్షపార్టీలను చీటికీమాటికీ బెదిరించే బీజేపీకి, ఆ పదవి అతడి చేతికి పోతే ఏమి జరుగుతుందోనన్న వెరపు ఉండటం సహజం. అజిత్‌పవార్ వెంటనే ఫడణవీస్‌కు మద్దతు ప్రకటించి ఆటలో మంచి ఎత్తు వేశారు. అంతిమంగా శిందే సర్దుకుపోవచ్చునేమో కానీ, ఆరంభంలో రేగిన ఈ అనుమానాలు రేపటి రాజకీయాన్ని ప్రభావితం వేసే ప్రమాదమైతే ఉంది.

ఆలయం.. ఆదరణ.. అక్కసుల చరితం!



సర్వమత సమాదరణలో మనకు సాటిరాగల దేశం లేదని గర్వంగా చెప్పుకుంటాం. శతాబ్దాల మతాల సహజీవనానికి అదే కారణమనీ నమ్ముతాం. అది నూటికి నూరుపాళ్లూ నిజమా? ఒట్టి ఆదర్శ ప్రచారమా? చరిత్ర పరిశీలనకు అది నిలబడేదేనా? మన పాలకులు అంతటి విశాల హృదయులా? రాజ్యాన్ని వీరభోజ్యంగా భావించిన నేలలో అంతటి ఔన్నత్యాన్ని ప్రదర్శించారా? అన్నీ గంభీర ప్రశ్నలే! అందరినీ సంతృప్తిపరచే జవాబులే తేలికగా లభించవు! రాజ్య విస్తరణకు రక్తాలు చిందించటంలో మన పాలకులు ఎవరికీ తీసిపోలేదు. కానీ సర్వమత సమాదరణలో మాత్రం మన పాలకులు కొంతమేరకు సఫలం అయ్యారు. పూర్తిగా విఫలం మాత్రం కాలేదు! అందుకే మన చరిత్రను జాగ్రత్తగా మదింపు వేసుకుంటే సమాదరణలో మన సఫలతను ఆత్మస్తుతిగా భావించలేం! దీన్నుంచి ప్రేరణ పొంది మరిన్ని మంచి అడుగులు వేయటానికి మాత్రం ప్రస్తుతం తడబడుతున్నాం. విద్వేషాన్ని ఎగదోసే భావాలతో మందిర్-మసీద్‌ల చుట్టూ వివాదాలను రగల్చటానికే నాయకులు వ్యూహాలకు పదును పెడుతున్నారు. మసీదులపై కేసుల మీద కేసులు అందుకే పడుతున్నాయి. వారణాసి, మథుర, భోజ్‌శాల వివాదాలకు ఇప్పుడు సంభల్ మసీదు గొడవ తోడైంది. ఆరోపణల సారం మాత్రం మారటం లేదు. గుడులను కూల్చి మసీదులు కట్టారనే ఆరోపణలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అయోధ్య తీర్పుతో భవిష్యత్తులో మందిర్-మసీద్ వివాదాలు తలెత్తవనే నమ్మకం క్రమేపీ నీరుకారి పోతోంది. ప్రార్థనా స్థలాలు, కట్టడాల స్వభావాన్ని మార్చకూడదని నిర్దేశించే 1991 నాటి చట్టాన్ని సుప్రీంకోర్టు గట్టిగానే సమర్థించింది. దాన్నిప్పుడు పట్టించుకునే పరిస్థితి కనపడటం లేదు. గుడుల కూల్చివేతలను తేల్చటానికీ, అవసరమైన పక్షంలో ప్రార్థనలు అనుమతించటానికీ సుప్రీం తీర్పు తమకు అడ్డుకాబోదన్న రీతిలోనే కింది కోర్టులు వ్యవహరిస్తున్నాయి. దీన్ని కట్టడి చేయాలని అభ్యర్థనలు వెల్లువెత్తుతున్నా సుప్రీంకోర్టు నుంచి అలాంటి ఆదేశాలు ఇప్పట్లో వచ్చే అవకాశమే కనపడటం లేదు.

ఇస్లాం పాలకులందరినీ ఆలయ విధ్వంసకులుగా ప్రచారం చేయటం ఇటీవల మామూలై పోయింది. చరిత్ర పేరుతో పుంఖానుపుంఖంగా అటువంటి రచనలు వచ్చి పడుతున్నాయి. అన్ని వైపుల నుంచి చుట్టుముట్టుతున్న ఆ తరహా ప్రచారంతో ఇబ్బందులెన్నో వస్తున్నాయి. పాలకుల మతం ఆధారంగా చరిత్రలో మంచిచెడులను నిర్ణయించటంతో ద్వేషభావనలకు పునాదులు పడ్డాయి. దేశంలో చీకటియుగం ముస్లిం పాలకులతో మొదలైందని చెప్పటానికి చరిత్రనే తారుమారు చేస్తున్నారు. బ్రిటిష్ పాలకులతో మొదలైన చరిత్ర వక్రీకరణ ఇటీవల ఇంకా ముదిరిపోతోంది.

మన చరిత్రలో ఆలయాల విధ్వంసాలు జరిగాయి. కాదనలేం. మసీదులు దాడులకు గురయ్యాయి. వాటినీ తృణీకరించలేం. అధికారం కోసం సాగిన యుద్ధాల్లో ప్రార్థనా మందిరాలు సమిధలయ్యాయి. వాటినీ విస్మరించలేం. ప్రత్యర్థిని దెబ్బతీయటానికి అతని కోటలనే కాదు అతను పరమ పవిత్రంగా పూజించే దేవాలయాలనూ మందిరాలనూ లక్ష్యంగా చేసుకున్నారు. అవి జరగలేదనీ చెప్పలేం. కానీ మొత్తం చరిత్రంతా అదేననీ, ముస్లిం రాజుల పాలనంతా పరమత ద్వేషంతోనే నిండిపోయి ఆలయాల విధ్వంసంతో గడచి పోయిందని చెప్పటంతోనే సమస్య వస్తుంది. ముస్లిం రాజుల పాలన మొదలయ్యే నాటికే కుల సామాజిక వ్యవస్థ బాగా వేళ్లూనుకుంది. దీన్ని తొలగించటానికో, సంస్కరించటానికో ముస్లిం పాలకులు ప్రయత్నించలేదు. సైనిక సామర్థ్యంతో పాలనా యంత్రాంగంలో పైస్థాయిలో కుదురుకున్నా శిస్తు, పన్ను వసూళ్లకు కుల పెద్దలపైనే ఆధారపడ్డారు. చాలా చోట్ల రెవెన్యూ యంత్రాంగాన్ని యథాతథంగా కొనసాగించారు.

> ఏకపక్ష మతదృష్టితో చారిత్రక వాస్తవాలను విస్మరించి విద్వేష భావనలను రగల్చటం రాజకీయంగా లాభం కావచ్చు. వందల ఏళ్ల ముస్లిం రాజుల కాలాన్ని చీకటి యుగంగా ముద్రవేయటం తేలిక కావచ్చు. కానీ ఆ యుగమే సూఫీ, భక్తికవుల సమానత్వ భావనను ఎలుగెత్తి చాటింది. కరడుగట్టిన కులవ్యవస్థ కదలబారటానికి భావాగ్నిని అందించింది. ఆధునికత వైపు దేశం అడుగులు వేయటానికి ఆర్థిక భూమికను ఏర్పరిచింది. ముస్లిం పాలనంతా అంధకారమైతే 17, 18 శతాబ్దాల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ అగ్రభాగాన నిలవటం అసాధ్యమయ్యేది.

సైన్యంలో గతంలోలాగే చేరికలను ప్రోత్సహించారు. కొందరికి ఉన్నత పదవులూ కట్టబెట్టారు. ఇక మెడమీద కత్తిపెట్టి మతమార్పిడులు చేశారనటానికి కూడా చారిత్రక ఆధారాల్లేవు. వందలేళ్లు అధికారం చలాయించిన ఢిల్లీ చుట్టుపక్కల గంగా మైదాన ప్రాంతాల్లో అత్యధిక ప్రజలు ముస్లింలుగా మారలేదు. వందల సంవత్సరాలు ముస్లిం పాలనలో ఉన్నా హైదరాబాద్‌లోనూ మెజారిటీ ప్రజలు హిందువులుగానే ఉన్నారు. బలవంతంగా మతమార్పిడులు చేసి ఉంటే ముస్లిం పాలనకు కేంద్రాలైన నగరాల్లోనే గట్టిగా ఆ పనిని చేసి ఉండేవారు. బలగాలన్నీ అక్కడే ఉంటాయి. బలవంతాలూ అక్కడే సులువు! ఇక దేశానికి రెండు కొనల్లో ఉండే పశ్చిమ పంజాబులోనూ, తూర్పు బెంగాల్ లోనూ పెద్దఎత్తున ప్రజలు ముస్లింలుగా మారటానికి అనేక కారణాలున్నాయి. అక్కడా బలప్రయోగం లేదు. సూఫీ గురువుల బోధనలే ప్రధానపాత్రను పోషించాయి. ఇక ముస్లిం పాలకులు కూడా గుడులకు జాగీర్లూ ఇచ్చారు. ఇనాంలూ ఇచ్చారు. పునరుద్ధరణకు పైకాలూ ఇచ్చారు.



■ రాహుల్ కుమార్

చరిత్రను నిష్పాక్షికంగా విశ్లేషించిన అధ్యయనాల్లో ఇదే తేలింది. క్యాలిఫోర్నియా వర్సిటీ యాంత్రపాలజీ ప్రొఫెసర్‌గా పనిచేసిన క్యారన్ లేనర్డ్ హైదరాబాద్‌లోని హిందూ ఆలయాలపై చేసిన పరిశీలనల్లో ఎన్నో నిజాలు నిగ్గుతేలాయి. నిజాంల పాలనలో కీలకంగా ఉన్న కాయస్థ కులస్థులపై లేనర్డ్ చేసిన పరిశీలన బహుముఖమైంది. 50 ఏళ్ల కిందటే అందుకోసం విస్తృతంగా పర్యటించారు. హైదరాబాదీయులపై ఇటీవల వరకూ ఆమె పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. నిజాంలు హిందూ ఆలయాలపై చూపిన ఆదరణను వివరించటానికి లేనర్డ్ చాలా ఉదాహరణలు ఇచ్చారు. ముస్లిం పాలకులు గుడులను కూల్చివేస్తారనే దురభిప్రాయం తొలగటానికి లేనర్డ్ పరిశోధనలు తోడ్పడతాయి. సందేహం లేదు! అంతమాత్రాన నిజాంలు మతాన్ని రాజకీయాల కోసం అసలు వాడుకోలేదని చెప్పలేం. సంక్షోభం చుట్టుముట్టినప్పుడు మతాన్ని రెచ్చగొట్టే చర్యలకు ఊతం ఇచ్చారు. రజాకార్ల విజృంభణలో అది స్పష్టంగా కనపడింది. 1940లకు ముందు మాత్రం మతాదరణలో చాలావరకూ సాధారణ వైఖరినే ప్రదర్శించారు. ఈ సాధారణ వైఖరేమిటి అన్న ప్రశ్న వెంటనే వస్తుంది. దీన్నే బహుళ మత సంస్కృతుల ఆదరణ విధానంగా లేనర్డ్ వర్ణించారు. అంటే ఒక మతాన్ని పాలక మతంగా స్వీకరించి.. మిగతా మతాలను పూర్తిగా అణగదొక్కి.. పాలకవర్గ మతానికే ప్రోత్సాహం ఇవ్వటం కాకుండా.. అన్ని మతాలను వీలైనంత మేరకు ఆదరించటమే దాని సారంగా చెప్పుకోవచ్చు. భారత ఉపఖండంలో ఈ భావన ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఒక విధాన రూపాన్ని సంతరించుకుంది. నైజాం పాలకులూ దీన్ని అనుసరించారు. వారు సున్నీ వర్గానికి చెందిన వారైనా షియాల ప్రార్థనా మందిరాల పోషణకు జాగీర్లు ఇచ్చారు. మొహర్రం ఊరేగింపులను కొనసాగనిచ్చారు.

ముస్లిం రాజుల పాలనా కాలంలో కాయస్థులు పాలనా వ్యవహారాల్లో, రెవెన్యూ లెక్కల్లో ప్రావీణ్యం సంపాదించి, మంచి అధికారులుగా గుర్తింపు తెచ్చుకున్నారు. అరబ్బీ, పర్షియన్, ఉర్దూ భాషలపై గట్టిపట్టును సాధించారు. ఇక హైదరాబాద్ కాయస్థుల్లో ఏడు ఉపకులాలు (సక్సేనా, మాథుర్, శ్రీవాత్సవ, గౌర్, భట్నాగర్, నిగం, అస్తానా) ఉండేవి. నిజాంల రాజ్యంలోని కాయస్థ అధికారులు-ప్రముఖుల అజమాయిషీలో 19వ శతాబ్దంలో 15 హిందూ ఆలయాలు ఉండేవి. వీటిల్లో ఎక్కువ వాటిని వారే స్వయంగా నిర్మించారు. అంతకుముందు నుంచీ ఉన్న కొన్నిటిని నిర్వహణలోకి తీసుకున్నారు. రాంబాగ్ (హైదరాబాద్‌కు పశ్చిమాన), చిత్రగుప్త (ఉప్పుగూడ), దేవల్ బజార్ రూప్‌లాల్ (శాలిబండ), నర్సింజీ/మాయారాం (శాలిబండ), బుచర్‌మాల్ ఆలయం (శాలిబండ), లలితాదేవి బాగ్ (ఉప్పుగూడ), బాలాజీ మహదేవ్ (కోట్ల ఆలీ జా), కేశవ్‌గిరి (హైదరాబాద్ దక్షిణం), రామచంద్రజీ (పురానాపూల్), రాంమందిర్ (శాలిబండ), కాళీ టెంపుల్ (ఉప్పుగూడ), శంకర్‌జీ (మీర్ జుమ్లా ట్యాంక్), నర్సింగ్ బాబా (ఉప్పుగూడ), శంకర్‌బాగ్ (ఉస్మాన్‌గంజ్) ఆలయాలు.. ఇప్పుడు మనం పాతబస్తీగా భావించే ప్రాంతంలోనే ప్రధానంగా ఉండేవి.

కాయస్థేతరులు నిర్మించిన గుడులు కూడా ఉన్నాయి. రెండుమూడు చోట్ల ఆలయాలు, దర్గాలు, మసీదులు ఒకే ప్రాంగణంలో ఉండేవి. బ్రహ్మక్షత్రీ కులానికి చెందిన రాజా రఘురాం బహదూర్ 1822లో నిర్మించిన కిషన్‌బాగ్ గుడి అలాంటిదే. ఈ గుడికి మూడో నిజాం సికిందర్‌జా రెండు జాగీర్లు ఇచ్చారు. దర్గా ఉర్సు ఉత్సవాలకు రాజా రఘురాం ప్రత్యేకంగా భవనాలను నిర్మించారు. బేగంబజార్ సీతారాం గుడిని మార్వాడి అగర్వాల్ అయిన పూరణ్‌మాల్ కట్టించారు.

> వారణాసి, మథుర, భోజ్‌శాల వివాదాలకు ఇప్పుడు సంభల్ మసీదు గొడవ తోడైంది. ఆరోపణల సారం మాత్రం మారటం లేదు. గుడులను కూల్చి మసీదులు కట్టారనే ఆరోపణలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అయోధ్య తీర్పుతో భవిష్యత్తులో మందిర్-మసీద్ వివాదాలు తలెత్తవనే నమ్మకం క్రమేపీ నీరుకారి పోతోంది.

ఇక్కడ కూడా గుడి ఆవరణలో కుతుబ్‌షాహి కాలంనాటి మసీదు ఉండేది. ఈ గుడి పోషణకూ జాగీర్‌ను ఇచ్చారు. ఆలయ శంకుస్థాపనకు నిజాం స్వయంగా హాజరయ్యారు. పురానాపూల్ నుంచి మీరాలం ట్యాంకుకు వెళ్లే దారిలో రాజా శంభుప్రసాద్ కాళీ ఆలయాన్ని నిర్మించారు. నిజాంతో ఉన్నతస్థాయి అధికార సంబంధాలున్న కాయస్థులు, హిందువులు నిర్మించిన గుడుల్లో చాలా వాటికి నైజాం సర్కార్ నుంచి ఏదో రూపంలో సహాయం అందుతూనే ఉండేది. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం ఆలయానికి పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయం కుతుబ్‌షాహీల కాలం నుంచే ఉండేది. నిజాం పాలకులు దాన్ని కొనసాగించారు. అలాగే అజంతా గుహల పునరుద్ధరణను చేపట్టారు. ప్రఖ్యాత రామప్పగుడినీ పునరుద్ధరించారు. అందుకే దేశంలోని ముస్లిం పాలకులందరినీ ఒకే గాటనకట్టలేం.

ఏకపక్ష మతదృష్టితో చారిత్రక వాస్తవాలను విస్మరించి విద్వేష భావనలను రగల్చటం రాజకీయంగా లాభం కావచ్చు. వందల ఏళ్ల ముస్లిం రాజుల కాలాన్ని చీకటి యుగంగా ముద్రవేయటం తేలిక కావచ్చు. కానీ ఆ యుగమే సూఫీ, భక్తికవుల సమానత్వ భావనను ఎలుగెత్తి చాటింది. కరడుగట్టిన కులవ్యవస్థ కదలబారటానికి భావాగ్నిని అందించింది. ఆధునికత వైపు దేశం అడుగులు వేయటానికి ఆర్థిక భూమికను ఏర్పరిచింది. ముస్లిం పాలనంతా అంధకారమైతే 17, 18 శతాబ్దాల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ అగ్రభాగాన నిలవటం అసాధ్యమయ్యేది. ఆ యుగంలో కొన్ని ఆలయాల విధ్వంసం జరిగినా ఆదరణా సమృద్ధిగానే ఉండేది! ఏ దేశ చరిత్ర అయినా మంచీచెడులు రెండింటినీ అందిస్తుంది. ఏది తీసుకోవాలన్నది మన విజ్ఞతకు గీటురాయిగా మిగులుతుంది.


(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ఉన్నత విలువల ఖని

మన తొలి దేశాధ్యక్షుడు డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ 140వ పుట్టిన రోజు నేడు. ఆయన 1884 డిసెంబర్ 3న బిహార్‌లోని జీరాడి గ్రామంలో మహదేవ్ సహాయి, కమలేశ్వరిదేవి దంపతులకు జన్మించారు. వీరు ధనికులైనా నిరాడంబర జీవితాన్ని సాగించేవారు. రాజేంద్రప్రసాద్ జీవితమంతా బిహార్ పౌరుడిగా గడిపినా ఆయన పూర్వీకులు మాత్రం ఉత్తర ప్రదేశ్‌కు చెందినవారు.

కలకత్తా, ప్రెసిడెన్సీ కాలేజీలో విద్యాభ్యాసం సమయంలో రాజేన్ బాబు నాయకత్వ లక్షణాలకు ఆకర్షితులైన విద్యార్థులు స్టూడెంట్స్ యూనియన్ కార్యదర్శిగా భారీ మెజారిటీతో గెలిపించారు. 1910లో కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి ఆయన న్యాయశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. 1917 వరకు కలకత్తా, బిహార్ న్యాయస్థానాలలో న్యాయవాదిగా గడిపారు. రాజేంద్రప్రసాద్ న్యాయ పరిజ్ఞానం, వాదనా పటిమలు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ జస్టిస్ అశుతోష్ ముఖర్జీని ఆకట్టుకోవడంతో యూనివర్సిటీ 'లా' విభాగంలో అధ్యాపకునిగా నియమించారు.

బిహార్‌లోని 'చంపారన్' రైతుల దుస్థితిని స్వయంగా పరిశీలించడానికి 1917లో వచ్చిన మహాత్మాగాంధీ వ్యక్తిత్వానికి ఆకర్షితుడైన రాజేంద్రప్రసాద్ ఆయనకు అనుయాయిగా మారారు. అంత వరకు ఆడంబర జీవితం గడిపిన రాజేంద్రప్రసాద్ ఒక్కసారిగా నిరాడంబరుడిగా, సంఘ సేవకుడిగా, ఉదార స్వభావుడిగా రూపాంతరం చెందారు. మహాత్ముడు 1919లో దేశ వ్యాప్తంగా ఇచ్చిన 'సత్యాగ్రహం' పిలుపును పురస్కరించుకుని ప్రజా చైతన్యమే లక్ష్యంగా బిహార్‌లోని అన్ని వర్గాల ప్రజలను సమీకరించి సత్యాగ్రహోద్యమాన్ని విజయవంతం చేశారు రాజేంద్రబాబు. బహిరంగ సభలను నిర్వహించి ప్రజలలో చైతన్య దీపికలను రగిలించారు.



సహాయ నిరాకరణోద్యమంలో పాలుపంచుకునేందుకు 1920లో న్యాయవాద వృత్తిని, పాట్నా విశ్వవిద్యాలయం సెనేట్, సిండికేట్ సభ్యత్వాలను త్యాగం చేశారు రాజేంద్రప్రసాద్. 1921లో ప్రభుత్వ కళాశాలలను బహిష్కరించమని పిలుపునిచ్చి, అదే సంవత్సరం జనవరి 5న తన స్వగృహంలోనే జాతీయ కళాశాలను ప్రారంభించారు. తన జీవితంలో అనేక విద్యా సంస్థలతో సంబంధ, బాంధవ్యాలను ఏర్పరచుకొని విద్యారంగానికి ఎనలేని సేవలు అందించారు. త్రిభాషా సూత్రాన్ని ప్రతిపాదించారు. గ్రామీణ విశ్వవిద్యాలయాల ఆవశ్యకతను విపులీకరించారు. మన విద్యావిధానం నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి దోహదం చేసేదిగా ఉండాలని ఆయన సూచించారు. గాంధీజీ ఆశయాలను ప్రచారం చేసే నిమిత్తం బిహార్‌లోని వివిధ ప్రాంతాలను సందర్శించి, అక్కడి వారి స్థితిగతులను ఆకళింపు చేసుకొని ప్రజలకు చేరువయ్యారు.

రాజేంద్రప్రసాద్ జాతీయ కాంగ్రెస్ కార్యదర్శిగా 1923లో పదవీ బాధ్యతలు చేపట్టారు. 1928లో విదేశీ యాత్రలు ప్రారంభించి అక్కడి ప్రజలతో యుద్ధ వ్యతిరేక ప్రచారాన్ని చేపట్టారు. భారతదేశ ఉద్యమాల గురించి బహుళ ప్రచారం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన 'సైమన్ గో బ్యాక్' పిలుపు అందుకొని రాజ్యాంగ సంస్కరణల కమిటీ బహిష్కరణోద్యమాన్ని బిహార్‌లో సమర్థంగా నిర్వహించారు. అనేకసార్లు బ్రిటిష్ ఖాకీల దౌర్జన్యానికి గురయ్యారు. అయినా మొక్కవోని ధైర్యంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను నడిపారు. 1934 నుంచి 1940 వరకు కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ స్వర్ణోత్సవాలను 1935లో సమర్థంగా నిర్వహించారు. అదే సంవత్సరంలో 'సంపూర్ణ స్వరాజ్యం' కోసం పిలుపునిచ్చారు. 1939లో కాంగ్రెస్ నాయకులను సంప్రదించకుండా యుద్ధం ప్రకటించినందుకు నిరసనగా ప్రాంతీయ ప్రభుత్వాల నుంచి కాంగ్రెస్ వాదులు అందరినీ రాజీనామా చేయించారు. అలా యుద్ధ సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సహాయ నిరాకరణోద్యమాన్ని చేపట్టారు. 1941 మే నెలలో ఉవ్వెత్తున లేచిన మత కలహాలను తన చర్యల ద్వారా, వాగ్ధాటితో అదుపు చేశారు. బాధితులను స్వయంగా పరామర్శించి కాంగ్రెస్ సేవా దళాలను స్థాపించి ఆదుకున్నారు.

ఆపద్ధర్మ ప్రభుత్వంలో 1946లో వ్యవసాయ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు కృషి చేశారు. వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకు 'గ్రో మోర్ ఫుడ్' అనే నినాదాన్ని ఇచ్చారు. అదే సంవత్సరం డిసెంబర్‌లో రాజ్యాంగపరంగా ఏర్పడిన అసెంబ్లీకి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆ పిమ్మట 1950, 1952, 1957 సంవత్సరాలలో స్వతంత్ర భారతావనికి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆయన సారథ్యంలో భరతమాత పునీతమైంది. తన అధికారాన్ని సామాన్య మానవుని సంక్షేమానికి వినియోగించిన కార్యదక్షుడు రాజేంద్రప్రసాద్. ఉన్నత విలువలను ప్రదర్శించి దేశ, విదేశీ ప్రముఖుల ప్రశంసలు అందుకున్న బాబూ రాజేంద్రప్రసాద్ చిరస్మరణీయుడు. 79వ ఏట 1963 ఫిబ్రవరి 28న ఆయన తన జీవన యాత్రను ముగించారు. అదే ఏడాది భారత ప్రభుత్వం ఆయనకు 'భారతరత్న'ను ప్రకటించింది.

– పి.బి.ఆర్. ప్రసాదరావు

(నేడు బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి)

వికలాంగులకూ రాజకీయ రిజర్వేషన్లు

రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడంతో వికలాంగులు మరింత వివక్షకు గురవుతున్నారు. తెలంగాణలో 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాలో 2.1శాతం మంది అంగవైకల్యం ఉన్నవారు ఉన్నారు. 2014లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 10,46,820 మంది వికలాంగులు ఉన్నారు. అయితే ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, లండన్‌లోని స్కూల్ ఆఫ్ హైజిన్ అండ్ ట్రోపికల్ మెడిసిన్ సర్వే ప్రకారం 43.02 లక్షల మంది వికలాంగులు ఉన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 73 సంవత్సరాలు పూర్తయ్యాయి. రాజ్యాంగంలో పేర్కొన్న స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం వంటివి వికలాంగులకు అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. ఆర్టికల్ 14 నుంచి 19 వరకు సమాజంలోని పౌరులందరు సమానమేనని ఎలాంటి వివక్ష ఉండరాదని పేర్కొంది. కానీ ఇవేవీ వికలాంగులకు దక్కడం లేదు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, 2017 ఇంటర్ హెల్త్‌కేర్, నేషనల్ ట్రస్ట్, ఆటిజం యాక్ట్ ఐక్యరాజ్యసమితి హక్కుల ఒప్పందం వంటి అనేక చట్టాలను అమలు చేయాలనే చిత్తశుద్ధి కనిపించడం లేదు.



వికలాంగుల సమస్యలను పరిష్కరించి వారికి ఆసరా నిచ్చి, వారు గౌరవంగా జీవిస్తూ సాధారణ జనజీవనంలో భాగమై అన్ని హక్కులు పొందేలా చూడడం కోసం 1992లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవం మొదలయింది. 1998 నుండి ప్రతి సంవత్సరం వికలాంగులకు సంబంధించిన ఒక అంశంతో అన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. కానీ ఆచరణలో తూతుమంత్రంగా దినోత్సవం జరపడం, వికలాంగుల హక్కుల గురించి అందాల్సిన ఫలాల గురించి ఊకదంపుడు ఉపన్యాసం ఇవ్వడం, ఆ తర్వాత మర్చిపోవడం అనేది ఒక ఆనవాయితీగా వస్తుంది. ఇక రాజకీయ పార్టీలు వికలాంగుల విభాగం ఏర్పాటు చేసుకోవడం, అధికారంలోకి వచ్చిన పార్టీలో వికలాంగుల విభాగానికి చెందిన వారికి ఒక నామినేటెడ్ వికలాంగుల చైర్మన్ పోస్ట్ ఇవ్వడంతో చేతులు దులుపుకుంటున్నాయి. వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు అందించడం ద్వారా వారి రాజకీయ ప్రాతినిధ్యంతో అవకాశాలని పెంచుకోవచ్చు. భారత రాజ్యాంగం వికలాంగులకు సమాన హక్కులు, అవకాశాలను కల్పించడానికి అనేక చట్టాలు విధానాలు రూపొందించింది. కానీ అవి అమలు కాకపోవడానికి కారణం వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడమే అని చెప్పనవసరం లేదు. వికలాంగులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం వల్ల వారి హక్కులు అవసరాలు, సమస్యలపై స్థానిక సంస్థలు నుంచి చట్ట సభల వరకు గళమెత్తి ప్రశ్నించడానికి పోరాడటానికి తోడ్పడుతుంది. విద్య, ఉపాధి సామాజిక ఆర్థిక ఆత్మగౌరవ అసమానతలపై ప్రశ్నించి వాటిని సాధించుకోవడానికి రాజకీయ రిజర్వేషన్లు అనేది ఎంతైనా అవసరం ఉంది.

– ప్రహ్లాద్

(నేడు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం)

కార్మికుల పెన్షన్ కార్పొరేట్ల పరం!

ఇరవై ఐదు సంవత్సరాల పాటు ఒక ప్రభుత్వ రంగ పరిశ్రమలో పనిచేసి నెలకు ఏభై వేల రూపాయలకు పైగా జీతం పొందిన ఒక కార్మికుడు పదవీ విరమణ తర్వాత కేవలం రెండువేల రూపాయల లోపు మాత్రమే పెన్షన్ పొందడం నమ్మశక్యం కాని విషయం. కానీ ఇది వాస్తవం. ఇపిఎస్-95 పేరుతో దేశంలో ప్రవేశపెట్టిన పెన్షన్ పథకం కార్మికుల పొదుపు సొమ్మును హరించి కార్పొరేట్లకు ధారాదత్తం చేసే విధాన ఫలితం.

మన దేశంలో కార్మికులకు ఉన్న హక్కులను ఒకటొకటిగా హరిస్తున్న వేళ విచిత్రంగా కేంద్ర ప్రభుత్వం కార్మికులు కోరకుండానే వారికి ఒక పెన్షన్ పథకాన్ని చాలా ఉదారంగా ప్రవేశపెట్టింది. కార్మికులు వద్దన్నా వినలేదు. కనీసం ఇందులో చేరాలా వద్దా అనే ఆప్షన్ ఇమ్మన్నా ఇవ్వలేదు. కార్మికులపై ఎందుకింత ప్రేమ అని కొద్దిగా పరిశీలిస్తే 1991 నుంచి దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద విధానాలలో భాగమే ఈ పెన్షన్ పథకం అని సులువుగానే అర్థమవుతుంది.

1995లో నాటి పివి నరసింహారావు ప్రభుత్వం అప్పటి వరకు అమలులో ఉన్న ఉద్యోగుల భవిష్య నిధి (పిఎఫ్) చట్టం 1952ను సవరించి, ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ ఇపిఎస్-95 పేరున ఒక కొత్త చట్టాన్ని చేసింది. ఈ పెన్షన్ చట్టం ప్రకారం అప్పటివరకు కార్మికుల భవిష్యనిధిలో ఉన్న యాజమాన్యం వాటా భాగం 8.33శాతం, ప్రభుత్వ వాటా 1.16 శాతం ఈ పెన్షన్ నిధికి మళ్ళించబడుతుంది. ఈ నిధి నుండి ప్రతినెల పిఎఫ్ డిపార్టుమెంట్ పెన్షన్లు చెల్లిస్తుంది.

ఈ పథకం వల్ల కార్మికులకు వచ్చే సంక్షేమం కంటే కార్మికులు పొదుపు సొమ్మును కోల్పోవడమే అధికంగా ఉంటుందని ఆనాడే కొన్ని కార్మిక సంఘాలు ముఖ్యంగా సిఐటియు వంటి కేంద్ర సంఘాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. కొన్ని యూనియన్లు దీనిపై దేశంలోని వివిధ రాష్ట్ర హైకోర్టులలో కేసులు కూడా వేశాయి. ఈ కేసులపై కొన్ని హైకోర్టులు ఈ పథకం అమలుపై స్టే ఉత్తర్వులు కూడా ఇచ్చాయి. ఈ కేసులన్నీ చివరకు సుప్రీంకోర్టుకు చేరాయి. దీనిని తరచూ సమీక్షిస్తూ ఉంటామని, పథకాన్ని మరింత పటిష్టపరుస్తామనే అనేక హామీలు ప్రభుత్వం ఇవ్వడంతో సుప్రీంకోర్టు ఈ పథకం అమలుకు అనుమతించింది. ఈ విధంగా కార్మికుల ఆమోదం లేకపోయినా, వివిధ యూనియన్లు ప్రతిఘటించినా ఈ పథకం 1995 నుండి అమలులోకి వచ్చింది.

ఈ పెన్షన్ పథకం ప్రత్యేకత ఏమిటంటే దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఎల్ఐసి, బ్యాంకు ఉద్యోగులకు, ఇతర సంస్థలలో ఉన్న పెన్షన్ పథకాలలోని ఒక్క అనుకూల అంశం కూడా ఇందులో లేకపోవడమే. వీటికి భిన్నంగా ప్రతికూలంగా ఉండే అనేక అంశాలు ఈ పథకంలో ఉన్నాయి.

ఉదాహరణకు మిగిలిన అన్ని పెన్షన్ పథకాలలో పెరిగిన ధరలకు అనుగుణంగా కరువు భత్యం ఉండగా ఈ పథకంలో అది లేదు. అన్ని పెన్షన్ పథకాల్లోనూ పదవీ విరమణ సమయంలో పెన్షన్‌లోని కొంత మొత్తాన్ని కమ్యూట్ చేసుకుని, ఒకేసారి పెద్ద మొత్తాన్ని తీసుకునే అవకాశం ఉండగా, ఈ పెన్షన్ పథకంలో మాత్రం ఆ సదుపాయం లేదు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆఖరి నెల జీతం ఆధారంగా పెన్షన్ లెక్కిస్తే, ఈ పథకంలో మాత్రం కార్మికుని ఆఖరి అరవై నెలల జీతం సగటు తీసుకుని దాని ఆధారంగా పెన్షన్ లెక్కిస్తారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 20 సంవత్సరాల సర్వీసు పూర్తయితే పూర్తి పెన్షన్ పొందడానికి అర్హత రాగా, ఇక్కడ మాత్రం 33 సంవత్సరాల సర్వీసుకు గాని ఆ అర్హత రాదు. ఇలాంటి అనేక లోపాల వల్ల పెన్షన్ చాలా తక్కువగా ఉంటోంది.

> ప్రభుత్వం కార్మికులకు ఉచితంగా దయాధర్మంగా ఏమీ పెన్షన్ ఇవ్వనవసరం లేదు. పెన్షన్ నిధి నుండే, అది కూడా దానిపై వచ్చే వడ్డీ నుండే వివిధ కార్మిక, పెన్షనర్ల సంఘాలు కోరుతున్నట్లుగా కనీస పెన్షన్ తొమ్మిది వేల రూపాయలకు పెంచడం, కరువు భత్యం చెల్లించడం, కమ్యూట్ చేసుకునే అవకాశం, ఐదేళ్లకు ఒకసారి పెన్షన్ సవరించడం వంటివి నిక్షేపంగా చేయవచ్చు. అయితే దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలను అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం అలా చేస్తుందా అన్నదే అసలు ప్రశ్న



పెన్షన్ పొందే జీతం పరిమితిని కూడా మొదట రూ.6,500గా నిర్ణయించారు. తరువాత దానిని రూ.15,000కు పెంచారు. పూర్తి జీతంపై హయ్యర్ పెన్షన్ అనుమతించాలని, సుప్రీంకోర్టు 2022 నవంబరులో తీర్పు ఇచ్చి రెండేళ్లు గడిచినా నేటికీ అమలు కాలేదు సరికదా ఈ పేరున పదిహేడున్నర లక్షల మంది పెన్షనర్ల నుండి రూ.1,86,920 కోట్లు వసూలు చేసి, ఆ సొమ్మును ప్రభుత్వం తొక్కిపెట్టింది. ఇది పచ్చి దగా.

విచిత్రమేమిటంటే అనేక మందికి 100, 150, 200 రూపాయలు పెన్షన్ వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. పెద్ద ఎత్తున ఒత్తిడి రావడంతో చివరకు ప్రభుత్వం కనీస పెన్షన్‌ను వెయ్యి రూపాయలకు 2017లో పెంచింది. దీనివల్ల 36.4 లక్షల మంది లాభపడ్డారని ఘనంగా ప్రకటించుకుంది. కానీ దీన్ని బట్టే తెలుస్తున్నదేమిటంటే అంత మందికి అప్పటి వరకు వెయ్యి రూపాయల లోపే పెన్షన్ ఉందని. దీనికి ప్రభుత్వం సిగ్గు పడవలసింది పోయి, తిరిగి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరమే. ఇప్పటికీ వెయ్యి రూపాయల లోపు పెన్షన్ వస్తున్నవారు కూడా ఉన్నారు. అత్యధికమందికి వచ్చే పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వృద్ధాప్య పెన్షన్ కంటే కూడా తక్కువగా ఉంటోంది.

2024లో ఈ పథకం ద్వారా 78.5 లక్షల మందికి పెన్షన్ చెల్లించారు. ఇందులో 46.6 శాతం మందికి వెయ్యి, అంతకంటే తక్కువ; 85 శాతం మందికి రూ.2,500 లోపు మాత్రమే పెన్షన్ వస్తోందని వీరి గణాంకాలు తెలుపుతున్నాయి. ఐదు వేల రూపాయలకు పైగా పెన్షన్ పొందుతున్నవారు కేవలం 29,608 మంది; అంటే మొత్తం పెన్షన్ దారులలో కేవలం 0.37శాతం మంది. సగటు పెన్షన్ కేవలం రూ.1578 మాత్రమే. ఫలితంగా అనేకమంది పెన్షనర్లు కడు పేదరికంలో మగ్గుతున్నారు.


అందువల్లే దీని కార్పస్ ఫండ్ 2018లో 4లక్షల 37వేల కోట్ల రూపాయల నుంచి 2024 నాటికి 8లక్షల 88వేల కోట్లకు అంటే ఆరేళ్ల కాలంలో ఏకంగా రెట్టింపుకు పైగా పెరిగింది. ఈ సొమ్మును ప్రభుత్వం మిగిలిన పిఎఫ్ నిధులతో పాటు, వివిధ సంస్థలలో పెట్టుబడులుగా పెడుతోంది. ఇలా కార్మికుల పొదుపు కార్పొరేట్ల పాలవుతోంది. కార్మికుల ఖాతా నుంచి ఈ పెన్షన్ నిధికి మళ్లిస్తున్న సొమ్ము ఎంత, దానిపై వచ్చే వడ్డీ ఎంత, కార్మికునికి పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం చెల్లిస్తున్న పెన్షన్ ఎంత, అనే ఈ మూడు అంశాలను పరిశీలిస్తే చాలా ఆశ్చర్యకరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

ఇప్పుడు ఈ పెన్షన్ పొందే జీతం యొక్క గరిష్ఠ పరిమితి రూ.15వేలుగా ఉంది. అంటే కార్మికునికి రూ.15వేల జీతం నుండి ప్రతినెల 8.33శాతం చొప్పున పెన్షన్ ఫండ్‌కు అయ్యే జమ, ప్రభుత్వ వాటా 1.16శాతం కలిస్తే, ప్రతి నెల రూ.1420 చొప్పున 25 ఏళ్ల సర్వీసులో మొత్తం రూ.4,26,000. దీనిపై ప్రస్తుతం పిఎఫ్‌పై ఉన్న వడ్డీ రేటు 8.25 శాతం ఆధారంగా 25 ఏళ్ల చివరకు వచ్చే వడ్డీ రూ.10,25,725. అంటే- అసలు, వడ్డీ కలిపి మొత్తం రూ.14,51,725 అవుతుంది. దీనిపై ఇప్పుడు సీనియర్ సిటిజన్లకు బ్యాంకులలో ఉన్న వడ్డీ రేటు 8.4 శాతం రేటు చొప్పున నెలకు రూ.10,162 వడ్డీ వస్తుంది. కానీ నేడు ఇదే కార్మికుడికి ఈ పథకం ద్వారా వచ్చే గరిష్ఠ పెన్షన్ నెలకు కేవలం రూ.5,785 మాత్రమే. దీనర్థం ఏమిటంటే కార్మికుని పొదుపు సొమ్ముపై వచ్చే వడ్డీ కంటే కూడా తక్కువగా పెన్షన్ ఉంది. మరి అసలు పొదుపు సొమ్ము అంతా స్వాహా అవడం కాదా ఇది. దీనితో పాటు నాడు సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీలు కూడా ప్రభుత్వం అమలు చేయడం లేదు. సరికదా నాడున్న సౌకర్యాలనే కొన్నిటిని ఎత్తివేశారు. అందువల్ల దీన్ని కార్మికుల సంక్షేమం అనడం కంటే, కార్పొరేట్ల సంక్షేమ పథకం అనడం సబబుగా ఉంటుంది. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ పెద్దలు దీనిని సవరిస్తామని హామీ అయితే ఇచ్చారు కానీ, మూడోసారి అధికారం లోనికి వచ్చినా, ఇంకా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

ప్రభుత్వం కార్మికులకు ఉచితంగా దయాధర్మంగా ఏమీ పెన్షన్ ఇవ్వనవసరం లేదు. కార్మికుల పొదుపు సొమ్ము అయిన పెన్షన్ నిధి నుండే, అది కూడా దానిపై వచ్చే వడ్డీ నుండే వివిధ కార్మిక, పెన్షనర్ల సంఘాలు కోరుతున్నట్లుగా కనీస పెన్షన్ తొమ్మిది వేల రూపాయలకు పెంచడం, కరువు భత్యం చెల్లించడం, కమ్యూట్ చేసుకునే అవకాశం, ఐదేళ్లకు ఒకసారి పెన్షన్ సవరించడం వంటివి నిక్షేపంగా చేయవచ్చు. అయితే దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే నయా ఉదారవాద విధానాలను మరింత స్పీడుగా అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం అలా చేస్తుందా అన్నదే అసలు ప్రశ్న. దేశానికి అనేక విధాలుగా సేవలందించిన, ఈ సీనియర్ సిటిజన్ల పొదుపును దోచుకోవడమే కాక, వారి న్యాయమైన డిమాండ్లను సైతం నిర్లక్ష్యం చేయడం క్షంతవ్యం కాదు. ఈ పని చేయకుండా సీనియర్ సిటిజన్లకు ఏదో చేసేశామని గొప్పలు చెప్పుకోవడం సభ్యత అంతకంటే కాదు.

● ఎ. అజ శర్మ

ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మర పట్టి సివిల్ సప్లయీస్ శాఖకు బియ్యంగా అప్పగించాల్సి ఉంది. అయితే మిల్లర్లు దర్జాగా సీఎంఆర్‌ను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సీఎంఆర్‌లో రూ.91.80కోట్ల అవినీతి జరిగినట్టుగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ సైతం గుర్తించింది. అయితే అక్రమార్కులు క్రిమినల్ కేసులు పెట్టి, నోటీసులు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకొన్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు అక్రమాలకు పాల్పడిన మిల్లర్లకు కొందరు ప్రజాప్రతినిధులు మద్దతుగా, ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో కోర్టుల ద్వారా స్టే తెచ్చుకుని కోట్లు కొల్లగొట్టే పనిలో మిల్లర్లున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సర్కారు బియ్యంతో మిల్లర్ల బిజినెస్..

సర్కారు సొమ్ముతో.. మిల్లర్ల సోకు!

ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో రూ.91.80కోట్ల సీఎంఆర్ స్వాహా

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొందరు మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2023-24 సంవత్సరంలోని ఖరీఫ్‌లో 4,26,576 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. ఈ ధాన్యాన్ని మరాడించి 2,85,972 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.30లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు అప్పగించారు. అలాగే యాసంగిలో 5,16,974 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. 3.30 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇచ్చినట్టుగా సమాచారం. మొత్తం 9,43,550 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మరాడించేందుకు (సీఎంఆర్) మిల్లర్లకు అప్పగించింది. మిల్లర్లు క్వింటా వడ్లకు 67కిలోల చొప్పున కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలి. వడ్లను మరాడించినందుకు ప్రభుత్వం మిల్లర్లకు చార్జీలు చెల్లిస్తోంది. అయితే నిర్ణీత సమయంలో మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి బియ్యాన్ని అప్పగించాల్సి ఉన్నా మిల్లర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. సీఎంఆర్‌ను పక్కదారి పట్టించారు. ప్రభుత్వ బియ్యంతో మిల్లర్లు పైసా ఖర్చు లేకుండా దర్జాగా రూ.కోట్లల్లో వ్యాపారం చేసి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.91.80కోట్ల సీఎంఆర్ స్వాహా చేశారు..

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)లో భారీ అక్రమాలు జరిగాయి. మిల్లర్లకు ప్రభుత్వం అప్పగించిన ధాన్యాన్ని మరాడించి పౌరసరఫరాల శాఖకు అప్పగించాల్సి ఉంటుంది. అయితే పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకుండా.. మరాడించిన బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో అమ్మేసుకున్నారు. సీఎంఆర్ కోసం పలుమార్లు గడువులు విధించిన మిల్లర్లు స్పందించకపోవటంతో ఇటీవల విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 16 రైస్‌మిల్లులపై దాడులు నిర్వహించింది. దీంతో ప్రభుత్వ బియ్యంతో రేషన్ దందా చేసిన మిల్లర్ల బాగోతం వెలుగులోకి వచ్చింది. వరంగల్ జిల్లాలో నాలుగు మిల్లుల్లో రూ.12.43కోట్ల సీఎంఆర్‌ను పక్కదారి పట్టించినట్టుగా గుర్తించారు. సీఎంఆర్‌ను అమ్ముకున్న గీసుకొండ మండలం గొర్రెకుంటలోని జయ ఇండస్ట్రీస్, చెన్నారావుపేట మండలం అక్కల్‌చెడులోని లక్ష్మీగణపతి రైస్ మిల్, పాత ముగ్ధంపురంలోని శ్రీవీరభద్రస్వామి రైస్‌మిల్, సంగెం మండలం పల్లారిగూడలోని శ్రీ మహాలక్ష్మి మోడ్రన్ రైస్ మిల్లులను డిఫాల్టర్‌గా గుర్తించారు. అలాగే హనుమకొండ జిల్లాలో రెండు మిల్లులో రూ.7.30కోట్ల బియ్యాన్ని మిల్లర్లు దారి మళ్లించి సొమ్ము చేసుకున్నారు. ఎల్కతుర్తి మండలం పెంచికలపేట గ్రామంలోని శ్రీబాలాజీ ఇండస్ట్రీస్, ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలోని నారాయణ ఆగ్రో ఇండస్ట్రీస్‌ల్లో సీఎంఆర్ అక్రమాలను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అలాగే అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో ఐదు మిల్లుల నుంచి రూ.54.80కోట్ల సీఎంఆర్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలించి.. ప్రభుత్వం సొమ్ముతో మిల్లర్లు కోట్లు దండుకున్నారు.

- ప్రభుత్వ బియ్యంతో మిల్లర్ల వ్యాపారం
- 16 రైస్‌మిల్లుల్లో సీఎంఆర్ అమ్ముకున్న వారిపై క్రిమినల్ కేసులు
- మిల్లర్లకు ఆర్ఆర్ యాక్టు కింద నోటీసులు ఇచ్చిన అధికారులు
- డిఫాల్టర్ల నుంచి రికవరీ చేయకుండా రెవెన్యూపై ఒత్తిళ్లు
- కోర్టుకెళ్లి ఉత్తర్వులు తెచ్చుకునేలా అధికారులు సహకరిస్తున్నారని ఆరోపణలు

కురవి, మరిపెడ, కేసముద్రం, గూడూరు మండలాల్లో ఐదు మిల్లుల్లో భారీగా సీఎంఆర్ మింగేశారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 16 మిల్లుల నుంచి రూ.91.80కోట్ల విలువైన సీఎంఆర్‌ను అక్రమంగా మిల్లర్లు అమ్ముకున్నారు. దీంతో మిల్లర్లపై స్థానిక పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

నోటీసులతోనే సరి.. ఆర్ఆర్ యాక్ట్ ఏమాయె?

మిల్లర్లపై చర్యలకు అధికారులు వెనుకాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 16 మిల్లుల్లో రూ.91.80 కోట్ల బియ్యాన్ని పక్కదారి పట్టించినట్టుగా విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారు. దీంతో అక్రమాలకు పాల్పడిన మిల్లర్ల నుంచి మొత్తాన్ని రికవరీ చేసేందుకు ప్రభుత్వం రెవెన్యూ రికవరీ యాక్టును ప్రయోగించాలని సూచించింది. దీంతో రంగలోకి దిగిన సివిల్ సప్లయీస్, రెవెన్యూ శాఖ అధికారులు అక్రమాలకు పాల్పడిన మిల్లర్లకు ఆర్ఆర్ యాక్ట్ కింద నోటీసులు జారీ చేశారు. పెద్ద మొత్తంలో సీఎంఆర్ పక్కదారి పట్టడంతో అధికారులు మిల్లర్ల నుంచి రికవరీకి తీవ్ర ప్రయత్నాలు చేస్తారని భావించినా ఐదారు నెలలుగా నోటీసులు ఇచ్చిన మిల్లర్లపై ఎలాంటి చర్యలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పక్కదారి పట్టిన సీఎంఆర్ వివరాలు

జిల్లా	డిఫాల్టర్ మిల్లులు	సీఎంఆర్ విలువ
వరంగల్	04	రూ.12.43 కోట్లు
హనుమకొండ	02	రూ.7.30 కోట్లు
మహబూబాబాద్	05	రూ.54.80 కోట్లు
భూపాలపల్లి	02	రూ.4.30 కోట్లు
ములుగు	02	రూ.7.30 కోట్లు
జనగామ	01	రూ.5.67 కోట్లు
మొత్తం	16	రూ.91.80 కోట్లు

మిగతా 8వ పేజీలో...



ఓరుగల్లు జూపార్కుకు రెండు పెద్దపులులు

- నాలుగు మూషిక జింకలు కూడా..
- హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన అధికారులు
- పెరగనున్న సందర్శకుల తాకిడి

8



పాలకవర్గ నియామకమెప్పుడో?

- ఏనుమాముల మార్కెట్‌కు కమిటీ లేక పరేషాన్
- ఆసియాలోనే అతి పెద్ద మార్కెట్‌ను విస్మరిస్తున్న సర్కారు
- 15 నెలలుగా ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తున్న వైనం
- సమన్వయం లేని ఎమ్మెల్యేలు, పట్టించుకోని ఇన్‌చార్జ్ మంత్రి
- సమస్యలతో సతమతమవుతున్న రైతులు

6

ఫిర్యాదులు పదే పదే రాకుండా చూడండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ ప్రజావాణిలో ప్రజలు ఒకే సమస్యపై పదే పదే ఫిర్యాదులు చేస్తున్నారని ఫిర్యాదు చేయగానే అధికారులు సకాలంలో స్పందించి సమస్య పరిష్కరిస్తే తిరిగి ఎందుకు ఫిర్యాదు చేస్తారని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను హెచ్చరించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయ ఆవరణలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజావాణి జరుగుతున్న సమయంలో కొంతసేపు విద్యుత్ నిలిచిపోవడంతో కౌన్సిల్ హాల్ మొత్తం అంధకారంగా మారింది. అధికారులు సైతం సెల్‌ఫోన్ వెలుగుల మధ్య ఫిర్యాదులు స్వీరించారు. కాగా, ప్రజల సమస్యలపై స్పందించని అధికారులు, సిబ్బందిని ఇకపై సహించేది లేదని విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా టౌన్‌ప్లానింగ్ విభాగంపై తరుచుగా ఫిర్యాదులు వస్తున్నాయని అధికారుల పనితీరు సరిగా లేదని మండి పడ్డారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 66 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోజా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో బొమ్మన రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, కృష్ణారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఇంజనీరింగ్ - 16, హెల్త్, శానిటేషన్ - 6, ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ - 2, టౌన్‌ప్లానింగ్ - 39, తాగునీటి సరఫరా - 2, సాధారణం- 01 మొత్తం 66 ఫిర్యాదులు అందినట్టు అధికారులు వెల్లడించారు.

అధికారులకు అందిన ఫిర్యాదులు..

- గ్రేటర్ వరంగల్ 26వ డివిజన్ 13వ బ్లాకు లక్ష్మీపురంలో గత వారం రోజులుగా మంచి నీరు రావడం లేదు. ఈ సమస్యపై అధికారులకు ఎన్ని మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ అధ్యక్షుడు పోలెపాక సీతయ్య కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ చింతల్‌ప్రాంతంలో ఉన్న హిందూ శ్మశాన వాటికలో సరైన సదుపాయాలు లేవని, అధికారులు స్పందించి తగిన ఏర్పాట్లు చేయాలని బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి ఆడెపు వెంకటేశ్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.
- హనుమకొండ 50వ డివిజన్ విద్యానగర్, న్యూ బృందావన్ కాలనీలో చాలా కాలంగా డ్రైయినేజీ నిర్మించలేదని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ 31వ డివిజన్ న్యూశాయంపేట డాక్టర్స్ కాలనీలో సుమారు వంద కుటుంబాలు 20సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాయనీ, కానీ కాలనీకి రావడానికి సీసీ రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని వెంటనే సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు కమిషనర్‌ను కోరారు.

కోటలో ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు



- అద్భుతంగా సాగిన నృత్యరూప కళా ప్రదర్శనలు
- పాల్గొన్న అధికారులు

కళాకారుల నృత్యాలు, ఆసీనులైన వరంగల్ కలెక్టర్ సత్యశారద, ఇతర అధికారులు

ఖిలావరంగల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మధ్యకోటలోని కీర్తి తోరణాలు, శిల్పాల ఆవరణలో ప్రజాపాలన విజయోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ అలేఖ్య పుంజులా బృందం ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కళారూపాలు ఆకట్టుకున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల గురించి తమ ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, పేదలకు రూ.10లక్షల వరకు ఉచిత ఆరోగ్యబీమా, రైతులకు రు.2లక్షల రుణమాఫీ, ఉద్యోగ నియామకాల గురించి విస్తృత ప్రచారం చేశారు. బతుకమ్మ, బోనాల పండుగను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. పోతరాజుల నృత్యాలు ఆకర్షించాయి. అంతకు ముందు వరంగల్ జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన పాటలు, నృత్యాలు ప్రజాపాలన విశిష్ఠతను చాటాయి. 'పట్టుకో కాంగ్రెస్ జెండా, చుట్టుకో నీ గుండెల నిండా'.. మూడు రంగుల జెండా పట్టి.. సింగమోలే దూకినాడు రేవంతన్నా.. జయజయయే తెలంగాణ జననీజయకేతనం తదితర గీతాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారద, రాష్ట్ర నృత్య నాటక అకాడమీ కార్యదర్శి మనోహర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీపీఆర్‌వో ఆయూబ్ అలీ, డీఈవో జ్ఞానేశ్వర్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి బాలకృష్ణ, తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు, కార్పొరేటర్లు వెల్పుగొండ సువర్ణ-సురేష్, భైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు బెడిద వీరన్న, బోయిని దూడయ్య రెవెన్యూ అధికారులు, అంగన్‌వాడి, ఆశాకార్యకర్తలు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేయాలి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, జడ్జి రమేశ్‌బాబు


వరంగల్ మెడికల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం భద్రకాళి దేవాలయం నుంచి నిర్వహించిన ర్యాలీని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సీహెచ్.రమేశ్ బాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ముఖ్యంగా యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ నియంత్రణకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న పాత్ర ప్రశంసనీయమన్నారు. ఈ ర్యాలీ కాకతీయ మెడికల్ కాలేజీలోని ఎన్ఆర్ఐ ఆడిటోరియం వరకు ప్లకార్డులు, బ్యానర్లు చేతబూని నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కేఎంసీలోని ఎన్ఆర్ఐ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌వో అప్పయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి క్షేమదేశ్ పాండే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ హెచ్ఐవీ నియంత్రణలో యువత పాత్ర ముఖ్యమైందన్నారు. అనంతరం డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ అందరి సమష్టికృషి వల్ల ఎయిడ్స్‌పై అవగాహన చాలా వరకు పెరిగిందని, ఐనప్పటికీ ఇంకా పాజిటీవ్ కేసులు నమోదు అవుతూనే ఉన్నాయని అన్నారు. హెచ్ఐవీ పాజిటీవ్ ఉన్నవారు మనోధైర్యంతో ముందుకు సాగాలని చికిత్స పూర్తి తీసుకుంటూ ఇతరులకు వ్యాధి సోకకుండా తమవంతు పాత్ర నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ప్రతీ నెల కొత్తగా 5 హెచ్ఐవీ కేసులు నమోదు అవుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, జిల్లా అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, కేయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రొఫెసర్ నారాయణ, కె.శ్రీనివాసరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్లు అంబరీష్, సునీత, కె.లలితాదేవి, హిమబిందు, ఇఫ్తాకర్ అహ్మద్ పాల్గొన్నారు.

పోలీస్‌శాఖలో కలవరం!

ప్రజలకు ధైర్యం చెప్పాల్సిన వారే తనువు చాలిస్తున్నారు

హరీశ్ ఆత్మహత్య ఘటనతో భయాందోళన

6



ఎస్సై హరీశ్ (ఫైల్)

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు షురూ

- ప్రారంభించిన కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి
- వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న విద్యార్థులు
- వేదిక డీఎస్ఏ బాక్సింగ్ హాల్

8

పూడికతీత పనుల్లో వేగం పెంచండి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- 'భద్రకాళి'పై కుడా కార్యాలయంలో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో వేగం పెంచాలని, వచ్చే వర్షాకాలం వరకు చెరువు నిండా నీరు ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకో వాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం హనుమకొండ కుడా (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయంలో హనుమకొండ జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భద్రకాళి చెరువు పూడికతీత, రోడ్లు వెడల్పు, పార్కింగ్, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. భద్రకాళి చెరువు నుంచి వెలువడుతున్న మట్టిని రైతులకు అందించే విధంగా చూడాలన్నారు. చెరువు పునరుద్ధరణ పనుల కోసం నిధుల విషయం ప్రభుత్వం చూస్తుందని పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. సీపీవో జంక్షన్ నుంచి ఎంజీఎం, హనుమాన్‌దేవాలయం నుంచి అలంకార్ జంక్షన్, కాంగ్రెస్ భవనం నుంచి కేయూసీ రోడ్డు వరకు, అంబేద్కర్ జంక్షన్ నుంచి ఎన్‌జీవోఎస్ కాలనీ వరకు, కాజీపేట జంక్షన్ నుంచి సోమిడి వరకు రోడ్ల విస్తరణ చేపట్టాలని అందుకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ముందుగా ఎంజీఎం జంక్షన్ నుంచి సీపీవో జంక్షన్ వరకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నగర సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా పనులు ఉండాలన్నారు. వరంగల్ నగరంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు చిరువ్యాపారుల సముదాయాలు ఏకీకృతం చేయాలనే ఉద్దేశంతో రూ. 9.40 కోట్లతో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌తో పాటు సమీకృత మార్కెట్‌లను అభివృద్ధి చేసి అన్ని ఒకే చోట దొరికే విధంగా చూడాలని అన్నారు.

సంక్రాతికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను అర్హులకు సంక్రాంతి పండగ కానుకగా అందించేందుకు అధికారులు సమాయాత్తం కావాలని రాజేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు వరంగల్ పశ్చిమ నియోజక వర్గం పరిధిలో 24 డివిజన్‌లకు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసి నివేదిక అందజేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, నగర మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా చైర్మన్ వెంకటరామిరెడ్డి, కుడా సీపీవో అజిత్‌రెడ్డితో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పాలకవర్గ నియామకమెప్పుడో?

- ఏనుమాముల మార్కెట్‌కు కమిటీ లేక పరేషాన్
- ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్‌ను విస్మరిస్తున్న సర్కారు
- 15 నెలలుగా ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తున్న వైనం
- సమన్వయం లేని ఎమ్మెల్యేలు, పట్టించుకోని ఇన్‌చార్జ్ మంత్రి
- సమస్యలతో రైతులు సతమతం



వరంగల్(ఏనుమాముల) ఏఎంసీ ప్రధాన ద్వారం

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆసియాలోనే రెండో అతి పెద్దదిగా చెప్పుకునే ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పాలకవర్గాన్ని ప్రకటించకపోవడంతో రైతులు, వ్యాపారులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా మార్కెట్ కమిటీపై దృష్టి సారించకపోవడం సరికాదని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని అనేక వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించిన ప్రభుత్వం.. వరంగల్ మార్కెట్ విషయానికి వచ్చేసరికి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతులు మండి పడుతున్నారు. మార్కెట్ కమిటీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రుల మధ్య సఖ్యత లేకపోవడం వల్లే పాలకవర్గం నియామకానికి ఎవరూ సహకరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మంత్రి కొండా సురేఖ స్పందించి మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాలకవర్గం లేకుండా 15 నెలలుగా ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ పరిధిలో 19 జిల్లాలు, వాటి పరిధిలో 119 వ్యవసాయ మార్కెట్ కమిటీల పర్యవేక్షణ చేయాల్సిన అధికారిని వరంగల్ మార్కెట్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా నియమించడంతో ఆయనపై పని భారం పెరిగిపోయింది. మార్కెట్‌లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించకుంటే చివరకు దాని ప్రభావం రైతులపై పడే అవకాశం ఉంది.

మార్కెట్ కమిటీకి పాలకవర్గం లేక అన్ని పనులు అధికారులే చూసుకోవాల్సి వస్తోంది. దీంతో సమస్యలు పరిష్కరించడంలో జాప్యంతో పాటు నిర్లక్ష్యమూ కనబడుతోంది. అదే పాలవర్గం ఉంటే ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేవారని రైతు సంఘాలు చెబుతున్నాయి.

ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య సఖ్యత లేకే జాప్యం ?

మార్కెట్ కమిటీ పరిధిలో వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మెల్యేలున్నా ముఖ్య భూమిక పోషించేది మాత్రం వరంగల్ తూర్పు, వర్ధన్నపేట ఎమ్మెల్యేలే. అయితే ఈ ఇద్దరి మధ్య సఖ్యత లేకనే మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకంలో జాప్యం జరుగుతోందనే విమర్శలున్నాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జోక్యం చేసుకుని వెంటనే పాలకవర్గాన్ని నియమించాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

ఈ సారి ఎస్సీ మహిళకు రిజర్వు

నిబంధనల ప్రకారం ఈ దఫా మార్కెట్ చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు కేటాయించాలి. దీంతో వరంగల్ తూర్పు, వర్ధన్నపేటకు సంబంధించిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు చైర్ పర్సన్ పదవిని దక్కించుకోవడం కోసం ఎమ్మెల్యే నాగరాజు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అలాగే వైస్‌చైర్మన్, పాలకవర్గ సభ్యులను నియమించాలని కోరుతూ కొందరు నాయకులు ఇప్పటికే వారికి దరఖాస్తు చేసుకున్నారు.

మార్కెట్లో రైతులకు ఇబ్బందులు

వరంగల్ మార్కెట్‌తో పాటు లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మా ర్కెట్లో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయల మార్కెట్లో సీసీ కెమెరాలు లేక దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పార్కింగ్ సమస్య ఉంది. అక్రమ లైసెన్సుల జారీ, దుకాణాల కేటాయింపు, షెడ్ల ని ర్మాణం తదితర సమస్యలు నెలకొన్నాయి. ఏనుమాముల మార్కెట్లో సైతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయలేదు. తూకం వేసే మిషన్లను కొత్తవి తెప్పించాల్సి ఉంది. మరోవైపు వైఫై సిగ్నల్ సమస్య తలెత్తుతోంది. దీంతో తూకం వేయడంలో జాప్యం జరిగి రైతులు ఇబ్బంది పడుతున్నారు.

పోలీస్‌శాఖలో కలవరం!

- ప్రజలకు ధైర్యం చెప్పాల్సిన వారే తనువు చాలిస్తున్నారు
- హరీశ్ ఆత్మహత్య ఘటనతో భయాందోళన



ఎస్సై హరీశ్ మృతదేహం

హనుమకొండ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వారు ప్రజలకు రక్షణ కల్పిస్తూ.. ధైర్యం చెబుతూ.. అభాగ్యులకు అండగా ఉండే పోలీసుల్లో కొందరు చిన్న చిన్న కారణా లకే ఆత్మస్థైర్యం కోల్పోతున్నారు. ఎన్నో నెలలు కష్టపడి, పుస్తకాలతో కుస్తీ పట్టి చివరికి పోలీసు కొలువు కొట్టి ప్రజల రక్షణగా, అభాగ్యుల అండగా నిలుస్తామని ప్రమాణం చేసి విధుల్లో చేరుతున్నారు. కానీ విధుల్లోకి చేరాక సర్వీసులో ఉన్న ఒత్తిళ్లతో పాటు వ్యక్తిగత సమస్యలకు కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తద్వారా కుటు ంబాలకు తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నారు. కొంత కాలంగా ఉమ్మడి జిల్లాలోని పోలీస్‌శాఖలో అధికారులు, సిబ్బంది ఆత్మహత్యలు చేసుకొని మరణించడం పోలీస్‌శాఖను తీవ్రంగా కలవరపెడుతోంది.

కుటుంబ కలహాలే ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయా..?

ఉమ్మడి జిల్లాలో జరిగిన పోలీసుల ఆత్మహత్యలు అన్నీ కుటుంబ కలహాలతోనే జరిగినట్టుగా పోలీసులు విచారణలో వెల్లడైంది. వారు విధులు నిర్వర్తించే పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎంతో మంది భార్య భర్తలు కుటుంబ సమస్యలతో వచ్చి న్యాయం చేయాలని వేడుకుంటే పరిష్కరించే పోలీస్ అధికారులు తమ సమస్యలను పరిష్కరించుకోవడంలో ఎందుకు ఒత్తిడికి గురువుతున్నారనేది అసలు సమస్య. ఆత్మహత్యలకు కుటుంబ కలహాలు ఒక్కటే కాదు.. చేయరాని పనులన్నీ చేసి చివరికి ముఖం చూయించుకోలేకా ఆత్మహత్యలకు పాల్పతుండొచ్చని కొంత మంది అభిప్రాయపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాల్లో పోలీసులు ఆత్మహత్యలు ఇలా..

- అక్టోబరు 13 వతేదీన మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ గూడబోయిన శ్రీనివాస్ తన దగ్గర ఉన్న తుపాకీతో కాల్చుకొని చనిపోయాడు.
- జనగామ టౌన్ ఎస్సై శ్రీనివాస్ భార్య స్వరూప రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా తీవ్ర ఒత్తిడికి గురైన శ్రీనివాస్ సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని చనిపోయాడు. గతేడాది ఏప్రిల్ 6న జరిగిన ఈఘటన చర్చనీయాంశమైంది.
- మహబూబాబాద్ పీఎస్‌లో రైటర్‌గా పనిచేసే మహిళా కానిస్టేబుల్ మౌలిక కుటుంబ కలహాల కారణంతో గతేడాది మార్చి 5న వరంగల్ పోచమ్మమైదాన్‌లోని తన ఇంట్లో ఉరేసుకుని మరణించింది.
- భద్రాచలం జిల్లా ఆశ్వరావుపేట ఎస్సైగా పనిచేస్తున్న వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటకు చెందిన శ్రీరాముల శ్రీనువాస్ అధికారులు, సిబ్బంది వేధిసున్నారని ఈ ఏడాది జూన్ 30న పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ జూలై 7న తనువు చాలించాడు.
- తాజాగా ములుగు జిల్లా వాజేడు ఎస్సై తన వ్యక్తిగత సమస్యలకు కుంగిపోయి సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని ప్రాణాలు తీసుకున్నాడు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

- కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్



ఏఐటీయూసీ శిక్షణా తరగతుల సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

ఖిలావరంగల్, డిసెంబర్ 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కేంద్ర ప్రభుత్వం 4 కోడ్‌లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన శివనగర్ తమ్మెర భవన్‌లో ఏఐటీయూసీ శిక్షణతరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రభుత్వం కార్మికులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. రద్దు చేసిన 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు లేబర్ విధానాలు రద్దు చేయాలని, స్కీం వర్కర్‌గా పని చేస్తున్న ఆశ, అంగన్‌వాడి, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, భవననిర్మాణ కార్మికులకు నెలకు రూ. 10వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని, రేషన్‌కార్డులు జారీ చేయాలని, రైతుభరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్డీ యూసుఫ్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శులు షేక్ బాషుమియా, పనాస ప్రసాద్, ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీ విభాగాధిపతిగా ప్రొఫెసర్ వాసుదేవారెడ్డి నియామకం



సవితాజ్యోత్స్నను సన్మానిస్తున్న మెట్టు రవి తదితరులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం నూతన విభాగాధిపతిగా ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు కెమిస్ట్రీ విభాగాధిపతిగా కొనసాగిన ప్రొఫెసర్ టి.సవితా జ్యోత్స్న నుంచి ప్రొఫెసర్ వాసుదేవారెడ్డి సోమవారం కెమిస్ట్రీ విభాగంలో బాధ్యతలు చేపట్టారు. కాగా ప్రొఫెసర్ టి. సవితాజ్యోత్స్నను విభాగంలో శాలువ, పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా సిబ్బంది సన్మానించారు.కార్యక్రమంలో రాష్ట్ర వర్సిటీల సీఐటీ యూ అధ్యక్షుడు మెట్టు రవి, ఇతర ఉద్యోగ సంఘం నేతలు పాల్గొన్నారు.

ఎంజీఎంలో నూతన ఓపీ ట్రయల్

వరంగల్ మెడికల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో కొత్తగా ఓపీ రిజిస్ట్రేషన్ సెంటరు ఏర్పాటు చేశారు. సోమవారం ఓపీ ట్రయ్‌లో భాగంగా రోగులకు ఓపీ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ నెల 5వ తేదీన అధికారికంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంజీఎం అధికారులు తెలిపారు. ట్రయల్ రన్‌లో రోగులు అవసరాలు గమనించి 5న ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓపీ రిజిస్ట్రేషన్ సెంటర్ ఉండేలా చూడడమే లక్ష్యంగా ప్రణాళిక చేసినట్లు అధికారులు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బచ్చన్నపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి చిన్నరామన్‌చర్లలో చోటుచే సుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం గుండ మల్లేశం(32) గ్రామ బీరప్ప గుడి సమీపంలో చెట్టుకు ఉరివే సుకోగా, స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించా రు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఎస్‌కే హమీద్ ఘటనాస్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతుడికి భార్య హేమలత, కుమారుడు, కూతురున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మల్లేశం వ్యవసాయ, కూలి పనులు చేసుకుని జీవిస్తున్నాడు.

వివాహిత అనుమానాస్పద మృతి

అత్తింటి వారే హత్య చేశారంటున్న తల్లిదండ్రులు



దివ్య(ఫైల్)

సంగెం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సక్రియ తండాకు చెందిన ఓ వివాహిత మృతి కలకలం రేపింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని అత్తింటివారు చెబుతుండగా వారే హత్య చేశారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం మండలం జాటోతు తండాకు చెందిన జాటోతు రవీందర్ కూతురు దివ్య(22)ను ఇదే మండలం సక్రియ తండకు చెందిన గుగులోతు పవన్‌కు ఇచ్చి 2021లో వివాహం జరిపించారు. వీరికి ఒక కూతురు ఉంది. అయితే పవన్ తన వదినతో వివాహేతర సంబంధం పెట్టుకొని దివ్యను మానసికంగా, శారీకంగా చిత్రహింసలకు గురిచేస్తుండటంతో విధిలేని పరిస్థితిలో ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో గత సెప్టెంబరు 6న పెద్దమనుషుల సమక్షంలో తాను ఎలాంటి ఇబ్బందులు పెట్టనని చెప్పి దివ్యను కాపురానికి తీసుకొచ్చాడు. తర్వాత ఏం జరిగిందో తెలియదు కాని.. సోమవారం ఉదయం పవన్ దివ్య తండ్రికి ఫోన్ చేసి ఖానీ బిడ్డ ఆరోగ్యం బాగోలేకపోతే చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తీసుకొచ్చానని అని చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు ఎంజీఎంకు వెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. ఈ ఘటనపై ఆగ్రహించిన తల్లిదండ్రులు తమ కూతురును భర్త పవన్, ఆయన సోదరుడు సురేష్, వదిన రోజా, పవన్ తల్లి సామిని, చిన్నాన బాలాజీ, చిన్నమ్మ హుని కలిసి హత్య చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నరేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాన్వికి అంతర్జాతీయ చెస్‌లో రేటింగ్



అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని ఆడుతున్న జాన్వి

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 2 : (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ రాంనగర్‌కు చెందిన తోట ప్రవీణ్-సుమలత దంపతుల కుమార్తె 8 ఏళ్ల జాన్వి అంతర్జాతీయ స్థాయి చెస్ పోటీల్లో క్లాసికల్ చెస్‌లో 1564 ఫిడే ఎల్లో రెటింగ్ సాధించింది. నవంబరు 3 నుంచి 5 వరకు హైదరాబాద్‌లో నిర్వహి ంచిన అంతర్జాతీయ స్థాయి ఫిడే రేటింగ్ చెస్ టోర్నమె ంట్‌లో క్లాసికల్ విభాగంలో 9రౌండ్లలో 5రౌండ్లు జాన్వి విజయం సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేస్తూ ఫిడే ఎల్లో రేటింగ్‌లో సత్తాచాటి అందరి మన్ననలు అందుకుంది. కాగా జాన్వి ప్రస్తుతం హంటర్‌రోడ్డు లోని వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతుంది. జాన్విని చెస్ అసోసియేషన్ బాధ్యులు, ఆర్బిటర్ కన్నా, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురు డీబార్

కేయూ క్యాంపస్, డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఏడుగురు విద్యార్థులను తనిఖీ బృందాలు డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి తెలిపారు. డీబారైన వారిలో ఆదిలాబాద్ పరీక్షల కేంద్రాల్లో ఆరగురు, ఖమ్మంలో జిల్లాలో మరొకరు ఉన్నట్లు స్పష్టం చేశారు.

శ్రీనివాసాచారికి డాక్టరేట్



శ్రీనివాసాచారి

రెడ్డికాలనీ , డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని బట్టల బజారు ప్రాంతానికి చెందిన ప్రతాపురం శ్రీనివాసాచారికి హైదరాబాద్‌లోని జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం బయోటె క్నాలజీలో డాక్టరేట్‌ను ప్రకటించింది. 'ఐసోలేషన్ పార్షియల్ ప్యూరిఫికేషన్ ఆఫ్ లైపెజెస్ ఫ్రమ్ సాయిల్ ఐసోలేట్' అనే అంశానికి డాక్టరేట్ ప్రకటించినట్లు డైరెక్టరే ట్ ఆఫ్ యూనివర్సిటీ డాక్టర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసా చారి ఈ పరిశోధన ప్రొఫెసర్ వై.ప్రమీలాదేవి పర్యవేక్షణలో పూర్తి చేశారు.

అర్బన్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- వివరాలను వెల్లడించిన కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజాపాలన పూర్తి కావస్తున్న సందర్భంగా గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో మంగళవారం అర్బన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. నగరంలో జరుగనున్న కార్యక్రమాల వివరాలను కమిషనర్ వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఉదయం 7.30 గంటలకు కాకతీయ మెడికల్ కళాశాల నుంచి బల్దియా ప్రధాన కార్యాలయం వరకు 2కె రన్, 9 గంటల నుంచి బల్దియా ఇండోర్ స్టేడియంలో శానిటేషన్ కార్మికులకు వైద్యశిబిరం, ఉచిత మందుల పంపిణీ, పీపీ కిట్లు అందజేత కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వరంగల్ నగరంలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం 6 గంటలకు హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు, వీధి వ్యాపారులు, ఎస్‌హెచ్‌జీ మహిళా బృందాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. శానిటేషన్ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ మహిళా బృందాలకు ఎంటర్ ప్రెన్యూర్‌లకు శాలువాలలో సన్మానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు వరంగల్ నగరంలోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరవుతారని ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

వరంగల్ వైద్యులకు అవార్డులు



అవార్డులు అందుకున్న వైద్యులు

వరంగల్ మెడికల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆసియా బెస్ట్ హెల్త్‌కేర్ జాతీయ అవార్డుల కార్యక్రమాన్ని ఈ నెల 1వ తేదీన ముంబైలో నిర్వహించారు. వివిధ స్పెషా లిటీలలో 250 నామినే షన్లలో 61 మంది సభ్యులు అవార్డులను అందుకున్నారు. ఇందులో పీడియాట్రిక్ స్పెషాలిటీలో వరం గల్ నుంచి కేవలం నలుగురు మాత్రమే డాక్టర్ రత్న అవార్డులను గెలుచుకున్నారు. కల్యాణి ఆస్పత్రి ఎండీ డాక్టర్ రమేశ్, గ్రావిడ్ హోమ్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ జే.ప్రదీప్, డాల్ఫిన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ కె.సురేశ్‌కుమార్, పిల్లల వైద్యులు డాక్టర్ రామాంజనేయులు భూపాలపల్లి రత్న అవార్డులను స్వీకరించారు. అవార్డులు అందుకున్న డాక్టర్లను హెల్త్ వ్యూస్ మ్యాగజైన్ సీఈవో దీప్తి వర్మ అభినందించారు.

రాజనీతి శాస్త్ర విభాగాన్ని సందర్శించిన ఏసీపీ

కేయూ క్యాంపస్, డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర పూర్వ విద్యార్థి, అల్యూమినీ హనుమకొండ ఏసీపీ జితేందర్‌రెడ్డి సోమవారం కేయూ రాజనీతిశాస్త్ర విభాగాన్ని సందర్శించారు. రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాజనీతిశాస్త్ర విభాగ అభివృద్ధిపై చర్చించారు. ఇతర విభాగ అధ్యాపకులతోనూ మాట్లాడారు. రాజనీతిశాస్త్ర విభాగంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అల్యూమినినీ హాల్ అభివృద్ధి పనులను పరిశీలించారు. హాల్‌కు ఏసీని సమకూరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజనీతిశాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ గడ్డం కృష్ణయ్య, సత్యనారాయణ, వడ్డెపల్లి నాగరాజు, డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతలవి దిగజారుడు రాజకీయాలు

మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాజీపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సుంచు కృష్ణ, నార్లగిరి రమేశ్‌లు అన్నారు. కాజీపేట మీడియా పాయింట్‌లో సోమవారం వారు మాట్లాడారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మెప్పు కోసం కాంగ్రెస్ నాయకుడు ఎండీ అంకూస్, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్‌పై చేసిన వ్యాఖ్యలు తగవన్నారు. వినయ్ భాస్కర్‌ను విమర్శించే స్థాయి అంకూస్‌కు లేదన్నారు. పెద్దవాళ్లని విమర్శిస్తే పెద్దవాళ్లవుతారనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఏపార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీ పంచన చేరి, పబ్బం గడుపుకునే అంకూస్ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. వ్యాగన్ పరిశ్రమల సాధనకోసం దాస్యం వినయ్ భాస్కర్ బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఎంఆర్‌పీఎస్, రైల్వే జేఏసీలతో కలిసి ఉద్యమించిన సంగతి కాజీపేట వాసులకు తెలుసున్నారు. ఈ మీడియా సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల శివకుమార్, బెదరకోట రంజిత్, బీఆర్‌ఎస్ నాయకులు శిరుమల్ల దశరథం, ఎండీ అఫ్జల్, గబ్బెట శ్రీనివాస్, కొండ్ర శంకర్, తండమల్ల వేణు, ఎస్‌కె మహమూద్, బరిగెల వినయ్, బైరి ప్రభాకర్, సుంచు రఘురాం, సదరం మహేశ్, అయ్యాల దానం, మండల సుబ్బు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

ప్రజావాణిలో కలెక్టర్ సత్య శారద



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 2: (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని, వెంటనే పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు రిఫర్ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులే మళ్లీమళ్లీ వస్తున్నాయని వాటిని అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 108 వినతులు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు 53, కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు 6, జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు 5, పోలీసు శాఖకు 2, జిల్లా విద్యాశాఖకు 4, వ్యవసాయశాఖకు 1, జీడబ్ల్యూఎంసీకి 8, జిల్లా ఉపాధిశాఖకు 2, జిల్లా పౌరసరఫరాల శాఖకు 3, డీఆర్‌డీవోకు 17, లీడ్ బ్యాంకు మేనేజర్‌కు 2, జిల్లా పంచాయతీ శాఖకు 2, బీసీ సంక్షేమ శాఖకు 1, ట్రైబల్ వెల్ఫేర్ శాఖకు 1 వచ్చాయన్నారు. అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మీ, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, డీఆర్డీవో కౌసల్యాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హనుమకొండలో ప్రజావాణికి 129 దరఖాస్తులు

హనుమకొండ కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 129 దరఖాస్తులు వచ్చాయి. బాధితుల నుంచి దరఖాస్తులను జి ల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి స్వీకరించి సంబంధించి అధికారులను పిలిచి దరఖాస్తులు పరిశీ లించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయానికి 16ఫిర్యాదులు, హనుమకొండ తహసీల్దార్ కార్యాలయానికి 9, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌కు 18 ఫిర్యా దులు రాగా, మిగతావి ఇతర డిపార్ట్‌మెంట్‌లకు వచ్చాయి. ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్‌ను వినియోగించుకోవాలి

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి, నిరుద్యోగులు ఉచిత కోచింగ్ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రంలో ఉచిత కోచింగ్ తీసుకుని ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సోమవారం కలెక్ట రేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఎంతోమంది పేద నిరుద్యోగులకు ఉన్నత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీలత, ఉమ్మడి జిల్లా షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం గౌరవ సంచాలకులు కె.జగన్‌మోహన్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం నగరంలోని పలుసబ్‌స్టేషన్‌లల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని విజయ్‌పాల్‌రెడ్డి కాలనీలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, అన్సారీ ట్రస్టు, గాయత్రినగర్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, యాదవనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని యాదవనగర్ ఏరియా, రెడ్డికాలనీ, పోచమ్మకుంట డబ్బాల ఏరియా, లోటస్ కాలనీ, కమార్‌పల్లి ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదన్నారు.

● ఆటోనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం నగరంలోని పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. కరీమాబాద్, ఆర్‌టీవో ఆఫీస్, నాయుడు పంపు, శేషాద్రి హిల్, జన్మభూమి జంక్షన్, వాల్ మార్ట్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, అదేవిధంగా మామునూరు సబ్‌స్టేషన్ పరిధిలోని గణేష్ నగర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, వసంతాపూర్ రోడ్డు, మామునూరు, కుమ్మరిపల్లి, డైరిఫామ్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ ఉండదని డీఈ శంకేషి మల్లికార్జున్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అయ్యప్ప స్వాముల ఆందోళన

మాలతో ఉన్న విద్యార్థిని పాఠశాలకు అనుమతించలేదంటూ నిరసన

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప మాలతో పాఠశాలకు వస్తే విద్యార్థులను అనుమతించడం లేదని పలువురు అయ్యప్ప స్వాములు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే... హనుమకొండ హంటర్ రోడ్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి సోమవారం అయ్యప్ప దీక్షలో మాల ధరించి పాఠశాలకు వెళ్లగా అనుమతించలేదు. సమాచారం అందుకున్న పలువురు అయ్యప్ప స్వాములు పాఠశాలలో ఆందోళనకు దిగారు. మాల ధరించి పాఠశాలకు వస్తే విద్యార్థిని ఎందుకు పాఠశాలకు అనుమతించడం లేదని పాఠశాల ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. అయితే తాము ఎవరినీ అలా అనలేదని ప్రిన్సిపాల్ వివరించే ప్రయత్నం చేయగా అయ్యప్ప స్వాములు ప్రిన్సిపాల్‌తో వాగ్వాదానికి దిగారు. దీక్షా దుస్తులపై స్కూల్ యూనిఫామ్ వేయడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే విద్యార్థి ఇంటి నుంచే యూనిఫామ్ వేసుకొచ్చాడని, తాము వేయలేదని ప్రిన్సిపాల్ వివరించారు. కాగా, పాఠశాల డైరెక్టర్‌ని వివరణ కోరగా అయ్యప్ప మాల ధారణ చేసిన విద్యార్థులను మేము అనుమతించడం లేదనేది సరికాదని, పాఠశాల దేవాలయం లాంటిదని, ఇక్కడ అన్ని మతాలు సమానమేనని అన్నారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

గిర్మాజిపేట, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన నిందితుడిని 24 గంటల్లోనే వరంగల్ రైల్వే పోలీసులు పట్టుకున్నారు. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన పి.వంశీకృష్ణ సికింద్రాబాద్ వెళ్లేందుకు ఆదివారం అర్ధరాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. 4వ నెంబర్ ప్లాట్‌ఫాంపై తన మొబైల్ ఫోన్‌ను చార్జింగ్ పెట్టి నిద్రపోయాడు. కొద్ది సేపటి తర్వాత లేచేసరికి ఫోన్ మాయమైంది. వెంటనే తను వరంగల్ జీఆర్‌పీలో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు శైలేష్ శుక్లను నిందితుడిగా అనుమానించి సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద బాధితుడు పోగొట్టుకున్న ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆశ వర్కర్ల పెండింగ్ బకాయిలు చెల్లించాలి



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

వరంగల్ మెడికల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాలుగా ఆశ వర్కర్లకు లెప్రసీ పారితోషికాలు పెండింగ్‌లో ఉన్నాయని అలాగే టీబీ, పల్స్‌పోలియో, ఎన్‌సీడీ పారితోషికాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని ఇవన్నీ వెంటనే చెల్లించాలని ఆశ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సీఐటీయూ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లెప్రసీ సర్వే చేయాలని ఆశ వర్కర్లను ప్రభుత్వం ఆదేశించిన క్రమంలో ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న మూడు సంవత్సరాల లెప్రసీ, టీబీ, పల్స్‌పోలియో, ఎన్‌సీడీ బకాయిలు విడుదల చేయాలన్నారు. ఈ నెల 3వ తేదీన అన్ని పీహెచ్‌సీల ఎదుట ధర్నా చేయాలని, 4న జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు రాగుల రమేశ్, కాసు మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె.కల్పన, రజిత, పుతిలి, గంగాజమున, శ్రీవాణి, నవమని, సంధ్య, రమ, కవిత, శోభిత, సుమారు 300 ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు



ఎంహెచ్‌నగర్‌లో బ్రోచర్లను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో

పోచమ్మమైదాన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుష్టు వ్యాధి నివారణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. వరంగల్ దేశాయిపేటలోని ఎంహెచ్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుష్టువ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి ఎండీటీ చికిత్స చేయించుకుంటే అంగవైకల్యాన్ని నివారించవచ్చని అన్నారు. శరీరంపై తెల్లని, ఎర్రని రాగిరంగు మచ్చలు స్పర్శ లేకుండా మొద్దుబారి ఉంటే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మోహన్‌సింగ్, జిల్లా ఫిజియోథెరపిస్టు నరసింహారెడ్డి, వైద్యాధికారి డాక్టర్ భరత్‌కుమార్, డీపీఎంవో అనుపమ, సూపర్‌వైజర్ కోర్నేలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు

పోచమ్మమైదాన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పైడిపెల్లిలోని జడ్పీ హెచ్ పాఠశాల విద్యార్థులు జన్ను మధుహాసిని, సిలువేరు నేహశ్రీని సోమవారం ఉపాధ్యాయులతో పాటు జై జవాన్ - జై కిసాన్ స్పోర్ట్స్ క్లబ్ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం జలజ మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ అండర్ 14 విభాగంలో పాల్గొని జన్ను మధుహాసిని నాలుగో స్థానం సాధించిందని, అదే విధంగా బీహార్ రాష్ట్రంలో జరిగిన 45వ జాతీయ స్థాయి పోటీలలో జూనియర్స్ గర్ల్స్ విభాగంలో సిలువేరు నేహశ్రీ అత్యుత్తమ ప్రతిభ కనబర్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీ పర్వీన్, స్పోర్ట్స్ క్లబ్ కమిటీ సభ్యులు ఇట్యాల శ్రీనివాస్, గట్టు బాలరాజు, గట్టు సంపత్, జన్ను అరుణాకర్, జన్ను స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి

మోటివేషనల్ స్పీకర్ దామోదర్

జూలైవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచే ఆత్మ విశ్వాసాన్ని పెంచుకొని అంచెలంచెలుగా ఎదుగుతూ లక్ష్యాన్ని చేరుకోవాలని హనుమకొండ సీడబ్ల్యూసీ సభ్యుడు, మోటివేషనల్ స్పీకర్ కజాంపురం దామోదర్ అన్నారు. సోమవారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఓరుగల్లు కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జూలైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంస్కారవికాస శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కజాంపురం దామోదర్ మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా చదవడం, కష్టపడే మనస్తత్వం విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో పరికిపండ్ల వేణు, తేరాల యుగంధర్, వర్దెల్లి మలహల్‌రావు, రాజమౌళి, లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

కాంగ్రెస్ నాయకుల చొరవ

పాఠశాల మైదానంలో 30 ట్రాక్టర్ల మొరం పోయించిన వైనం

మడికొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మడికొండ జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల బాగుకోసం స్థానిక కాంగ్రెస్ నాయకులు చొరవ చూపారు. చిన్న వర్షం పడినా మైదానం పూర్తిగా జలమయమవుతుండ వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు ఆదేశాల మేరకు ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సూచనతో స్థానిక కాంగ్రెస్ నాయకులు తమ సొంత ఖర్చులతో 30 ట్రాక్టర్ల మొరం పోయించి మైదానం చదును చేయించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, పార్టీ నాయకులు భైరి కొమురయ్య, లింగమూర్తి, మెట్టుగుట్ట చైర్మన్ రఘు పైడిపాల, పీఏసీఎస్ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, దువ్వ విజయ్, ఆరె రమేష్, పెనుకుల వినయ్, కుక్కల రాజేందర్, క్రేన్ రవి, గున్నాల వెంకన్న, బోగి సాయికిరణ్, దువ్వ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు పుస్తకాల వితరణ

వడ్డెపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ మహిళా కళాశాల గ్రంథాలయానికి కరీంనగర్ జిల్లాకు చెందిన వ్యవసాయ ప్రాసెస్ ఫుడ్ డెవలప్‌మెంట్ అథారిటీ డిప్యూటీ జనరల్ మేనేజర్ తూమటి సుధాకర్ అత్యంత విలువైన రిఫరెన్స్ పుస్తకాలను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బత్తిని చంద్రమౌళి గౌడ్, కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ బి.యుగంధర్, అధ్యాపకులు రాజు, సురేష్‌బాబు, మీనాక్షి, సారంగపాణి, కొలిపాక శ్రీనివాస్, డాక్టర్ సుమలత, డాక్టర్ స్వర్ణలత తదితరులు పాల్గొని పుస్తకాల వితరణ దాత సుధాకర్‌ను ఘనంగా సత్కరించారు.

'ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించాలి'

బాలసముద్రం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జికూటివ్ డైరెక్టర్ కుష్రోశ ఖాన్ అన్నారు. పదోన్నతిపై కరీంనగర్ జోన్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వచ్చిన కుష్రోష ఖాన్ సోమవారం వరంగల్ రీజియన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వరంగల్ రీజియన్ మేనేజర్ డి.విజయభాను ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కుష్రోషఖాన్ వరంగల్ రీజియన్‌లోని అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి రీజియన్‌లోని అన్ని విభాగాల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కుష్రుష్‌ఖాన్ మాట్లాడుతూ వరంగల్ రీజియన్ అత్యధిక ఆదాయం సంపాదిస్తూ జోన్‌లో అగ్రగామిగా నిలవాలన్నారు. అనంతరం వనభోజనాల కార్యక్రమానికి హాజరై వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న డిపో సిబ్బంది, వారి కుటుంబసభ్యులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ కె.భానుకిరణ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ జి.మాధవరావు, ఏవో రవీందర్, పీవో అర్పిత, వరంగల్ 2-డిపో మేనేజర్ జోత్స్న పాల్గొన్నారు.

సదరం క్యాంపుల షెడ్యూల్ విడుదల

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలోని దివ్యాంగులకు సదరం క్యాంపునకు సంబంధించిన షెడ్యూల్‌ను డీఆర్‌డీవో కౌసల్యాదేవి సోమవారం విడుదల చేశారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి, రీజినల్ కంటి ఆస్పత్రిలో జరిగే సదరం క్యాంపు వివరాలు వెల్లడించారు. మానసిక వికలాంగులకు సంబంధించి ఈ నెల 11వ తేదీన, మూగ, చెవిటి వారికి ఈ నెల 13న, ఆర్థో విభాగానికి ఈ నెల 18, 19, 20 తేదీలలో ఎంజీఎం ఆస్పత్రిలో క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. కంటి పరీక్షకు సంబంధించిన క్యాంపు ఈ నెల 16, 17 తేదీల్లో కంటి ఆస్పత్రిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మీ సేవ కేంద్రాల్లో పేరు నమోదు చేసుకున్న వారు మాత్రమే సదరం క్యాంపునకు హాజరు కావాలని డీఆర్‌డీవో సూచించారు.

పద్మశాలి సంఘం కార్యవర్గంలో జిల్లా నేతలు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గంలో వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అడ్వైజర్‌గా బాల్నె సర్వేశం, అధికార ప్రతినిధులుగా కందగట్ల నరహరి, నామాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా రుద్ర ఓంప్రకాశ్, పెద్దూరి సంజీవరావు, కార్యదర్శులుగా కూచన శ్రీనివాస్, మార్త సారంగపాణి, సంయుక్త కార్యదర్శిగా గడ్డం రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా శ్రీరాముల శంకరయ్య, కోడాది కృష్ణమోహన్‌లను నియమించారు.

వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

● కలెక్టరేట్ ఎదుట వీఆర్ఏల ధర్నా



వరంగల్ కలెక్టరేట్ ఆవరణలో ధర్నా చేస్తున్న వీఆర్ఏలు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): 61 సంవత్సరాలు దాటిన వీఆర్ఏ వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని జిల్లా వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఆవరణలో వీఆర్ఏలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏ జేఏసీ అధ్యక్షుడు యుగేందర్, సతీష్ మాట్లాడుతూ 2023 జూలై, ఆగస్టు నెలలలో జీవో 81, 85లను నాటి ప్రభుత్వం విడుదల చేసిందని, ఆ జీవో లను అనుసరించి 20,555 మంది వీఆర్ఏలో 61 సంవత్స రాలలోపు వయసు కలిగిన 16,758 మంది వీఆర్ఏలకు ప్రమోషన్ ఇచ్చిందన్నారు. ఆ జీవోలో మిగిలిన 61 సంవ త్సరాల వయసు పైబడిన 3797 మంది వీఆర్ఏ వారసు లకు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని, ఇంతలో ప్రభుత్వం మారిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏలను పట్టించు కోవడంలేదని, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా పట్టించుకుని తమకు సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం వీఆర్ఏలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డికి అందజేశారు. ధర్నాలో జిల్లాకు చెందిన వీఆర్ఏలు పాల్గొన్నారు.

కరాటేలో మార్షల్ ఆర్ట్స్ విద్యార్థుల ప్రతిభ



జాతీయ స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జక్రియా ఫంక్షన్‌హాల్‌లో బీఎంఆర్ కరాటే డు మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీలు సోమవారం ముగిశాయి. రెండు రోజులు పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారుల మధ్య జరిగిన ఓపెన్‌టూ ఆల్ కరాటే చాంపియన్‌షిప్ పోరులో ఆతిధ్య బీఎంఆర్ మార్షల్ ఆర్ట్స్ కు చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. అండర్-14 బాలికల కుమితి విభాగంలో ఆర్. కృషిత, అండర్-17 బాలికల కుమితి విభాగంలో సిహెచ్. శివాత్మిక బెస్ట్ ఫైటర్స్‌గా సత్తా చాటారు. అదే విధంగా అండర్-14 బాలుర విభాగంలో హరిమతన్, అండర్-19 బాలుర విభాగంలో భరత్‌లకు బెస్ట్ ఫైటర్స్‌గా అవార్డులతో పాటు గ్రాండ్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. కటాస్, కుమితి, కటాస్ కుమితి విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో బీఎంఆర్ కరాటే డు మార్షల్ ఆర్ట్స్‌కు చెందిన క్రీడాకారులు పలు పతకాలు సాధించారు. కాగా, క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు నిర్వహకులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఆర్ కరాటే మార్షల్ ఆర్ట్స్ చైర్మన్, చీఫ్ కోచ్ బండారి సంతోష్, నిర్వహకులు ఎ.గణేష్, పి.దినేష్, కె.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక ముగింపు పూజలు

వరంగల్ కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్: శివనగర్ రామాలయం జలాశయంలో అరటికాడపై వత్తులతో దీపాలను వెలిగించి, గౌరీ నక్తం పూజ చేశారు. మధ్యకోటలోని స్వయంభూదేవాలయంలో శివలింగానికి అభిషేకం, అర్చన చేసి, దీపాలను వెలిగించి పూజలు చేశారు. 18వ, డివిజన్ లేబర్‌కాలనీలోని పంచముఖనాగేంద్రస్వామి దేవాలయంలో గౌరీ నక్తం, కుంకుమార్చన, అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు.

అవగాహన పెంచుకోవాలి

కాశిబుగ్గ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య వ్యవస్థపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని బాలజ్యోతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ పొన్నోజు చక్రపాణి సూచించారు. వివేకనందకాలనీలోని బాలజ్యోతి పాఠశాలలో ఎన్నికల పట్ల అవగాహన పెంచడానికి సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులు వివిధ పార్టీల పేరుతో బరిలో నిలవగా, 9వ తరగతి విద్యార్థులు వలంటీర్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పొన్నోజు దేవిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సై కుటుంబానికి చెక్ అందజేత

హనుమకొండ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన ఎస్సై మొగిలి కుటుంబానికి పోలీసు భద్రత కింద మంజూరైన రూ.16 లక్షల చెక్కును సీపీ అంబర్ కిషోర్ ఝా సోమవారం ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. మొగిలి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఉపరాష్ట్రపతిని కలిసిన ఎంపీ రవిచంద్ర



జగ్దీప్ ధన్‌ఖడ్‌ను కలిసిన ఎంపీ

మట్టెవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర సోమవారం భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధన్‌ఖడ్‌తో సమావేశమయ్యారు. పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతున్న సందర్భంగా రాజ్యసభలోని చైర్మన్ చాంబర్‌లో ఎంపీ రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 39 మందికి జరిమానా

మట్టెవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో 39 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేష్ సోమవారం రూ. 45300 జరిమానా విధించారు. వారితో పాటు వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన పాటి రాజు, తొగరు శ్రీకాంత్, రంగంపేటకు చెందిన గోవిందు రంజిత్, పైడిపల్లి ప్రాంతానికి చెందిన చింతం వంశీలకు మూడు రోజుల సామాజిక సేవ శిక్షను విధించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురికి రూ.4000 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ తెలిపారు.

హనుమకొండలో 33 మందికి..

హనుమకొండ టౌన్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 33 మందిని కోర్టులో హాజరుపరచగా 32 మందికి రూ 33,900 జరిమానా, ముచ్చర్లకు చెందిన దామెర కృష్ణమూర్తికి న్యాయమూర్తి రాజశే ఖర్ రెండు రోజుల కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని ఐదుగురు వాహనదారులకు రూ. 3000 జరిమానా విధించడం జరిగిందన్నారు.

మైత్రి క్లినిక్‌ల ప్రారంభం



మైత్రి క్లినిక్‌ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న వైద్యులు

వరంగల్ మెడికల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన, విజయోత్సవాలలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం 213 అంబులెన్స్‌లు, 33 మైత్రి ట్రాన్స్ క్లినిక్‌లను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. హనుమకొండ జిల్లాకు సంబంధించిన మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను ఎంజీఎం ఆస్పత్రిలో ప్రారంభించడం జరిగింది. మైత్రి క్లినిక్‌లో కౌన్సెలింగ్, లింగ ఆధారిత సేవలు, లైంగిక వ్యాధులకు చికిత్స, సామాజిక అర్హత సేవలు లభిస్తాయని ఎంజీఎం అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్ రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ కె.కిశోర్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, ఆర్ఎంవో డాక్టర్ మురళి, డాక్టర్లు మధుబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు యూనిఫాం పంపిణీ



మునిసిపల్ కార్మికులకు నూతన యూనిఫాంలు అందజేస్తున్న కార్పొరేటర్ వసంత మహేందర్‌రెడ్డి

జూలైవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సేవలు అభినందనీయమని గ్రేటర్ 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మునిసిపల్ కార్మికులకు నూతన యూనిఫాంలను అందజేశారు. పారిశుధ్య కార్మికులు ప్రతీ రోజు కాలనీలను శుభ్రం చేయడం తోనే మనం ఆరోగ్యవంతమైన జీవనం గడుపుతున్నామని వారి సేవలు వెలకట్టలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి, జవాన్లు గిరి, రమాజ్యోతి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పైపులతో పొంచిఉన్న ప్రమాదం

● భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు

● వంద ఫీట్ల రోడ్డుపై నాలుగేళ్లుగా ఇదే దుస్థితి






లేబర్‌కాలనీ 100ఫీట్ల రోడ్డు మధ్యన నాలుగేళ్ల క్రితం వేసిన సిమెంట్ పైపులు

ఖిలావరంగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ వెంకట్రామా థియేటర్ నుంచి నర్సంపేట-గొర్రెకుంట రోడ్డు వరకు, అదేవిధంగా లేబర్‌కాలనీ 100ఫీట్ల రోడ్డునుంచి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వెళ్ళే రోడ్డుపై నాలుగేళ్ల క్రితం భారీ సిమెంట్ పైపులు వేశారు. దీంతో ఈ రోడ్లు ఇరుకుగా మారి భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. వరంగల్ వెంకట్రామ థియేటర్ దయానందకాలనీ వద్ద, చింతల్‌బ్రిడ్జి వద్ద, అబ్బనికుంట సీబీసీ చర్చివద్ద, లేబర్‌కాలనీ 100పీట్లరోడ్, గౌరయ్య డబ్బా, మేఘరాజ్ స్వీట్ హౌజ్‌వద్ద, లేబర్‌కాలనీ పంచముఖ నాగేంద్రస్వామి దేవాలయం ఆర్చీవద్ద, అమరవీరుల స్థూపం వద్ద, గొర్రెకుంట జయశంకర్ విగ్రహం వద్ద జంక్షన్‌లు, డివైడర్లతో రోడ్డు ఇరుకుగా మారి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

నాలుగేళ్లుగా రోడ్డుపైనే సిమెంట్‌పైపులు..

లేబర్‌కాలనీ నుంచి 100 పీట్ల రోడ్ నుంచి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వెళ్ళే రోడ్డుపై 4 సంవత్సరాలుగా సిమెంట్ పైపులు ఉంటున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి మార్కెట్‌కు వచ్చే వాహనాలకు ఇబ్బంది అవుతోంది. దాంతో పాటు లేబర్‌కాలనీ 100 ఫీట్లరోడ్ ప్రధానద్వారం డ్రెయినేజీకి పైకప్పు లేక కంపుకొడుతోంది. అంతేగాకుండా భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము లేచి వ్యాపార సముదాయాలు, నివాసాలలోకి వెళ్లడంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు. లేబర్‌కాలనీ 100పీట్ల రోడ్‌నుంచి క్రిస్టియన్‌కాలనీ, పంచముఖనాగేంద్రస్వామి దేవాలయం, శాలినినగర్, చెన్నారెడ్డికాలనీ, ఎన్‌టీఆర్‌నగర్, ఎస్ఆర్‌నగర్, కోటిలింగాలదేవాలయం, బాలాజీనగర్ తదితర ప్రాంతాల కు వెళ్ళే పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్‌దీపాలు రోడ్డుపైనే ఉన్నాయి. రోడ్డుకిరువైపులా ఉన్న పురాతన కాలంనాటి విద్యుత్ దీపాలు వెలుగకపోవడంతో రాత్రివేళల్లో అంధకారం నెలకొంటోంది. సిమెంట్‌పైపులను తొలగించాలని పలుమార్లు నాయకులు, నగరపాలకసంస్థ అధికారులకు వినతిపత్రాలి చ్చినా స్పందిచండంలేదని ప్రజలు వాపోతున్నారు.

దుమ్ముతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు..



బాబురావు, వ్యాపారి

100ఫీట్ల రోడ్‌నుంచి ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వెళ్ళే రోడ్డుపై భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము లేస్తోంది. వ్యాపారులు, నగర ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఈ రోడ్డుపై ఉన్న లేబర్‌అడ్డాను తొలగించాలి. కార్మికులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోంది.

విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేయాలి: - రామస్వామి, స్థానికుడు



లేబర్‌కాలనీ నుంచి 100 ఫీట్ల రోడ్ మీదుగా వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లే దారిపై విద్యుత్‌దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో అంధకారం ఏర్పడుతోంది. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో పాలకులు, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చాం. అయినా ఫలితం ఉండడం లేదు.

ఆత్మ విశ్వాసమే జీవితాన్ని గెలిపించింది

అవహేళనలను అధిగమించిన రాజు

పుట్టుకతోనే ఒక కన్ను పూర్తిగా కనిపించదు.. అప్పటి వరకు ఆసరాగా ఉన్న మరో కన్ను పూర్తిగా మసకబారింది. చూపును కోల్పోయింది. బాల్యాన్ని చీకటి కమ్మేసింది. జీవిత వెలుగులు ఆరిపోయాయి. చిన్ని గుండె తట్టుకోలేక పోయింది. ముగ్గురు ఆడపిల్లల తరువాత పుట్టిన కొడుకు. అతని జీవితం అంధకారమైంది. తల్లిదండ్రులు గుండెలవిసేలా ఏడ్చారు. వైద్యం కోసం వ్యవసాయ భూమిని సైతం తల్లిదండ్రులు అమ్మేశారు. అయినా ఫలితం లేదని వైద్యులు చెప్పడంతో ఆ తల్లిదండ్రులు ఇక ఎప్పటికీ చూడలేను అనుకున్న ఆ పిల్లాడి హృదయం....కళ్లు కన్నీటినే మిగిల్చాయి అంటూ రోధించింది. ఆ చిన్నోడు చీకటైన జీవితాన్ని వెలుగు మయం చేసుకోవాలని హైదరాబాద్‌లోని దార్‌షాబా బ్లైండ్ స్కూల్‌లో చేరాడు. అక్కడి నుంచి వెలుగు దిశగా సాగిన ఆ పిల్లాడే కుంటా రాజు... హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలోని ఆడిట్ కార్యాలయంలో సీనియర్ ఆడిటర్‌గా పని చేస్తున్నాడు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాజు విజయగాథ గురించి కథనం..

- హనుమకొండ సిటీ (ఆంధ్రజ్యోతి)



కుంట రాజు, సీనియర్ ఆడిటర్

స్టేషన్ ఘన్‌పూర్ ఇప్పగూడేనికి చెందిన వ్యవసాయ కుటుంబంలో జన్మించిన కుంట రాజుకు ముగ్గురు అక్కలు. తండ్రి వ్యవసాయం చేసే వారు. పుట్టినప్పటి నుంచే ఒక కన్ను కనిపించదు. మరో కన్ను కూడా 5వ తరగతిలో పూర్తిగా మసకబారింది. అంధత్వం తనను వేధిస్తుంటే.. తోటి పిల్లలు, ఇతరులు గుడ్డివాడు అంటూ చేస్తున్న అవహేళన అతడిని మరింత బాధించాయి. ఈ క్రమంలో తల్లిదండ్రులు రాజును హైదరాబాద్‌లోని దార్ బాష అంధత్వ పాఠశాలలో చేర్పించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అక్కడ చదివాడు. పదో తరగతి పూర్తయిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగం పొందాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నాడు. హైదరాబాద్ విద్యానగర్‌లోని వొకేషనల్ రిహాబిలేషన్ సెంటర్‌లో ట్రెయినింగ్ పూర్తి చేశాడు. ఇందులో నేర్చుకున్న కెయిన్ చైర్ అల్లికలతో ఎంతో కొంత సంపాదించుకుంటూ అందులోనే తల్లిదండ్రులకు కొంత డబ్బు పంపేవాడు. ఆ క్రమంలోనే హైదరాబాద్‌లోనే టెలిఫోన్ బూత్ పెట్టుకొని, అటు ఇంటర్, డిగ్రీ కూడా పూర్తి చేశాడు. అలా ప్రభుత్వం 2003లో ప్రత్యేక నియామకాల ద్వారా భర్తీ చేసిన ఉద్యోగాల్లో కుంట రాజు ఉద్యోగం పొందారు. సబ్ ఆర్డినేట్ ఉద్యోగం వచ్చింది. అతడికి ఉద్యోగం వచ్చిందని చెప్పినా ఎవరూ నమ్మలేదు ఏ హోటల్‌లో పని చేస్తున్నాడో అంటూ ఎగతాళి చేశారు. చివరకు తండ్రి కూడా నమ్మలేదు. కానీ నాటి వరంగల్ కలెక్టరేట్‌లో ఆడిట్ కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చేందుకు వెళ్లే సమయంలో తండ్రిని కూడా వెంట తీసుకెళ్లడంతో ఆయ నకు నమ్మకం కలిగింది.

చూపులేకపోయినా కార్యాలయంలోని ఎక్కడ ఏ ఫైలు ఇవ్వాలో కచ్చితంగా ఇస్తూ విధులు నిర్వహించే రాజుకు అధికారుల నుంచి ప్రశంసలు అందుతూ వచ్చాయి. ఆ స్ఫూర్తితో ఆయన పదోన్నతులు పొందుతూ ఇప్పుడు సీనియర్ ఆడిటర్‌గా పని చేస్తున్నారు. ఇక ప్రభుత్వ ఉద్యోగం పొందిన రాజుకు వివాహం చేయాలని తల్లిదండ్రులు తలచారు. అయితే ఇందుకు ఎవరూ ముందుకు రాలేదు. చివరకు రాజు బంధువుల అమ్మాయితోనే వివాహం జరిగింది. వారికి ఓ కొడుకు ఉన్నారు. తన విజయం వెనుక తన కుటుంబం, భార్య ప్రోత్సాహం మరువలేనిదని రాజు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగులకు చేయూతగా..

నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

- పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం
- ఆర్థికాభివృద్ధి కోసం సబ్సిడీ రుణాలు
- విద్యార్థుల చదువుకు అండగా ఉపకార వేతనాలు
- వివాహ ప్రోత్సాహక బహుమతిగా రూ.లక్ష

హనుమకొండ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల విద్య, ఆర్థికాభి వృద్ధి కోసం ప్రభుత్వం పలు విధాలుగా చేయూత అందిస్తోంది. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు ఇతరత్రా సహకార చర్యలు అమల్లో ఉన్నాయి. దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందుతున్నాయి. దివ్యాంగులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు స్వయం ఉపాధి రంగాల్లో ప్రభుత్వం ప్రోత్సహం అందిస్తోంది. ఇందుకు గాను బ్యాంకు ద్వారా సబ్సిడీ రుణాలను అందిస్తోంది. డిసెంబరు 3 ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నేపథ్యంలో వారి అభ్యున్నతికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, ఉపకార వేతనాలు, గురించి కథనం.



ప్రీ-మెట్రిక్ ఉపకార వేతనాలు..

1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ లేదంటే ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల్లోని చదివే దివ్యాంగ విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ ఉపకార వేతనములను ప్రభుత్వం కల్పిస్తోంది. తల్లి దండ్రుల వార్షిక ఆదాయం రూ.1,50,000 లోపు ఉంటే వారి అర్హత లను బట్టి 1 నుంచి 5వ తరగతి వరకు చదివే దివ్యాంగ విద్యార్థులకు రూ.700, 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు వారికి రూ.వెయ్యి, తొమ్మిదో తరగతి నుంచి 10వ తరగతి వారికి రూ.1820 ఉపకార వేతనాలు పొందొచ్చు. ఈ మేరకు పూర్తి వివరాల కోసం కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ అధికారిని సంప్రదించాల్సి ఉంటుంది.

మానసిక దివ్యాంగులకు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంటు పొందని స్వచ్ఛంద సంస్థల్లోని బుద్ధి మాంద్యం విద్యార్థులకు సంవత్సరానికి రూ.వెయ్యి ఉపకార వేతనం ఉంటుంది. తల్లిదండ్రుల ఆదాయం రూ.లక్షన్నరకు మించకుండా ఉండాలి.

పోస్టు-మెట్రిక్ ఉపకార వేతనాలు..

ఇంటర్ ఆపై చదివే ఓసీ వర్గ దివ్యాంగ విద్యార్థులకు పోస్టు-మెట్రిక్ ఉపకార వేతనాలను ప్రభుత్వం అందిస్తోంది.

స్వయం ఉపాధి కోసం

ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దివ్యాంగులకు ప్రభుత్వం చేయూతనందిస్తోంది. స్వయం ఉపాధి రంగాల్లో వారిని ప్రోత్స హిస్తూ ఆర్థికాభివృద్ధికి సహకరిస్తుంది. ఇందు కోసం సబ్సిడీ రుణాలను అందుబాటులోకి తెచ్చింది. 21 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల వయసులోని అంగ వైకల్య అభ్యర్థులకు బ్యాం కు ద్వారా ప్రభుత్వం రుణాలను కల్పిస్తోంది. దాదాపు 80శాతం వరకు రుణ సబ్సిడీ ఉంది. రూ. 50 వేల రుణానికి వంద శాతం సబ్సిడీ లభిస్తుంది. కుటుంబ వార్షిక లక్షన్నర మించరాదు.

వివాహ ప్రోత్సాహక బహుమతి..

దివ్యాంగుల వివాహక ప్రోత్సాహక బహుమతి కింద ప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేస్తోంది. ఎవరైనా సకలాంగులు.. దివ్యాంగులను వివాహం చేసుకుంటే వారికి ఈ బహుమతి అందుతుంది. ఇందు కోసం వివాహం చేసుకున్న ఒక సంవత్సరం లోపు ప్రోత్సాహక బహుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి.

సహకార సంస్థ ద్వారా వాహనాలు, పరికరాలు

అర్హులైన శారీరక వైకల్యం గల వారికి మూడు చక్రాల వాహనం, చంక కర్రలు, బ్యాటరీ వీల్ చైర్లు, బ్యాటరీ ట్రై-సైకిళ్లు, క్యాలీపర్స్, మోటరైజ్డ్ వాహనాలను ప్రభుత్వం అందిస్తోంది. మూగ, చెవిటి వైకల్యం గల వారికి శ్రవణ యంత్రాలు, 4జీ స్మార్ట్ ఫోన్లు, అంధు లకు చేతి కర్రలు, డైజి ప్లేయర్లు, ఎంపీ 3ప్లేయర్లు, ల్యాప్‌టాప్స్ ఉచితంగా అందుతాయి. ఇవి పొందాలంటే రూ.లక్షన్నరలోపు వార్షిక ఆదాయం మించకూడదు.

వసతి గృహాల నిర్వహణ

శారీరక దివ్యాంగుల కోసం వసతి గృహాల నిర్వహణ జిల్లా సంక్షే మ అధికారి ఆధ్వర్యంలో జరుగుతోంది. ప్రభుత్వ దివ్యాంగుల బాలు ర సదనం, ప్రభుత్వ దివ్యాంగుల బాలికల వసతి గృహాలు వసతిని కల్పిస్తున్నాయి.

ఉద్యోగ, ఉపాధి అవకాశాల మార్గం

దివ్యాంగులకు ప్రభుత్వ పరమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లోని వివరాలను తెలియపరిచేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. pwdjobportal.telangana పోర్టల్‌లో వివరాలను పొందు



పాడుతున్న శ్రవణ్‌కుమార్

శ్రవణానందం

గాత్రంతో అలరిస్తున్న అంధుడు
ఆదర్శంగా నిలుస్తున్న శ్రవణ్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తన మధురగానంతో ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాడు జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన అంధ గాయకుడు తిరునగరి శ్రవణ్‌కుమార్. పుట్టుకతోనే అంధుడైనా సినిమా, రేడియో పాటలతో తన గానంతో అలరిస్తున్నాడు. మంగళవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా శ్రవణ్‌కుమార్ విజయ ప్రస్థానంపై కథనం..

స్టేషన్ ఘన్‌పూర్ విద్యానగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎం తిరునగరి నర్సింహస్వామికి నలుగురు కుమారులు. చిన్న కుమారుడు శ్రవణ్‌కుమార్ పుట్టుకతో అంధుడు. ఇంటిలోనే తల్లి నీలాదేవి వద్ద ఉంటూ బాల్యం నుంచే పాటలు వినడం, పాడడం అభ్యాసం చేశాడు.

1997లో సహాయకుని సహకారంతో పదవ తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణుడయ్యాడు. హన్మకొండ పల్లవి ఆర్కెస్ట్రాలో చేరిన ఆయన, ట్రూప్ మేనేజర్ చంద్రశేఖర్ ప్రోత్సాహంతో వరంగల్ ప్రభుత్వ విద్యారణ్య సంగీత కళాశాలలో డిప్లొమా కోర్సు పూర్తి చేశాడు. 1500 ప్రోగ్రాంలు ఇచ్చాడు. తన గానంతో అలరిస్తున్న 45ఏళ్ల శ్రవణ్‌కుమార్‌కు భార్య ఉంది. తాను నేర్చుకున్న గాత్ర సంగీతాన్ని పది మందికి నేర్పాలన్న లక్ష్యంతో ఏటా సెలవుల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. వద్దనే ఉదయం సాయంత్రం శిక్షణ ఇస్తు దివ్యాంగులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఇప్పటి వరకు సుమారు 400 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

- 2000లో ఢిల్లీ ఆంధ్రాభవన్‌లో నిర్వహించిన జానపద సంగీత విభావరిలో జిల్లా నుంచి పాల్గొన్న ఒకే ఒక్కడు శ్రవణ్ కుమార్.
- 2005లో జెమినీ టీవీ వన్స్‌మోర్ కార్యక్రమంలో ప్రథమ స్థానం దక్కించుకున్నారు.
- టీటీడీ లక్ష గళ సంకీర్తనార్చనలో పాల్గొని ప్రశంసా పత్రం పొందారు.

శ్రవణ్ ప్రదర్శనల్లో ముఖ్యమైనవి

- ప్రపంచ ధ్వని అనుకరణ సామ్రాట్ నేరెళ్ల వేణుమాధవ్, సినీ గేయ రచయిత చంద్రబోస్, గాయకుడు కుంచె రఘు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.
- విద్యారణ్య మ్యూజిక్ డ్యాన్స్ కళాశాల, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంయుక్తంగా నిర్వహించిన కళా పరిచయం ద్వారా 200 మందికి గాత్ర సంగీత శిక్షణ ఇచ్చారు.
- 2012 నుంచి శివునిపల్లి ప్రభుత్వ హైస్కూళ్లలో కాంట్రాక్ట్ మ్యూజిక్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

ఓరుగల్లు జూపార్కుకు రెండు పెద్ద పులులు

- నాలుగు మూషిక జింకలు కూడా..
- హైదరాబాద్ నుంచి తీసుకొచ్చిన అధికారులు

రెడ్డికాలనీ/న్యూశాయంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఓరుగల్లు జూపార్క్ అంటే ఓ ప్రత్యేకత ఉంది. హనుమకొండ హంటర్ రోడ్‌లో ఉన్న ఈ కాకతీయ జూలాజికల్ పార్కుకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు కరీంనగర్, ఖమ్మం జిల్లాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ఈ క్రమంలో గతంలో ఉన్న జంతువులకు తోడు.. హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్కు నుంచి రెండు పెద్ద పులులను అధికారులు ఇక్కడకు తీసుకొచ్చారు. వీటితో పాటు మరో నాలుగు మూషిక జింకలు (మౌస్‌డీర్స్)ను కూడా తీసుకొచ్చారు. అదేవిధంగా ఓ అడవి దున్న, మరో రెండు జింకలను కూడా త్వరలో తీసుకురానున్నట్లు జూపార్కు అధికారులు వెల్లడించారు.

అయితే కొన్ని సంవత్సరాలుగా ఈ జూపార్కుకు పెద్దపులులు వస్తాయని చెబుతున్నప్పటికి కార్యాచరణకు నోచుకోలేదు. రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో సోమవారం రెండు పెద్ద పులులు పార్కుకు చేరుకోవడంతో జంతుప్రేమికుల నిరీక్షణకు తెరపడినట్లు యిం ది. ఇప్పటికే జూపార్కులో పులులు ఉండ టానికి ఎన్‌క్లోజర్లు సైతం రెడీ అయ్యాయి.



సందర్శకులను ఆకట్టుకోనున్న మూషిక జింకలు

హైదరాబాద్ నెహ్రూ జులాజికల్ పార్కు నుంచి నాలుగు మూషిక జింకలను అటవీ శాఖ అధికారులు తీసుకొచ్చారు. జింకల జాతిలో అతి చిన్న ప్రాణి ఇది. రెండు దశాబ్దాల క్రితమే రాష్ట్రంలో అంతరించిన ఈ మూషిక జింకల జాతిని సంరక్షించి సంతానోత్పత్తి పెంచేందుకు అటవీశాఖ చర్యలు తీసుకుంది. హైదరాబాద్‌లోని జూలో గత ఐదేళ్లలో 204 మూషిక జింకలను పెంచి వివిధ అటవీ ప్రాంతాల్లో వదిలిపెట్టారు.

ఇప్పుడు మన జూ పార్కుకు నాలుగు మూషిక జింకలు రావడంతో అవి జూపార్కుకు వచ్చే సందర్శకులను ఆకట్టు కోనున్నాయి.

స్పేస్ ట్యూటర్‌గా శశాంక్

- రాష్ట్రం నుంచి ఎంపికైన తొలి స్పేస్ ట్యూటర్
- జేఎన్ఏఎఫ్ఏ యూనివర్సిటీ నుంచి ఆర్కిటెక్చర్‌లో పట్టా పొందిన శశాంక్
- దేశవ్యాప్తంగా స్పేస్ ట్యూటర్‌ను ఇటీవలే ఎంపిక చేసిన ఇస్రో
- వరంగల్‌కు చెందిన శశాంక్‌కు దక్కిన అరుదైన అవకాశం



వరంగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్‌కు చెందిన భూపతి శశాంక్‌కు అరుదైన అవకాశం దక్కింది. తెలంగాణ తొలి ఇస్రో స్పేస్ ట్యూటర్‌గా ఎంపికయ్యారు. ఇటీవల దేశవ్యాప్తంగా అంతరిక్ష విద్యను ప్రోత్సాహించడానికి ఇస్రో స్పేస్ ట్యూటర్స్‌ను ఎంపిక చేసింది. రాష్ట్రం నుంచి హనుమకొండ పట్టణానికి చెందిన ఆర్కిటెక్ట్ శశాంక్ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ) నుంచి ఇటీవలే ఆర్కిటెక్చర్ పట్టాను పొందారు. ప్రాచీన విజ్ఞానం, సమకాలీన సవాళ్లను ఎలా పరిష్కరించాలో అన్వే షించడానికి ఏన్షియంట్ టెక్నాలజీస్ డిజైన్ రీసెర్చ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఇది దక్షిణ భారతదేశంలోనే ఏకైక ల్యాబ్. ఈ ల్యాబ్ ద్వారా పురాతన నిర్మాణ ప్రదేశాలను అధ్యయనం చేయటం, వాటి నమునాలను రూపొందించటం వంటి వాటిని చేపట్టారు. ఈ నమూనాలు అంతరిక్ష పరిశోధనలు మరింత సమర్థవంతంగా చేసే లక్ష్యంతో భవిష్యత్ అంతరిక్ష మిషన్లలో ఏకీకృతం చేయడానికి తయారు చేశారు. శశాంక్ ప్రాజెక్టులో మాడ్యులర్ స్పేస్ క్రాఫ్టులు, తేలికైన, ధ్వంసమయ్యే వ్యోమగామి గృహాలు, వినూత్న ఉపగ్రహ నమూనాలు కూడా ఉన్నాయి. స్పేస్ రీసెర్చ్ ఆర్కిటెక్చర్ అనేది అరుదైన రంగంగా నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రపంచవ్యాప్తంగా చాల తక్కువ మంది నిపుణులు ఉన్నారని, దేశంలో కేవలం రెండే కంపెనీలు ఉన్నాయని చెబుతున్నారు. ఇస్రో ట్యూటర్‌గా విద్యార్థులను ప్రోత్సాహించేందుకు శశాంక్ వర్క్‌షా పులు, సెమినార్‌లు నిర్వహించనున్నారు. చిన్నప్పటి నుంచి స్పేస్‌పై ఉన్న ఆసక్తితో ఆర్కిటెక్చర్ చేశానని శశాంక్ పేర్కొంటున్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు షురూ

ప్రారంభించిన కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు2:(ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో 68వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్ -17 బాలికల బాక్సింగ్ పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. సోమవారం హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్‌హాల్లో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయస్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి పార్థసారథి మాట్లాడుతూ...రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన అండర్-17బాలికల బాక్సింగ్ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగిందన్నారు. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 9 నుంచి 14 వరకు ఢిల్లీ నిర్వహించనున్న జాతీయస్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

అదే విధంగా మంగళవారం అండర్-19 బాలికలకు ఇదే వేదికగా బాక్సింగ్ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ బాధ్యులు స్వామి చరణ్, పీడీలు, పీఈటీలు. కోచ్‌లు పాల్గొన్నారు.



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి

సర్కారు సొమ్ముతో.. మిల్లర్ల సోకు!

(5వ పేజీ తరువాయి)

తీసుకోకపోవడంపై పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారుల్లో కొందరు మిల్లర్లతో కుమ్మక్కై అయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చర్యలు తీసుకోవటంలో జాప్యం చేస్తూ, మిల్లర్లు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునేలా సహకరిస్తున్నారనే చర్చ జరుగుతోంది. దీంతో 16మంది మిల్లర్లలో ఇప్పటికే ఐదారుగురు మిల్లర్లు హైకోర్టు నుంచి స్టే అర్డర్ తెచ్చుకున్నారని, మరికొందరు అదే పనిలో హైదరాబాద్‌లో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. సుమారు రూ.92కోట్ల విలువైన ప్రభుత్వ బియ్యాన్ని మాయం చేసిన వారిపై చర్యలు లేకుండా అధికారులే దొడ్డిదారిన సహకరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో రెవెన్యూ, సివిల్ సప్లయీస్ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అంతేకాకుండా డిఫాల్టర్‌గా గుర్తించిన మిల్లర్లు ఇతర చోట బినామీ పేరుతో మరో మిల్లును ప్రారంభించి సీఎంఆర్ కోసం ధాన్యాన్ని తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో వరంగల్ జిల్లా నర్సంపేట ఏరియాలో సీఎంఆర్‌లకు పాల్పడి రూ.కోట్లు ఎగేసిన ఓ వ్యాపారి క్రిమినల్ కేసు నమోదైంది. ఆ తరువాత రెండేళ్ల క్రితం ములుగు జిల్లాలో బినామీ పేరుతో మరో మిల్లును ఏర్పాటు చేసుకున్నారు. తాజాగా సీఎంఆర్‌లో అక్రమాలకు పాల్పడి సుమారు రూ.4కోట్లకు పైగా బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో అధికారులు పెట్టే కేసులను అక్రమార్కులు తేలికగా తీసుకుంటున్నారనే అభిప్రాయాలున్నాయి. రెవెన్యూ రికవరీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో అక్రమార్కుల్లో గుబులు రేపింది. దీంతో ప్రజాప్రతినిధులతో అధికారులపై ఒత్తిడి తెస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

ముగిసిన కార్తీక వేడుకలు

- వైభవంగా గౌరీనక్త వ్రతం
- ఆరంభమైన మార్గశిర మాసం



గౌరీ నక్తం వేడుకల్లో పాల్గొన్న మహిళలు

హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గత నెల రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్న కార్తీక మాస వేడుకలు సోమవారంతో ముగిసింది. మార్గశిర మాసం ప్రారంభమైంది. కార్తీకమాస వేడుకల్లో చివరి అంకంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై గౌరీ నక్త వ్రతాన్ని నిర్వహించారు. వేయిస్తంభాల రుద్రేశ్వరాలయ కల్యాణ మండపంలో ప్రత్యేక పీఠంపై 51 కిలోల పసుపుతో అమ్మవారిని గౌరిమాతగా తయారు చేశారు.

అనంతరం గౌరి పూజ చేసి సామూహికంగా లలితా సహస్ర పారాయణం చేసుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నీరాజన మంత్రపుష్పం, అనంతరం భక్తులకు చిత్రాన్న ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ సిబ్బంది మధుకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మణికంఠశర్మ, ప్రణవ్‌శర్మ వైదిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరంగల్ కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఆలయాల్లో సోమవారం కార్తీక మాస ముగింపు పూజలు నిర్వహించారు. చారిత్రక భద్రకాళి దేవాలయంలో శ్రీభద్రేశ్వరుడికి మహన్యాస పూర్వక నమక చమకములతో మహా రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం అర్ధనారీశ్వర రూపంలో అలంకరణ చేసి మంగళహారతులతో నివేదన చేశారు.

వందలాది మంది భక్తులు ఆలయానికి తరలి వచ్చి భద్రేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, భరత, కూచిపూడి నాట్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయంలో దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషు భారతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మార్గశిరం

చాంద్రమానం ప్రకారం మృగశిర నక్షత్రంతో కూడిన పౌర్ణమి చంద్రుడు ఉదయించే నెలను మార్గశిరగా పరిగణిస్తారు. కార్తీకం శివ విష్ణువులకు అనుకూలమైనదైతే ఈ మార్గశిర మాసం మహావిష్ణువుకు ప్రీతికరమైన మాసం. ఈ మాసంలో ధనుర్మాస పర్వం ప్రారంభం కానుండడం విశేషం. అంతేగాక ఈ మాసంలో సుబ్రహ్మణ్య షష్టి, వైకుంఠ ఏకాదశి, గీత, దత్తాత్రేయ జయంతి లాంటి పవిత్ర వేడుకలు జరగడంతో పాటు ఈ నెల 15 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస వేడుకలు వైష్ణవ ఆలయాల్లో ఆరంభం కానున్నాయి.

అర్ధనారీశ్వర అలంకరణలో భద్రేశ్వరుడు





కాలేయం క్షేమంగా...

సమతులాహారం, వ్యాయామం, టీకాలు ఇవే కాలేయానికి ప్రాణ స్నేహితులు. వీటి మీద దృష్టి పెడితే కాలేయాన్ని దెబ్బతీసే ఫ్యాటీ లివర్, లివర్ క్యాన్సర్ లాంటి శత్రువులు దరి చేరకుండా ఉంటాయంటున్నారు వైద్యులు.



కామెర్లు సోకితే పత్యంతో సరిపెట్టేసుకుంటాం. నోరూరించే బర్గర్లు ఆబగా లాగించేస్తూ ఉంటాం. పెరిగే బరువును నిర్లక్ష్యం చేస్తూ ఉంటాం. మద్యపానాన్ని సరదా కాలక్షేపంగా పరిగణిస్తూ ఉంటాం. కానీ జీవనశైలితో ముడిపడి ఉండే ఈ అంశాలన్నీ కాలేయాన్ని క్రమేపీ కుదేలు చేస్తాయనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

పొంచి ఉండే హెపటైటిస్

కాలేయం దెబ్బతినడానికి మద్యపానం, ఫ్యాటీ లివర్ డిసీజ్, హెపటైటిస్ 'బి', హెపటైటిస్ 'సి'లు ప్రధాన కారణాలు. నిజానికి వీటన్నిటినీ నియంత్రించుకునే మార్గాలున్నాయి. పదేళ్ల క్రితం హెపటైటిస్ 'సి' ప్రాణాంతకమైన వ్యాధిగా ఉండేది. ఈ వ్యాధితో కాలేయం బాగా దెబ్బతిని, క్యాన్సర్‌కు గురై, కాలేయ మార్పిడి చేసినా మళ్లీ హెపటైటిస్‌తో పూర్తిగా కోలుకోలేనంతగా దెబ్బతినే పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు అందుబాటులో ఉన్నంత సమర్థమైన చికిత్సలు అప్పట్లో లేవు. కాబట్టి మరణాల సంఖ్య ఎక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు ఎన్నో అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకొచ్చాయి. వీటితో 95 శాతానికి పైగా హెపటైటిస్ వ్యాధిని వైద్యులు సమూలంగా నయం చేయగలుగుతున్నారు. దాంతో ఈ ప్రాణాంతకమైన తీవ్ర వ్యాధి, చికిత్సకు లొంగే సాధారణ రుగ్మతగా మారిపోయింది. అయితే ఈ రుగ్మతను ఎంత సమర్థంగా నిలువరించగలిగినా, రుగ్మతలో భాగంగా కాలేయంలో కణుతులు పెరగకుండా నియంత్రించలేని పరిస్థితి. కాబట్టి ఈ రుగ్మత నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత కూడా వైద్యులను కలుస్తూ క్రమం తప్పకుండా కాలేయాన్ని పరీక్షించుకుంటూ ఉండాలి.

కాలేయ కొవ్వుతో ముప్పు

ఇప్పటికి పదేళ్ల క్రితం, వంద కాలేయ మార్పిడి చికిత్సల్లో 10 నుంచి 15 కాలేయ మార్పిడులు ఫ్యాటీ లివర్ డిసీజ్‌కు సంబంధించినవే అయి ఉండేవి. కానీ ఇప్పుడు వాటి సంఖ్య 40 నుంచి 50కి పెరిగిపోయేలా ఫ్యాటీ లివర్ డిసీజ్ అత్యంత సాధారణ కాలేయ సమస్యగా మారిపోయింది. అలాగే ఫ్యాటీ లివర్ డిసీజ్ మూలంగా కాలేయ మార్పిడి అవసరమయ్యే తీవ్ర కాలేయ సమస్యల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. మన జీవనశైలే ఈ సమస్యకు ప్రధాన కారణం. పాశ్చాత్య ఆహారపుటలవాట్లు, అధిక క్యాలరీలతో కూడిన ఆహారం, అస్తవ్యస్థ జీవనశైలి, వ్యాయామం లోపించడం, అధిక బరువు... ఇవన్నీ ఫ్యాటీ లివర్‌కు కారణాలే! స్థూలకాయంతో మధుమేహం, అధిక రక్తపోటు, ఈ రెండింటితో కాలేయ కొవ్వు సమస్యలు పెరుగుతాయి. అందుకే తాజాగా ఈ కాలేయ సమస్యను 'మెటబాలిక్ అసోసియేటెడ్ ఫ్యాటీ లివర్ డిసీజ్' అంటున్నారు. స్థూలకాయ సంబంధిత ఫ్యాటీ లివర్‌కు సంబంధించిన ఆధునిక మందులు కూడా రెండేళ్లుగా అందుబాటులోకొచ్చాయి. ఈ మందులతో బరువు తగ్గడంతో పాటు ఫ్యాటీ లివర్ పరిస్థితి కూడా కొంత మెరుగుపడుతుంది. అయితే ఈ మందులతోనే ఆరోగ్యం పూర్తిగా కుదుట పడుతుందనుకుంటే పొరపాటు. వీటిని వాడుకుంటూ అదనంగా ఆహారపుటలవాట్లను పాటిస్తూ, వ్యాయామం కూడా కొనసాగించవలసి ఉంటుంది. అప్పుడే సత్ఫలితాలను సాధించడం సాధ్యపడుతుంది.

ఓ కన్నేసి ఉంచి...

హెపటైటిస్, ఫ్యాటీ లివర్ వల్ల దెబ్బతిన్న కాలేయం తేలికగా క్యాన్సర్ బారిన పడుతుంది. ప్రతి వంద మంది కాలేయ క్యాన్సర్ రోగుల్లో, 80 మంది అప్పటికే కాలేయ జబ్బులతో బాధపడుతూ ఉంటారు. కాబట్టి కాలేయ జబ్బులతో బాధపడేవాళ్లు క్రమం తప్పకుండా కాలేయ పరీక్షలు చేసుకుంటూ, మందులు వాడుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో నడుచుకుంటూ ఉండాలి. ప్రతి మూడు నెలలకోసారి రక్తపరీక్షలు, ప్రతి ఆరు నెలలకోసారి అల్ట్రాసౌండ్ స్కాన్ చేయించుకుంటూ ఉండాలి. పొట్ట, పిత్తాశయ క్యాన్సర్లలో సర్జరీతో క్యాన్సర్ నయమయ్యే అవకాశాలు 30 నుంచి 40 శాతం మేరకే ఉంటాయి. కానీ కాలేయ క్యాన్సర్‌లో... కాలేయ మార్పిడి చేయగలిగితే వ్యాధి నయమయ్యే అవకాశాలు 80 శాతం మేరకు ఉంటాయి. కాబట్టి కాలేయ క్యాన్సర్‌కు కాలేయ మార్పిడే ఉత్తమమైన ప్రత్యామ్నాయం.

పసికందుల్లో కామెర్లు

అప్పుడే పుట్టిన పసికందుల్లో కామెర్లు సహజమే! అయితే ఈ సమస్య వారం రోజుల్లో తగ్గిపోవాలి. రెండు వారాలకు కూడా తగ్గకపోతే, ఆలస్యం చేయకుండా పిల్లల వైద్యులకు చూపించాలి. ప్రస్తుతం 'బిలేరీ అట్రేసియా' అనే కాలేయ సమస్య పసికందుల్లో కాలేయ మార్పిడిలకు కారణమవుతోంది. ఈ సమస్యను సకాలంలో గుర్తించాలంటే పసికందుల్లో కొన్ని లక్షణాలను గమనించాలి. రెండు వారాలకు మించి కామెర్లు తగ్గకపోవడం, మలం లేత రంగులో ఉండడం ఈ సమస్య ప్రధాన లక్షణాలు.

ఇమ్యునోథెరపీతో...

కాలేయ క్యాన్సర్‌లో లక్షణాలు తక్కువ కాబట్టి వ్యాధి ఆలస్యంగా బయటపడుతూ ఉంటుంది. అలాగని చివరి దశకు చేరుకున్న కాలేయ క్యాన్సర్‌ను నయం చేయడం సాధ్యపడదని అనుకోడానికి వీల్లేదు. మొదటి దశ అయినా, చివరి దశ అయినా కాలేయ క్యాన్సర్‌కు ఉత్తమమైన ప్రత్యామ్నాయం కాలేయ మార్పిడే! అయితే చివరి దశలో కాలేయంలో ఎక్కువ గడ్డలు ఉన్నా, ఒకే గడ్డ పెద్దదిగా పెరిగిపోయినా, సర్జరీ సఫలమయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. సర్జరీ చేసినా మళ్లీ వ్యాధి తిరగబెట్టే అవకాశాలు ఉంటాయి. కాబట్టి ఇమ్యునోథెరపీతో గడ్డ పరిమాణం తగ్గించి, ఆ తర్వాత కాలేయ మార్పిడి సర్జరీ చేసి క్యాన్సర్‌ను సమూలంగా నయం చేయవలసి ఉంటుంది. ఇమ్యునోథెరపీతో శరీరం క్యాన్సర్‌తో పోరాడే బలాన్ని పుంజుకుంటుంది. ఫలితంగా కణితి కుంచించుకుపోతుంది. అప్పుడు కాలేయ మార్పిడికి పరిస్థితి అనుకూలిస్తుంది. క్యాన్సర్ మొదటి దశలో, అంటే... కాలేయంలో క్యాన్సర్ గడ్డ చిన్నదిగా ఉన్నప్పుడు కూడా మెరుగైన ఫలితం కోసం కాలేయ మార్పిడినే ఆశ్రయించాలి.

ఆధునిక చికిత్సలు ఇవే!

కాలేయంలో తలెత్తే క్యాన్సర్‌లకు వైద్యులు వేర్వేరు చికిత్సలను ఆశ్రయిస్తూ ఉంటారు. ఒకరికి తగిన చికిత్స ఇంకొకరికి తగినది కాకపోవచ్చు. కాబట్టి ఎవరికి ఎలాంటి చికిత్సా విధానాన్ని ఎంచుకోవాలో, ఏ అనుబంధ చికిత్సలతో ఫలితం మెరుగ్గా ఉంటుందో వైద్యులు అంచనా వేస్తారు. వయసు, క్యాన్సర్ తత్వం, దశ, గడ్డ పరిమాణం, గడ్డ పెరిగిన ప్రదేశం, మునుపటి కాలేయ వ్యాధులు... ఈ అంశాలన్నిటినీ వైద్యులు పరిగణలోకి తీసుకుంటారు. కొందరికి సర్జరీ చేసి గడ్డను తొలగిస్తే వ్యాధి నయమైపోవచ్చు. ఇంకొందరికి నేరుగా కాలేయ మార్పిడి అవసరం పడొచ్చు. ఇంకొంతమందికి ఇతరత్రా చికిత్సలను అందించి, ఫలితం ఆధారంగా తదనంతర చికిత్సలను ఎంచుకుంటారు. ఇలా కాలేయ సర్జరీ, కాలేయ మార్పిడిలకు వెళ్లకుండా, నేరుగా క్యాన్సర్ గడ్డకే చికిత్స చేసే వెసులుబాట్లు కూడా ఉన్నాయి. వాటిలో చెప్పుకోదగినవి 'టేస్', 'టేర్'. ఈ రెండు చికిత్సల్లో క్యాన్సర్ కణితికి రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళం గుండా కణితికే నేరుగా కీమోథెరపీ, లేదా రేడియోథెరపీ ఇవ్వడం జరుగుతుంది. ఈ చికిత్సలతో కొందర్లో క్యాన్సర్ పూర్తిగా నయం అయిపోవచ్చు, ఇంకొందరికి అదనంగా ఇమ్యునోథెరపీ కూడా అవసరం పడొచ్చు.

డాక్టర్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, స్టార్ హాస్పిటల్స్, నానక్‌రామ్‌గూడ, హైదరాబాద్.



రక్తపోటు అదుపులో

రక్తపోటును అదుపులో ఉంచుకోవటం కోసం ఒత్తిడిని తగ్గించుకునే మార్గాలను అనుసరించటం, జీవన శైలి మార్పులు, మందులు, వ్యాయామం... ఇలా ఎన్నో ప్రయత్నాలు చేస్తూ ఉంటాం. అయితే తీసుకునే ఆహారం కూడా రక్తపోటు మీద ప్రభావం చూపిస్తుంది. అలాంటి ఆహారంలో 'అరటి పండు' ఒకటి.

రక్తపోటు ఉన్నవాళ్లకు వైద్యులు అరటి పండు తినమని సూచిస్తూ ఉంటారు. కానీ నిజానికి అరటి పండుకు అంత శక్తి ఉందా? అనే అనుమానం అందరికీ వస్తుంది. అయితే అరటిపండు మన శరీరం మీద చూపించే ప్రభావం గురించి తెలుసుకునే ముందు మూత్రపిండాల పనితీరు గురించి తెలుసుకోవాలి. మూత్రపిండాలు మన శరీరంలోని ద్రవాలను వడపోస్తూ అదనంగా ఉన్న ద్రవాల్ని విసర్జించేలా చేస్తూ శరీరంలో నీటి శాతాన్ని సమంగా ఉంచుతూ ఉంటాయి. ఈ విధానం అంతా మన రక్తపోటు మీద ప్రభావం చూపిస్తుంది. శరీరంలో



ఎక్కువ ద్రవాలు నిల్వ ఉండిపోతే రక్తపోటు పెరిగిపోతుంది, తక్కువ ఉంటే రక్తపోటు పడిపోతుంది. ఈ రెండూ ప్రమాదమే! ఇలా శరీరంలోని ద్రవ పరిమాణం హెచ్చుతగ్గులకు గురికాకుండా మూత్రపిండాలు సోడియం, పొటాషియం అనే రసాయనాల మధ్య సమతూకాన్ని పాటిస్తాయి. పొటాషియం ఎక్కువగా నీటిని మూత్రపిండాల్లోకి చేరవేస్తే, సోడియం నీటిని మూత్రపిండాల్లోకి చేరకుండా నియంత్రిస్తుంది. మనం ఆహారం ద్వారా తీసుకునే ఉప్పు వల్ల శరీరంలో నీరు నిల్వ ఉండిపోయి రక్తపోటు పెరిగిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే అలా నిల్వ ఉన్న నీటిని మూత్రపిండాల్లోకి చేరవేసే పొటాషియం ఉన్న ఆహారం తీసుకోవాలి. ఒక అరటి పండులో 422 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటుంది. మనకు ఒక రోజుకి అవసరమైన 4,700 మిల్లీగ్రాముల్లో ఇది పది శాతానికి సమానం. కాబట్టి రక్తపోటు ఉన్నవారు రోజుకో అరటిపండు తినటం మేలని వైద్యులు సూచిస్తూ ఉంటారు.

అవగాహన

మూత్రపిండాలు ఇలా క్షేమం

శరీరంలో ఏ కారణంగా వ్యర్థాలు పేరుకుపోయినా వాటి దుష్ప్రభావం ముందు కిడ్నీల పైన పడుతుంది. అందుకే కిడ్నీలు సక్రమంగా పనిచేయాలంటే, శరీరంలోని అన్ని అవయవాలూ ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలి. అందుకు ఒక్కో అవయవానికీ శక్తినిచ్చే సహజ సిద్ధమైన కొన్ని ప్రత్యేక ఆహార పదార్థాలు తీసుకోవాలి. అలాంటి ఆహార పదార్థాల్లో కొన్ని...

- **నిమ్మ:** అన్ని కాలాల్లోనూ, అన్ని ప్రాంతాల్లోనూ అందుబాటులో ఉండే వాటిల్లో నిమ్మకాయ ఒకటి. ఎక్కువ మంది అందులోని విశేషాలను పెద్దగా పరగణనలోకి తీసుకోరు. నిజానికి, శరీరంలోని కలుషితాలను బయటికి పంపడంలో నిమ్మకాయ అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ పరగడుపున ఒక నిమ్మకాయ రసాన్ని, నీళ్లలో కలిపి తాగితే శరీరంలోని మలినాలన్నీ తొలగిపోతాయి. శరీర బరువును తగ్గించడం నిమ్మ కలిగి ఉండే మరొక గొప్ప గుణం.




- **యాపిల్:** దీనిలో విటమిన్లు, లవణాలు, పీచుపదార్థం ఎలాగూ ఉంటాయి. వీటితో పాటు యాపిల్‌లో ఉండే ఫైటో కెమికల్స్ శరీర వ్యర్థాలను చాలా వేగంగా బయటికి పంపిస్తాయి. విటమిన్- సి చర్మాన్ని కూడా ఆరోగ్యంగా మారుస్తుంది.
- **బెర్రీ పండ్లు:** స్ట్రాబెర్రీ, బ్లాక్ బెర్రీ, బ్లూ బెర్రీ... ఈ జాతి పండ్లన్నింటిలోనూ సి విటమిన్, పీచుపదార్థం సమృద్ధిగా ఉంటాయి. ఈ పండ్లలో ఉండే ఫ్యాటీ యాసిడ్ శరీరం బరువును అదుపులో ఉంచుతుంది.
- **పైనాపిల్:** ఈ పండుతో కీళ్ల సమస్యల వల్ల వచ్చే వాపు తగ్గడంతో పాటు, గాయాలు కూడా త్వరగా మానతాయి.

ఊబకాయం

బొద్దు ముద్దు కాదు

పిల్లలు ముద్దుగా బొద్దుగా ఉండాలి అని ప్రతి తల్లీ కోరుకుంటుంది. అయితే పిల్లల బరువు వాళ్ల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు అవరోధం కాకుండా చూసుకోవాలి. ఊబకాయానికి ఆస్కారం లేని పిల్లల పోషకాహారం మీద ప్రతి తల్లీ దృష్టి పెట్టాలి.



శారీరక శ్రమ కొరవడడం, బయటి ఆహారం తినే అలవాటు పెరగడం పిల్లల ఊబకాయానికి ప్రధాన కారణాలు. అలాగే ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయడం, చక్కెర, మైదాలతో తయారయ్యే చిరుతిళ్లు, పానీయాలు తాగే అలవాటు కూడా పిల్లల్లో పెరిగిపోతోంది. వీటన్నిటి వల్ల పిల్లల్లో ఊబకాయ సమస్య పెరిగిపోతోంది. కానీ పిల్లల భోజనానికి కొన్ని పోషక నియమాలున్నాయి. వాళ్ల భోజనంలో 30% పిండిపదార్థాలు, 30% కూరగాయలు, ఆకుకూరలు, 20% పండ్లు, 15 నుంచి 20% మాంసకృత్తులు, 5 నుంచి 10% (500 మిల్లీలీటర్లు) పాల ఉత్పత్తులు ఉండేలా చూసుకోవాలి. రోజుకు రెండు సార్లు పండ్లు, ప్రతి భోజనంలో కూరగాయలు, వయసును బట్టి రోజుకు ఒకసారి నట్స్‌ను నేరుగా అందించడం లేదా పొడి చేసి పాలలో కలిపి ఇవ్వడం చేస్తూ ఉండాలి. ఏడాది వయసు దాటిన పిల్లలైతే రెండేళ్ల వయసొచ్చేవరకూ వెన్న తీయని పాలు ఆ తర్వాత వెన్న తీసిన పాలు ఇవ్వాలి. వంట నూనెల విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వీలైనంతవరకూ గానుగ నూనెలు వాడుకోవాలి. అలాగే నూనెలో ముంచి వేయించిన పదార్థాలు తగ్గించాలి. వాడిన నూనెనే మళ్లీ మళ్లీ వాడే అలవాటు మానుకోవాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే స్థూలకాయం దరి చేరదు.

తల్లితండ్రులే ఆదర్శం

ఇప్పటికే స్థూలకాయులుగా మారిన పిల్లల విషయంలో మరీ ముఖ్యంగా తల్లితండ్రులు వారికి ఆదర్శంగా మారాలి. తల్లితండ్రులు ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను అనుసరిస్తూ పిల్లలకు ఆదర్శంగా నిలవాలి. లావుగా ఉన్న పిల్లలను 'లావుగా ఉన్నావు' అంటూ కించపరచడం వల్ల వాళ్లు మానసికంగా కుంగిపోతారు. కాబట్టి 'బరువు పెరగడం అనారోగ్యకరం, ఆరోగ్యకరమైన ఆహారం తింటూ, ఒళ్లు అలసిపోయేలా ఆడుకోవాలి' అంటూ పిల్లలను ప్రోత్సహించాలి. హోటల్ భోజనాలకు, స్విగ్గీ, జొమాటోలకు స్వస్తి చెప్పి, ఇంటి భోజనానికే పరిమితం చేయాలి. పాలిష్ పట్టని బియ్యం వాడుకుంటూ, భోజనంలో అన్నంతో సమానంగా కూరలు తినేలా పిల్లలను ప్రోత్సహించాలి. పిల్లలు విపరీతమైన ఊబకాయంతో బాధపడుతున్నప్పుడు పిల్లల వైద్యులను తప్పక కలవాలి.

చక్కెరకు దూరంగా...

పిల్లలను చక్కెరకు వీలైనంత దూరంగా ఉంచాలి. తీపి పదార్థాల పట్ల వ్యామోహం ఏర్పడకుండా చూసుకోవాలి. అరుదుగా, పరిమితంగానే పిల్లలకు తీపి పదార్థాలు అందించాలి. చక్కెర కంటే బెల్లం మేలు అనేది కూడా అపోహే! చక్కెర కంటే బెల్లంతో రక్తంలోని చక్కెర మోతాదులు వేగంగా పెరుగుతాయి. పాలల్లో కలిపే బోర్న్‌వీటా, హార్లిక్స్‌లలో కూడా చక్కెర ఉంటుంది. వీటి వల్ల పిల్లలకు అదనంగా ఒరిగే ప్రయోజనం కూడా ఏమీ ఉండదు. పసికందులకు పోత పాలు పట్టించేటప్పుడు కూడా చక్కెర కలపకుండా ఇవ్వాలి.

పిల్లల ఆహారం గురించి తల్లుల్లో ఎన్నో అనుమానాలు ఉంటూ ఉంటాయి. పిల్లలు సరిపడా తినరేమోననే భయంతో స్వయంగా తినిపించడం, బలవంతంగా కూరడం లాంటివి చేస్తూ ఉంటారు. కానీ చిన్న వయసు నుంచే పిల్లలు స్వయంగా తినేలా తల్లులు అలవాటు చేయాలి.

ఈ సమస్యలు తప్పవు

పిల్లల్లో ఊబకాయం వల్ల తక్షణమే ఆరోగ్య సమస్యలు బయల్పడకపోయినా, భవిష్యత్తులో కీళ్ల నొప్పులు, మధుమేహం, అధిక రక్తపోటు, యుక్తవయసులోనే గుండెపోటు, తిన్న వెంటనే వాంతి తెచ్చుకునే 'బులీమియా' లాంటి మానసిక సమస్యలు చిన్న వయసు నుంచే మొదలవుతాయి. కొన్ని రకాల హార్మోన్ల సమస్యలున్నప్పుడు కూడా పిల్లలు ఊబకాయుల్లా మారిపోతారు. పిల్లలు ఎత్తు పెరగకుండా, బరువు పెరుగుతుంటే, హార్మోన్ అసమతౌల్యంగా భావించి ఎండోక్రైనాలజిస్ట్ చేత పరీక్షలు చేయించాలి. పిల్లలకు రోజుకు గంట వ్యాయామం తప్పనిసరి. పరుగు, సైకిల్ తొక్కడం, ఈత, బ్యాడ్మింటన్... ఇలా నచ్చిన వ్యాయామం ఎంచుకునే స్వేచ్ఛ పిల్లలకు ఇవ్వాలి. పిల్లలు టీనేజీకి చేరుకుని, ఎత్తు పెరగడం ఆగిపోయిన తర్వాతే బరువు లెత్తే వ్యాయామాలు చేయాలి. లేదంటే ఎత్తు పెరగడం ఆగిపోతుంది.

డాక్టర్ శివరంజని సంతోష్
సీనియర్ కన్సల్టెంట్, పీడియాట్రిక్స్ మాగ్నా సెంటర్స్, హైదరాబాద్.

మీకు తెలుసా?

ప్లాస్టిక్ నుంచి పలాయనం

ప్లాస్టిక్ ప్రమాదకరమని తెలిసీ దాన్నుంచి తప్పించుకోలేకపోతున్నాం. మన ఊహకందని మార్గాల్లో ప్లాస్టిక్ మన శరీరాల్లోకి చేరుకుంటూనే ఉంది. ఆ ప్లాస్టిక్ మహమ్మారి నుంచి ఎలా తప్పించుకోవచ్చో తెలుసుకుందాం!

ప్లాస్టిక్ వస్తువుల్లో ప్రమాదకర బిస్ఫినాల్ రసాయనం దాగి ఉంటుంది. ప్లాస్టిక్ వేడికి గురయినప్పుడు ఈ రసాయనం బయటకు వచ్చేస్తూ ఉంటుంది. నిల్వ పదార్థాలను ప్లాస్టిక్ సీసాలో నింపేటప్పుడు, మూతను స్టెరిలైజ్ చేస్తారు. ఆ క్రమంలో వేడి వెలువడి, ప్లాస్టిక్‌లోని ప్రమాదకర రసాయనాలు పదార్థాల్లో కలుస్తాయి. సూపర్ మార్కెట్‌లో నీళ్ల డబ్బాలు కొంటూ ఉంటాం. కానీ ఆ సీసాలు షాపుకు చేరే లోపు ఎంతసేపు ఎండకు గురయ్యాయి? దుకాణాల్లో వాటిని నిల్వ చేసే జాగా లేక, బయట ఉంచి, తర్వాత ఫ్రిజ్‌లో పెట్టారా? అనేది ఎవరికి తెలుసు? ఆకర్షణీయమైన రంగుల్లో దొరికే ప్లాస్టిక్ లంచ్ బాక్సుల్లో పదార్థాలు సర్దుకుంటున్నాం! కానీ పదార్థాలు చల్లారేంత సమయం ఆగుతున్నామా? ఓవెన్‌లో పదార్థాలు వేడిచేసే పాత్రలు ప్రధానంగా ప్లాస్టిక్‌తోనే తయారవుతూ ఉంటాయి. పిల్లలు ఆడుకునే వస్తువుల్లో 90% ప్లాస్టిక్‌వే! కర్రీ పాయింట్ నుంచి కూరలు తెచ్చుకున్నా, టీ షాపు నుంచి టీ తెప్పించుకున్నా, వాటిని ప్యాక్ చేస్తున్నదీ ప్లాస్టిక్ కవర్లలోనే!

ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు ఇవే!

టూత్‌బ్రష్ లాంటి కొన్ని ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయాలు (వేప పుల్ల) ఉన్నా ఉరుకులు పరుగుల జీవితంలో వాటిని పాటించడం కొంత కష్టం. కాబట్టి తప్పనిసరిగా ఉపయోగించవలసివచ్చే కొన్ని ప్లాస్టిక్ వస్తువుల్లో మేలైనవి, బిపిఎ ఫ్రీ రకానికి చెందినవే ఎంచుకోవాలి. ఆ వస్తువులు కొనే సమయంలో, లేబుల్ మీద బిపిఎ ఫ్రీ అని రాసి ఉందో, లేదో గమనించాలి. సాధారణంగా ప్రసిద్ధ కంపెనీలు తయారుచేసే ప్లాసిక్ వస్తువులు ఈ కోవకే చెంది ఉంటాయి. కాబట్టి ప్లాస్టిక్ నాణ్యత విషయంలో రాజీ పడకూడదు. అలాగే కొన్ని ప్లాస్టిక్ వస్తువులకు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ వస్తువులు ఎంచుకోవాలి. అవేంటంటే...

- **ప్లాస్టిక్ బాటిల్**
  ప్రత్యామ్నాయం: గాజు సీసా, స్టీలు లేదా రాగి బాటిల్
- **ప్లాస్టిక్ గిన్నెలు**
  ప్రత్యామ్నాయం: ఓవెన్‌లో గాజు లేదా పింగాణీ గిన్నెలే వాడాలి.
- **ప్లాస్టిక్ ప్లేట్లు**
  ప్రత్యామ్నాయం: స్టీలు, పింగాణీ ప్లేట్లలో భోజనం చేయాలి

మూడు తరాల వరకూ...

ప్లాస్టిక్ వాడకంతో శరీరం మీద పడే దుష్ప్రభావాలు మూడు తరాల వరకూ కొనసాగుతాయి. బాల్యంలో, యుక్తవయసులో, మధ్య వయసులో... ఇలా జీవితంలోని మూడు దశల్లో వేర్వేరు ఆరోగ్య సమస్యలను కూడా కలిగిస్తాయి. అండాలు, వీర్యకణాల డిఎన్ఎల్లో తేడాలు ఏర్పడి, మూడు తరాల వరకూ పునరుత్పత్తి సమస్యలు వంశపారంపర్యంగా కొనసాగుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి సాధ్యమైనంత వరకూ ప్లాస్టిక్‌కు బహిర్గతం కాకుండా జాగ్రత్త పడాలి.



- **ప్లాస్టిక్ కప్పులు**
  ప్రత్యామ్నాయం: స్టీలు, పింగాణీ కప్పులు
- **ప్లాస్టిక్ ఆట వస్తువులు**
  ప్రత్యామ్నాయం: సాఫ్ట్ టాయిస్
- **ప్లాస్టిక్ స్ట్రా**
  ప్రత్యామ్నాయం: స్టీలు స్ట్రా

పోషణ

మహిళలు - పోషకాలు!

మహిళలకు కొన్ని పోషకాలు అత్యవసరం. వీటి లోపం ఏర్పడితే కీలకమైన జీవక్రియలు అదుపు తప్పుతాయి. కాబట్టి పోషకాలు, వాటి అవసరాల గురించి అవగాహన ఏర్పరుచుకోవాలి.

ఇనుము:
ఇనుము శక్తినిస్తుంది. ఆక్సిజన్ శరీరంలో సక్రమంగా ప్రసరించడానికి కూడా ఇనుము అవసరమే! వ్యాధినిరోధకశక్తి, కండరాల పనితీరు మెరుగ్గా ఉండాలన్నా తగుమాత్రం ఇనుము తీసుకోవడం తప్పనిసరి.

బి12:
మెదడు, నాడీవ్యవస్థ, రక్తకణాల పనితీరుకు బి12 సరిపడా ఉండాలి. శరీరం హుషారుగా ఉండాలంటే బి12 తగు ప్రమాణాల్లో శరీరానికి అందాలి.

బయోటిన్:
చర్మం, వెంట్రుకలు, గోళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే తగినంత బయోటిన్ అందేలా చూసుకోవాలి. నాడీ, జీర్ణ, గుండె సంబంధ జీవక్రియలు సక్రమంగా జరగాలన్నా ఈ పోషకం అందాలి.



క్యాల్షియం:
బలమైన ఎముకల కోసం క్యాల్షియం అవసరం. గుండె, కండరాలు, నాడులు చురుగ్గా పని చేయాలన్నా క్యాల్షియం సరిపడా తీసుకోవాలి.

మెగ్నీషియం:
నెలసరి నొప్పుల నుంచి ఉపశమనం దొరకాలన్నా, నెలసరి సమస్యలు తొలగాలన్నా, నీరసం, ఒళ్లు నొప్పులు వదలాలన్నా మెగ్నీషియం సమృద్ధిగా తీసుకోవాలి.

కులోన్మాదానికి మహిళా కానిస్టేబుల్ బలి

(మొదటి పేజీ తరువాయి)

ఆమె దారుణహత్యకు గురవడం మరీ విషాదం! హత్యకు ఒడిగట్టింది ఆమె సోదరుడు. అక్కా తమ్ముళ్లది రాయ్‌పోల్ గ్రామం. తల్లిదండ్రులు పద్మ-రమేశ్. ఈ దంపతులకు నాగమణి, పరమేశ్‌తో పాటు మరో కూతురు కూడా ఉంది. 12 ఏళ్ల క్రితం తల్లిదండ్రులు పద్మ-రమేశ్ చనిపోయారు. రెండో సంతానమైన నాగమణికి 8 ఏళ్ల క్రితం ఇబ్రహీంపట్నం మండలం పటేల్‌గూడకు చెందిన వ్యక్తితో పెద్దలు వివాహం జరిపించారు. అప్పటికే తమ గ్రామానికే చెందిన, వేరే కులానికి చెందిన డ్రైవర్ బండారి శ్రీకాంత్‌తో నాగమణి ప్రేమలో ఉంది. 2020లో నాగమణి పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికైంది. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తోంది. మూడేళ్ల క్రితం నాగమణి తన భర్తతో విడాకులు తీసుకుంది. అప్పటి నుంచి శ్రీకాంత్‌తో సహజీవనం చేస్తోంది. కొన్నాళ్లుగా నాగమణి-శ్రీకాంత్ వనస్థలిపురంలో ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. గత నెల 10న నాగమణి-శ్రీకాంత్ యాదగిరిగుట్టలో పెళ్లి చేసుకున్నారు. వేరే కులం యువకుడిని అక్క పెళ్లి చేసుకోవడంపై పరమేశ్ ఆగ్రహంతో రగిలిపోయాడు. రెండెకరాలు అమ్మి ఘనంగా పెళ్లి చేస్తే బావతో విడాకులు తీసుకోవడం.. ఆపై వేరే కులానికి చెందిన వ్యక్తితో సహజీవనం చేయడం, అతడిని పెళ్లి చేసుకొని, ఆ ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టడంతో తెలిసిన వాళ్ల మధ్య తలెత్తుకోలేకపోతున్నానని అక్కపై కోపం పెంచుకున్నాడు. ఇక శనివారం శ్రీశైలం వెళ్లి దైవదర్శనం చేసుకున్న నాగమణి-శ్రీకాంత్ దంపతులు ఆదివారం సెలవు కావడంతో రాయ్‌పోల్‌కు వచ్చారు. ఆ రోజు అత్తగారి ఇంట్లోనే ఆమె బస చేసింది. సోమవారం ఉదయం 8:30కు నాగమణి విధుల కోసం ఇంటి నుంచి స్కూటీపై హయత్‌నగర్‌వైపు బయలుదేరింది. పథకం ప్రకారం ఆమె కారులో పరమేశ్ అనుసరించాడు. గుర్తించిన నాగమణి.. తమ్ముడు తనను కారులో వెంబడిస్తున్నట్లు తన భర్తకు ఫోన్‌చేసి వివరించేంతలోనే ఫోన్ కట్ అయినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే మన్నెగూడ రోడ్డులో స్కూటీని పరమేశ్ తన కారుతో ఢీకొట్టాడు. స్కూటీ నుంచి ఆమె కింద పడిపోగానే కారులోంచి వెంట తెచ్చుకున్న వేట కొడవలితో దిగి, ఆమె మెడపై వేటు వేశాడు. ఈ ఘటనలో మెడ లోతుగా తెగి, తీవ్ర రక్తస్రావం కావడంతో నాగమణి అక్కడికక్కడే మృతిచెందింది. మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ బృందాన్ని రప్పించి వివరాలు సేకరించారు. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. హత్యచేసిన వెంటనే నిందితుడు పరమేశ్ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తోంది. కాగా శ్రీకాంత్ కుటుంబీకులు, దళిత సంఘాల నాయకులు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, శ్రీకాంత్ కుటుంబానికి రక్షణ కల్పించాలని కుల వివక్ష వ్యతిరేక కమిటీ జిల్లా అధ్యక్షుడు సామేల్ డిమాండ్ చేశారు.

అక్క దగ్గర ఉన్న ఎకరం కూడా రాయించుకొని..

గ్రామస్థుల వివరాల ప్రకారం.. పద్మ-రమేశ్ దంపతులకు రాయపోల్‌లో 8 ఎకరాల పొలం ఉండేది. వీరు చనిపోయాక.. బంధువులు, ఓ రెండు ఎకరాలు అమ్మేసి నాగమణి పెళ్లి జరిపించారు. మిగిలిన నాలుగు ఎకరాల్లో రెండెకరాలు పరమేశ్ పేరిట రాసి.. నాగమణి పేరిట, మరో కుమార్తె పేరిట చెరో ఎకరం రాశారు. పరమేశ్ ఓ ఎకరం అమ్మేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అడుగుపెట్టాడు. ప్రస్తుతం అక్కడ ఎకరం విలువ రూ.2 కోట్ల దాకా ఉంది. భూమికి భారీ ధర పలుకుతుండటంతో అక్క నాగమణిపై ఒత్తిడి తెచ్చి.. ఆమె పేరిట ఉన్న ఎకరం భూమిని తన పేరు మీద మార్చుకున్నాడు. వారసత్వ ఆస్తి కావడంతో రిజిస్ట్రేషన్ అనంతరం కూడా ఆ భూమిపై తనకు ఎలాంటి హక్కులు లేవని రాసివ్వాల్సిందిగా నాగమణిపై పరమేశ్ ఒత్తిడి చేస్తున్నట్లు స్థానికులు చెప్పారు.

వాజేడు ఎస్సై ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

సాగుతున్నాయి. వీటిపై పోలీసు శాఖ విచారణ చేపట్టింది. క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. కాగా, వాజేడు ఠాణా పరిధిలో ఇటీవల పోలీస్ ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరిని మావోయిస్టులు హత్య చేశారు. రెండు నెలల క్రితం కూడా.. మావోయిస్టులు రెండుసార్లు సమావేశం నిర్వహించారు. ఈ పరిస్థితుల్లో పని ఒత్తిడితోనే ఎస్సై హరీశ్ బలవన్మరణానికి పాల్పడారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, సంఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఎస్పీ శబరీశ్ మీడియాతో మాట్లాడారు. వ్యక్తిగత కారణాలతోనే ఎస్సై ఆత్మహత్య చేసుకున్నారని వెల్లడించారు. భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన హరీశ్.. 2020లో ఎస్సైగా ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం వాజేడు మండలం పేరూరులో 2022లో విధుల్లో చేరారు. ఏడాది పాటు ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసి, వీఆర్‌లో ఉంచా రు. జూన్ 17న వాజేడు ఎస్సైగా వచ్చారు. కాగా, హరీశ్‌కు వివాహం కాలేదు. మల్లికాంబ, రామన్న దంపతుల రెండో కుమారుడు ఈయన. అన్న కుమారస్వామి సీఐఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్‌గా అసోంలో పనిచేస్తున్నారు. హరీశ్‌కు చెల్లెలికి వివాహమైంది.

ఆ యువతి ఎవరు?

హరీశ్ బలవన్మరణంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆత్మహత్య చేసుకున్న సమయంలో ఆయనతో పాటు ఓ యువతి ఉండడం, ఎస్సై మృతదేహంపై పడి ఆమె రోదిస్తున్న ఫొటో వైరల్ అయింది. యువతిని కొద్దిసేపటికి అక్కడి నుంచి ఎవరో తీసుకెళ్లారని ప్రచారం జరుగుతోంది. ఈమెతో ఆదివారం సాయంత్రమే హరీశ్ రిసార్టుకు వచ్చినట్లు తెలుస్తోంది. వీరు ప్రేమలో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. కాగా, హరీశ్‌కు త్వరలో మరో యువతితో పెళ్లి జరగనుంది. ఈ నేపథ్యంలో హరీశ్‌తో ఉన్న యువతి పెళ్లి కోసం ఒత్తిడి చేయడంతో, ఎటూ తేల్చుకోలేక ఆయన మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. రిసార్ట్‌లో అర్ధరాత్రి వరకు కూడా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. అయితే, ఆ యువతి ఎవరు? అనేది స్పష్టం కాలేదు. పోలీసులు కూడా గోప్యత పాటిస్తున్నారు. విధి నిర్వహణ విషయంలో హరీశ్‌కు మంచి పేరుంది. ఆత్మహత్య వెనుక బలమైన కారణాలు ఉండి ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్నేహితులు సైతం హరీశ్ అందరితో కలుపుగోలుగా ఉంటారని చెబుతున్నారు. ఆయన ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, ఇందులో కుట్ర ఉందని విచారణ జరపాలని కుటుంబ సభ్యులు పోలీసు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

రైతులపైకి దూసుకెళ్లిన లారీ..

నలుగురి దుర్మరణం

మరో నలుగురికి తీవ్ర గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం.. రంగారెడ్డి జిల్లా ఆలూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకుంటున్న రైతులపైకి మృత్యు శకటంలా వెళ్లిన లారీ
- అప్రమత్తతతో కొందరికి తప్పిన ముప్పు
- లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్.. జేసీబీ సాయంతో బయటకు
- ఆలూరు గ్రామస్థుల ఆగ్రహం.. రోడ్డుపై ధర్నా
- ప్రమాదంపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్ర్భాంతి
- వికారాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- బైక్‌పై తిరగబడ్డ బొలేరో.. ఇద్దరి మృతి



రాములు, శ్యామల సుజాత, దామరగిద్ద కృష్ణ

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అది హైదరాబాద్-బీజాపూర్ రహదారి.. ఆ హైవేలో రంగారెడ్డి జిల్లా ఆలూరు వద్ద రైతులు తాము పండించిన కూరగాయలను రోజూలాగానే రోడ్డు పక్కన పెట్టి అమ్ముకుంటున్నారు.. సోమవారం సాయంత్రం 4.40 గంటల సమయంలో వారిపైకి హఠాత్తుగా మృత్యువు లారీ రూపంలో దూసుకొచ్చింది.. అతివేగంగా బస్సును ఓవర్ టేక్ చేయబోయిన ఆ లారీ.. అదుపు తప్పి.. రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముకుంటున్న రైతుల పైకి దూసుకెళ్లింది. ముగ్గురు వ్యక్తులు లారీ చక్రాల కింద నలిగిపోయారు. ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మరో నలుగురికి తీవ్ర గాయాలవగా.. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గేటు వద్ద జరిగిన ఈ ఘోర ప్రమాదం అందరినీ కలచివేసింది. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వికారాబాద్ వెళుతున్న లారీ డ్రైవర్ ఆలూరు వద్ద ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేయబోయబోగా.. అతివేగం కారణంగా అదుపు తప్పింది. రోడ్డు పక్కనే కూరగాయలు అమ్ముకుంటున్న రైతుల పైనుంచి దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. లారీ ఢీకొట్టిన వేగానికి భారీ చెట్టు విరిగిపోయింది. లారీ ముందు టైరు ఊడి పంట పొలాల్లో ఎగిరిపడింది. ఈ ప్రమాదంలో ఆలూరుకు చెందిన నక్కలపల్లి రాములు(46), దామరగిద్ద కృష్ణ (22)తో పాటు నాన్‌చెరుకు చెందిన శ్యామల సుజాత(36) అక్కడికక్కడే మృతి చెందారు. గుర్తు తెలియని మరో యవకుడు(27) చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు అతని వివరాల కోసం ఆరా తీస్తున్నారు. లారీ డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు.. ఆలూరుకు చెందిన మొగులయ్య, ఆకుల పద్మమ్మ, నాన్‌చెరుకు చెందిన బాలమణి, మాల్యాద్రికి గాయాలయ్యాయి. క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన లారీ డ్రైవర్‌ను జేసీబీ యంత్రం సాయంతో పోలీసులు బయటకు తీశారు. లారీ డ్రైవర్‌కు కాళ్లు విరిగిపోయాయి. పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

త్రుటిలో తప్పించుకున్నాం

గత కొన్నేళ్ల నుంచి ఆలూరు గేటు వద్ద కూరగాయలు అమ్ముకుంటున్నాం. సోమవారం సాయంత్రం నా భార్య పద్మమ్మను ఇంటికి తీసుకెళ్లేందుకు గేట్ దగ్గరకు వెళ్లాను. చూస్తుండగానే లారీ మా పైకి దూసుకొచ్చింది. వెంటనే కూరగాయలు వదిలిపెట్టి పక్కకు పరుగులు తీశాం. నా భార్య తలకు గాయం అయింది. దేవుడి దయ వల్ల మాకు పెద్ద ప్రమాదం తప్పింది.

- ఆకుల పాండు, ప్రత్యక్ష సాక్షి

అప్రమత్తతో తప్పిన ముప్పు

లారీ అదుపు తప్పి వస్తున్న విషయాన్ని కొందరు గమనించి పరుగులు తీశారు. లేదంటే ప్రాణనష్టం ఇంకా ఎక్కువగా ఉండేది. సంఘటన జరిగిన సమయంలో అక్కడ దాదాపు 40 మంది రైతులు ఉన్నారు. వంద మీటర్ల దూరం నుంచే ప్రమాదాన్ని గమనించిన కొందరు కేకలు వేసుకుంటూ పరుగులు పెట్టారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఆలూరు గేటు వద్ద స్థానిక రైతులు కొన్నేళ్లుగా తాము పండించిన కూరగాయలను అమ్ముకుంటూ జీవిస్తున్నారు. కూరగాయలు చౌకగా, తాజాగా ఉండడంతో చుట్టుపక్కల ప్రాంతాల వారితో పాటు హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగించే వారు వీరి దగ్గర కొనుక్కుంటూ ఉంటారు. అతివేగం.. లారీ డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. హైదరాబాద్-బీజాపూర్ రహదారి ఇరుకుగా ఉండడంతో పాటు గుంతలు, ప్రమాదభరిత మలుపులు ఉన్నాయి. లారీ డ్రైవర్ ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నిస్తూ.. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పిస్తున్నాడు. వేగాన్ని తగ్గించకుండానే బస్సును ఆలూరు గేట్ వద్ద ఓవర్ టేక్ చేయడంతో అదుపుతప్పి లారీ కుడి వైపునకు దూసుకెళ్లింది. ఓవర్ టేక్ చేయకుంటే ప్రమాదం జరిగేది కాదని స్థానికులు చెప్పారు. కూరగాయలు అమ్ముకుని జీవిస్తున్న రైతులను మృత్యువు కబళించడంతో ఆలూరు, నాన్‌చెరు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

నిత్యం ప్రమాదాలే..

ఈ రహదారిలో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీడీఎల్‌కు చెందిన ఉద్యోగి, ఆయన భార్య మృతి చెందారు. 24 గంటలు గడవక ముందే లారీ దూసుకొచ్చి నలుగురు చనిపోయారు. ఇటీవలే హైదరాబాద్-బీజాపూర్ హైవే విస్తరణకు నిధులు మంజూరయ్యాయి. కోర్టులో కేసులతో పనులు ఆగాయి. ఇటీవల కేసులన్నీ వీగిపోయినప్పటికీ పనులు మాత్రం మొదలు కాలేదు.

ఆగ్రహంతో గ్రామస్థుల ధర్నా

రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందడంతో ఆలూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిపై ధర్నా చేశారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిత్యం ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నా.. ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని మండిపడ్డారు. పోలీసులు ధర్నా చేస్తున్న వారిని సముదాయించారు.

కారు, బొలేరో ఢీ.. బైక్‌పై పడి ఇద్దరి మృతి

వికారాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వస్తున్న కారు, బొలేరో వాహనం ఢీ కొన్న ఘటనలో బొలేరో ఎదురుగా వస్తున్న బైక్‌పై పడింది. బైక్‌పై ఉన్న ఇద్దరు మృతి చెందగా బొలేరో వాహనంలో ఉన్న మద్యం లోడ్ నేలపాలైంది. వికారాబాద్ పట్టణం రాజీవ్ నగర్ కాలనీకి చెందిన రవీందర్ (45) మెడికల్ కళాశాలలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన హేమంత్(25) అనంతగిరిలోని ఆయుష్ ఆస్పత్రి నిర్మాణ భవనంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ఇద్దరూ రేషన్ సరుకుల కోసం వికారాబాద్‌కు బైక్‌పై వెళ్తున్నారు. అదే సమయంలో మద్యం లోడుతో వెళుతున్న బొలేరో వాహనం రాజీవ్ నగర్ నుంచి వస్తున్న కారు ఢీకొన్నాయి. బొలేరో వాహనం బైక్‌పై ఎగిరిపడింది. దీంతో రవీందర్, హేమంత్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. రవీందర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు; హేమంత్‌కు భార్య ఉంది.

మద్యం కోసం ఎగబడ్డ స్థానికులు

బొలేరో వాహనంలో ఉన్న మద్యం బాక్సులు కిందపడిపోవడంతో రోడ్డు మొత్తం మద్యం ఏరులై పారింది. దీంతో వాహన రాకపోకలు చాలాసేపు నిలిచిపోయాయి. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలై, కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా.. జనం మాత్రం మద్యం ఎత్తుకెళ్లేందుకు ఉత్సాహం చూపించారు. కారులోని వ్యక్తులు, బొలేరోలో ఉన్న వ్యక్తులు తప్పించుకోగా పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిగ్ర్భాంతి

రంగారెడ్డి జిల్లాలో లారీ బీభత్సం సృష్టించిన ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మృతులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. కాగా, రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ మంత్రి సబిత, ఎమ్మెల్యే కాలె యాదయ్య, తదితరులు చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పరామర్శించారు.

నవ్య | చిత్రజ్యోతి



కన్నప్పలో కవలలు

డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న భారీ ప్రతిష్ఠాత్మక చిత్రం 'కన్నప్ప' వచ్చే ఏడాది ఏప్రిల్ 25న విడుదల కానుంది. విష్ణు మంచు టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ సినిమాకు ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ కాళహస్తి పురాణ కథ ప్రాముఖ్యాన్ని చాటి చెప్పే పాటలో విష్ణు కవల కుమార్తెలు అరియానా, వివియానా నటిస్తున్నారు. వారిద్దరి పుట్టిన రోజు సందర్భంగా గిరిజన వేషధారణలో ఉన్న వారి లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'పాట పాడినా, నృత్యం చేసినా.. ఇది శివుని కోసం' అని ఆ పోస్టర్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ 'నా కుమార్తెల ఫస్ట్ లుక్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. నా చిన్ని తల్లులు తెరపై సృష్టించే మ్యాజిక్‌ను చూడడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను' అని చెప్పారు.

సంచారి సంచారి... ఎటువైపో నీ దారి



మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శ్రీదేవీ మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. డిసెంబరు 20న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రంలోని రెండో పాట 'సంచారి సంచారి.. ఎటువైపో నీ దారి'ని మేకర్స్ విడుదల చేశారు. ఈ గీతాన్ని రామజోగయ్య శాస్త్రి రాయగా, సంజిత్ హేగ్డే ఆలపించారు. వివేక్ సాగర్ స్వరపరిచారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ 'ఎటువంటి కథలోనైనా భావోద్వేగం లేకపోతే ఆ కథకు పరిపూర్ణత ఉండదు. ఈ సినిమాలో ప్రధానమైన అంశం ప్రేమ. తాను ప్రాణంగా ప్రేమించిన అమ్మాయికి, తన నమ్మకానికి మధ్య నలిగిపోయిన వ్యక్తి కథే 'సారంగపాణి జాతకం' అని అన్నారు. ఈ చిత్రంలో నరేశ్ విజయకృష్ణ, తనికెళ్ల భరణి, శ్రీనివాస్ అవసరాల, వెన్నెల కిశోర్, వైవా హర్ష తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

పాతికేళ్ల ప్రయాణం.. మరిచిపోలేని అనుభూతులు



గోపిచంద్ హీరోగా నటించిన 'విశ్వం' సినిమాతో హిట్ కొట్టి మళ్లీ ఫామ్‌లోకి వచ్చారు డైరెక్టర్ శ్రీనువైట్ల. ప్రస్తుతం తన తదుపరి సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌లో ఉన్న శ్రీనువైట్ల.. తను తెరకెక్కించిన మొదటి సినిమా 'నీ కోసం' విడుదలై పాతికేళ్లు అయిన సందర్భంగా మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడిగా పాతికేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఓ దర్శకుడిగా ఎన్నో జ్ఞాపకాలను.. మరెన్నో మర్చిపోలేని అనుభూతులను సొంతం చేసుకున్నాను. ఇన్నేళ్లు దర్శకుడిగా కొనసాగుతానని ఊహించలేదు. ఈ పాతికేళ్ల కెరీర్‌లో ఎన్నో అద్భుతాలు జరిగాయి. ఓ దర్శకుడిగా నాకు నచ్చిన నా టాప్ ఫైవ్ చిత్రాలు.. 'ఆనందం', 'వెంకీ', 'రెడీ', 'దూకుడు', 'ఢీ'. తొలి సినిమా 'నీ కోసం' టైమ్‌లో తోడ్పాటు అందించిన అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. 'విశ్వం'తో తిరిగి హిట్ కొట్టినందుకు చాలా సంతోషంగా ఉన్నా. నా నెక్స్ట్ చిత్రం ఓ ఫ్రెష్ ఐడియాతో పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి నమ్మకం ఉంది. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటిస్తా" అని చెప్పారు.

సిల్క్ స్మితపై మరో బయోపిక్



దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమలో ఓ వెలుగు వెలిగిన నటి సిల్క్ స్మిత జీవితంపై మరో బయోపిక్ రెడీ అవుతోంది. స్మిత పుట్టిన రోజు(డిసెంబరు 2) సందర్భంగా ఎస్‌టీఆర్ఐ సినిమాస్..తాము తీయబోయే నూతన చిత్రం 'సిల్క్ స్మిత- క్వీన్ ఆఫ్ ద సౌత్'ని అనౌన్స్ చేసింది. ఈ అఫీషియల్ బయోపిక్‌లో చంద్రిక రవి టైటిల్ రోల్ పోషిస్తున్నారు. ఈమేరకు మేకర్స్ ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో సిల్క్ స్మిత- సౌత్ క్వీన్ గురించి ప్రేక్షకులకు ఒక గ్లింప్స్ అందించారు. జయరామ్ శంకరన్ దర్శకత్వంలో ఎస్‌బి విజయ్ అమృత్‌రాజ్ నిర్మించనున్న ఈ చిత్రం ప్రొడక్షన్ 2025లో ప్రారంభం కానుంది. సిల్క్ స్మిత జీవితంపై పదమూడేళ్ల క్రితమే ఓ సినిమా వచ్చింది. 2011 విలన్ లుత్రియా దర్శకత్వంలో 'ద డర్టీ పిక్చర్' అనే హిందీ మూవీ రిలీజ్ అయ్యింది. ఏక్తాకపూర్, శోభా కపూర్ నిర్మించారు. టైటిల్ రోల్‌లో విద్యాబాలన్ నటించారు. ఈ మూవీతో విద్యాబాలన్ ఓవర్‌నైట్ స్టార్ అయిపోయారు. 'డర్టీ పిక్చర్' తర్వాత 13 ఏళ్లకు తాజాగా ఎస్‌టీఆర్ఐ సినిమాస్ 'సిల్క్ స్మిత'పై బయోపిక్ చిత్రీకరణకు పూనుకుంది. 'సిల్క్ స్మిత- క్వీన్ ఆఫ్ ద సౌత్' చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా తెరకెక్కించనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీతో సిల్క్ స్మిత ఇంట్రడక్షన్‌ని ప్లాన్ చేసిన విధానం మేకర్స్ రిలీజ్ చేసిన గ్లింప్స్‌లో హైలెట్‌గా ఉంది. కొన్ని పత్రికలు చూస్తు...ఈ సిల్క్ ఎవరు? అని ఇందిరాగాంధీ అడిగితే 'మీరు ఐరన్ లేడీ అయితే...ఆమె మాగ్నటిక్ లేడీ' అంటూ సిల్క్ స్మితకి ఇచ్చిన ఎలివేషన్ అదిరిపోయింది.

పుష్ప వైల్డ్ ఫైర్ జాతర

అల్లు అర్జున్ హీరోగా నటించిన 'పుష్ప 2' చిత్రం కోసం 'పుష్ప వైల్డ్ ఫైర్ జాతర' పేరుతో సోమవారం హైదరాబాద్‌లోని (యూసఫ్‌గూడా) పోలీస్ గ్రౌండ్స్‌లో భారీ స్థాయిలో నిర్వహించిన ఈవెంట్‌కు దర్శకదిగ్గజం రాజమౌళి, సీనియర్ నిర్మాత అల్లు అరవింద్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. చిత్ర కథానాయిక రష్మిక, స్పెషల్ సాంగ్ చేసిన శ్రీలీల, సంగీత దర్శకుడు దేవి శ్రీప్రసాద్, దర్శకుడు సుకుమార్, నిర్మాతలు నవీన్, రవిశంకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ 'బన్నీ మీద ప్రేమతోనే ఈ సినిమా తీశాను. నన్ను నమ్మి బన్నీ నాతో ప్రయాణం చేసినందుకు ఆయన కోసం ఏమైనా చేసేయ్యవచ్చు అనిపించింది' అన్నారు. అల్లు అర్జున్ మాట్లాడుతూ 'ప్రేమతో, భక్తితో ఈ సినిమా చేశాం. దర్శకుడు సుకుమార్ ఈ సినిమాకి చాలా కష్టపడ్డారు. తప్పకుండా మిమ్మల్ని అలరించే సినిమా అవుతుంది' అన్నారు .

2040లో ఏం జరుగుతుంది?



కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'యూఐ ద మూవీ'. కెపి శ్రీకాంత్ నిర్మిస్తున్నారు. నవీన్ మనోహరన్ సహ నిర్మాత. సినిమా డిసెంబరు 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ వార్నర్‌తో ముందుకు వచ్చారు. ఇది సినీ ప్రపంచంలో ఒక గ్లింప్స్‌ని అందిస్తోంది. వార్నర్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంది. ఉపేంద్ర మరో వినూత్నమైన కాన్సెప్ట్‌తో ఆకట్టుకునేలా ప్రెజెంట్ చేశారు. చిత్రకథ 2040లో జరుగుతుంది. బాధాకరమైన సమాజానికి దారితీసే గ్లోబల్ వార్మింగ్, కొవిడ్-19, ఏఐ, నిరుద్యోగం వంటి అంశాలతో చిత్రాన్ని తెరకెక్కించారు. రీష్మా నానయ్య, మురళీ శర్మ, సన్నీ లియోన్, నిధి సుబ్బయ్య, సాధు కోకిల తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

31 రోజులు.. రూ.368 కోట్లు!



రొటీన్ యాక్షన్ చిత్రాలు, మాస్ చిత్రాలకంటే ఉత్తరాది ప్రేక్షకులు హారర్ కామెడీ చిత్రాలనే ఎక్కువ ఇష్టపడుతున్నారని మరోసారి రుజువైంది. కార్తిక్ ఆర్యన్, త్రిప్తి ద్రిమి, విద్యాబాలన్, మాధురీ దీక్షిత్ ముఖ్య పాత్రలు పోషించిన 'భూత్ భూలయ్యా 3' చిత్రం బాక్సాఫీసుని కొల్లగొడుతోంది. నవంబర్ ఒకటిన విడుదలైన ఈ సినిమా 'సింగం అగైన్' వంటి భారీ చిత్రం పోటీని తట్టుకుని నిలబడడమే కాకుండా ఈ నెల రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా రూ. 368 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం. 'సింగం అగైన్', 'భూల్ భూలయ్యా 3' చిత్రాలు రెండూ ఒకే రోజున దీపావళి సందర్భంగా నవంబర్ ఒకటిన విడుదలయ్యాయి. అజయ్ దేవగణ్, అక్షయ్‌కుమార్, రణవీర్ సింగ్, టైగర్ ష్రాఫ్, కరీనా, దీపిక.. వంటి టాప్ స్టార్స్ ఉన్న సినిమా కనుక సహజంగానే 'సింగమ్ అగైన్' చిత్రానికి భారీ ఓపెనింగ్స్ వచ్చాయి. దాంతో పోలిస్తే 'భూల్ భూలయ్యా 3' చిత్రానికి థియేటర్ల దగ్గర ప్రేక్షకులు తక్కువ సంఖ్యలో కనిపించారు. ఇందులో స్టార్స్ లేకపోవడమే ప్రధాన కారణం. అయితే స్టార్స్ కంటే కంటెంట్ ముఖ్యం కనుక రెండో వారం నుంచి భూల్ భూలయ్యా 3' చిత్రానికి కాసుల వర్షం కురవడం మొదలైంది. నవ్విస్తూ భయపెడుతున్న ఈ సినిమా చూసి జనం తెగ ఎంజాయ్ చేస్తున్నారు.

సినిమాలకు విరామం



సాధారణంగా నటులు సినిమా తర్వాత సినిమా చేస్తూ.. లేదా ఒకేసారి పలు ప్రాజెక్టులు చేస్తూ అభిమానుల్ని ఖుషీ చేస్తుంటారు. అయితే, అందుకు భిన్నంగా 'ట్వల్త్ ఫెయిల్' సంచలనం విక్రాంత్ మస్సే తీసుకున్న ఓ నిర్ణయం ఇప్పుడు అభిమానులను నిరాశలో ముంచేసింది. ఇటీవలే 'సబర్మతీ రిపోర్ట్' సినిమాతో ప్రేక్షకులను పలకరించిన ఆయన... సినిమాలకు విరామం ప్రకటించారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్టు పెట్టారు. "ఓ నటుడిగా గడిచిన కొన్నేళ్లు అద్భుతమైన సంతృప్తినిచ్చాయి. వెలకట్టలేని మీ ప్రేమను.. ప్రోత్సాహాన్ని అందించిన మీ అందరికీ కృతజ్ఞతలు. నటుడిగా మీ అందరినీ అలరించినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇప్పుడు నా సమయాన్ని కుటుంబానికి కేటాయించాలనుకుంటున్నాను. అందుకే సినిమాలకు విరామం తీసుకుంటున్నాను. మళ్లీ తగిన సమయం వచ్చే వరకు.. ప్రస్తుతం చేస్తున్న ప్రాజెక్టులే చివరివి. వచ్చే ఏడాది విడుదలయ్యే నా రెండు సినిమాలతో చివరిసారి కలుసుకుందాం. మరోసారి అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. కాగా, 2013లో 'లుటేరా' సినిమాతో తెరంగేట్రం చేశారు విక్రాంత్. తర్వాత 'హాఫ్ గర్ల్‌ఫ్రెండ్' చిత్రం.. 'మీర్జాపూర్', 'మేడ్ ఇన్ హెవెన్' వెబ్ సిరీస్.. 'హసీనా దిల్‌రుబా' మూవీ సిరీస్‌తో గుర్తింపు పొందారు. ఆయన ప్రస్తుతం 'యార్ జిగ్రీ'.. 'అంఖోంకీ గుస్తాకియాన్' చిత్రాల్లో నటిస్తున్నారు.

శ్రీకృష్ణుడే మా సూపర్‌స్టార్



శ్రీకృష్ణుడికి, ఆయన భక్తుడికి మధ్య జరిగిన ఓ అద్భుతాన్ని ప్రేరణగా తీసుకుని రూపొందించిన చిత్రం 'డియర్ కృష్ణ'. అక్షయ్ హీరోగా నటించిన ఈ చిత్రంలో మలయాళ నటి మమిత బైజు ఒక హీరోయిన్ కాగా, ఐశ్వర్య మరో హీరోయిన్. దినేశ్‌బాబు దర్శకత్వంలో పి.ఎన్.బలరామ్ నిర్మిస్తున్నారు. సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ ' ఈ సినిమాకు నేను నిర్మాతని కాదు.. శ్రీకృష్ణుని సందేశాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్న వ్యక్తిని. మా కుటుంబంలో జరిగిన ఓ అద్భుతాన్ని కథగా మలిచి ఈ సినిమా తీస్తున్నాం. మా అబ్బాయి అక్షయ్ హీరోగా నటిస్తున్నాడు.ఈ సినిమా కోసం మేం స్టార్స్‌ని తీసుకోవాలని అనుకోలేదు. శ్రీకృష్ణుడే మాకు సూపర్‌స్టార్' అని చెప్పారు. 'నా జీవితంలో జరిగిన అద్భుతాన్ని ప్రేరణగా తీసుకుని తీస్తున్న ఈ చిత్రంలో నేను నటించడం ఆనందంగా ఉంది' అన్నారు అక్షయ్. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన 'చిరు ప్రాయం' అనే చివరి పాట ఈ సినిమాలోదే కావడం విశేషం.

రెండో వారంలో అక్కడ రిలీజ్



లక్ష్మీరాయ్ పోలీస్ అధికారిగా నటించిన ' ఝాన్సీ ఐపీఎస్' చిత్రాన్ని ఈ నెల రెండో వారంలో ఆంధ్రా, సీడెడ్ ప్రాంతాల్లో విడుదల చేస్తున్నట్లు నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ చెప్పారు. గురుప్రసాద్ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రాన్ని తెలుగులో అనువదించి మొదట తెలంగాణలో విడుదల చేశామనీ, ప్రేక్షకుల ఆదరణ అద్భుతంగా ఉండడంతో ఇప్పుడు ఆంధ్రా ప్రాంతంలో విడుదల చేస్తున్నామని తెలిపారు. మహిళా ప్రేక్షకుల ఆదరణ బాగుందనీ, ఆంధ్రాలో కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందనీ ఆయన తెలిపారు.

భయపెట్టాలని చూశారు

ఆసీస్ మీడియాపై గవాస్కర్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టులో భారత్ ఘనవిజయాన్ని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ కొనియాడాడు. ఈ టెస్టుకు ముందు అక్కడి మీడియా ఆసీస్ బౌన్సీ పిచ్‌ల గురించి రాస్తూ భారత జట్టును భయభ్రాంతులకు గురి చేయాలని చూసినట్టు ఆరోపించాడు. వారికి ఈ విజయం చెంపపెట్టులాంటిదని తన కాలమ్‌లో పేర్కొన్నాడు. 2007/08లోనూ పేసర్ షాన్ టైట్‌ను జట్టులోకి చేర్చినప్పుడు ఇలాగే కథనాలు రాశారని, కానీ రాహుల్ ద్రవిడ్, సెహ్వాగ్ అతడిని ఆడుకున్నారని గుర్తు చేశాడు.

5 పరుగులు 4 వికెట్లు

సీల్స్ సూపర్ బౌలింగ్

బంగ్లా తొలి ఇన్నింగ్స్ 164



కింగ్‌స్టన్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో విండీస్ పేసర్ జేడన్ సీల్స్ (4/5) అత్యంత కట్టుదిట్టమైన బౌలింగ్‌తో సంచలనం సృష్టించాడు. 15.5 ఓవర్లు వేసిన తను కేవలం ఐదు పరుగులే ఇచ్చి నాలుగు వికెట్లు తీయడం విశేషం. ఇందులో పది మెయిడిన్ ఓవర్లున్నాయి. 1978 తర్వాత టెస్టుల్లో నమోదైన అత్యంత పొదుపైన బౌలింగ్ ఇదే. ఓవరాల్‌గా టెస్టు చరిత్రలో అత్యంత ఎకానమీ బౌలింగ్ భారత్‌కు చెందిన ఆర్‌జీ నాద్‌కర్ణి (32-27-5-0) పేరిట ఉంది. ఇక 122/6 ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన బంగ్లా 164 పరుగులకే కుప్పకూలింది. మెహిదీ హసన్ (36), జైజుల్ (16) ఓ మాదిరిగా రాణించారు. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 146 పరుగులకు ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన బంగ్లా.. కడపటి వార్తలందేసరికి వికెట్ నష్టానికి 18 పరుగులు చేసింది.

కతార్ జీపీ విజేత వెర్‌స్టాపెన్



లుసాలి (కతార్): కతార్ గ్రాండ్ ప్రీ టైటిల్‌ను రెడ్‌బుల్స్ ఎఫ్-1 డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ సొంతం చేసుకొన్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్ రేస్‌లో వెర్‌స్టాపెన్ టాప్‌లో నిలవగా.. ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లీక్లెర్క్ రెండో స్థానం, మెక్‌లారెన్‌కు చెందిన ఆస్కార్ పియాస్త్రి మూడో స్థానం దక్కించుకొన్నారు. ఈ ఏడాది వెర్‌స్టాపెన్‌కు ఇది తొమ్మిదో విజయం.



అశ్విన్.. అవసరమెంత?

రవిచంద్రన్ అశ్విన్.. భారత్ తరఫున టెస్టుల్లో 536 వికెట్లు తీయడంతో పాటు ఎన్నో విజయాల్లో పాలు పంచుకున్న అనుభవం అతడిది. ఆఫ్ స్పిన్నర్‌గానే కాకుండా టెయిలెండర్‌లో బ్యాటింగ్‌కు దిగి విలువైన పరుగులతో ఆకట్టుకున్న నేపథ్యం. కానీ ప్రస్తుతం ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో మాత్రం అతడు జట్టు ప్రణాళికల్లో ఉండడం లేదు. ఎందుకంటే ఇటీవలి ఫామ్‌తో పాటు అక్కడి పరిస్థితులు, జట్టు వ్యూహాల కారణంగా టీమ్ మేనేజ్‌మెంట్ 38 ఏళ్ల అశ్విన్‌కన్నా వాషింగ్టన్ సుందర్ వైపు మొగ్గు చూపుతోంది. మరోవైపు పాత రికార్డులను కాకుండా కోచ్ గంబీర్ తమ ఆటగాళ్ల ప్రస్తుత ఫామ్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నాడు. అందుకే న్యూజిలాండ్‌తో సిరీస్‌లో విశేషంగా రాణించిన సుందర్‌ను వెంటనే ఆసీస్‌తో తొలి టెస్టుకు ఎంపిక చేశారు. ఈనెల 6 నుంచి అడిలైడ్‌లో జరిగే గులాబీ టెస్టుకు కూడా ఇదే బౌలింగ్ కూర్పుతో వెళ్లే అవకాశం ఉంది.

పేలవ ఫామ్‌తో ఇబ్బంది

ఆస్ట్రేలియాలో అశ్విన్ ఉత్తమ బౌలింగ్ (4/55) ప్రదర్శన 2021 అడిలైడ్ టెస్టులోనే వచ్చింది. 'సెనా' జట్లుగా పేర్కొనే దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలపైనా అతడికిదే బెస్ట్ కావడం గమనార్హం. ఇక తాజా సిరీస్‌కు ముందు కివీస్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో అశ్విన్ తీసింది తొమ్మిది వికెట్లే. ఇందులో రెండు టెస్టులు పూర్తిగా స్పిన్‌కు అనుకూలించినా ప్రభావం చూపలేకపోయాడు. అదీగాకుండా.. ఇప్పటివరకు 'సెనా' జట్లపై ఒక్కసారి కూడా ఐదు వికెట్లు తీయలేకపోవడం మైనస్‌గా మారింది. మొత్తంగా 43 మ్యాచ్‌ల్లో 71 వికెట్లు తీశాడు. అందుకే అతడికి మిగతా నాలుగు టెస్టుల్లో చాన్స్ లభించడం కష్టమే. అటు జడేజా మాత్రం ఒకసారి ఐదు వికెట్ల ఫీట్ సాధించగలిగాడు. అలాగే ఈ జట్లపై ఐదు హాఫ్ సెంచరీలు, ఓ సెంచరీ కారణంగా ఇప్పటివరకు టీమిండియా అశ్విన్‌కన్నా జడేజా వైపు మొగ్గుచూపింది. అయితే గత పదేళ్ల కాలంలో 'సెనా' జట్లపై ఒక్కసారి మాత్రమే వీరి నుంచి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ఫీట్ నమోదు కావడం ఆందోళన పరిచే విషయం. బ్యాటింగ్ విషయానికి వస్తే ఈ ఇద్దరికన్నా సుందర్ టెక్నికల్‌గానూ అదరగొడుతున్నాడు. కివీస్‌పైనే కాకుండా పెర్త్ టెస్టులో, వామప్ మ్యాచ్‌లోనూ మెరుగ్గా ఆడాడు. అదీగాకుండా అశ్విన్, పాతికేళ్ల సుందర్ మధ్య వయస్సు అంతరం కూడా ప్రభావం చూపుతోంది. ఇలాంటి పరిస్థితిల్లో అశ్విన్, జడేజాలకు తుది జట్టులో చోటెక్కడ? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఒకవేళ సుందర్‌కు గాయమైనా వికెట్ స్పందనను బట్టి నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది. ఇద్దరు స్పిన్నర్లు అవసరమనుకున్నా సుందర్‌కు జతగా జడేజాతో వెళ్తారనడంలో సందేహం లేదు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

యువ వ్యాపారవేత్తతో సింధు వివాహం

22న ఉదయ్‌పూర్‌లో పెళ్లి





హైదరాబాద్: స్టార్ షట్లర్ పీవీ సింధు (29) త్వరలో పెళ్లిపీటలెక్కనుంది. ఈ నెల 22న యువ వ్యాపారవేత్త గౌరవెల్లి వెంకట దత్త సాయితో ఆమె వివాహం జరగనుంది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో పెళ్లి జరగనుండగా.. 24న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ నెల 20 నుంచి పెళ్లి కార్యక్రమాలు మొదలవుతాయని కుటుంబ వర్గాలు తెలిపాయి. బెంగళూరు ట్రిపుల్ ఐటీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన దత్త.. హైదరాబాద్‌కు చెందిన పోసిడెక్స్ టెక్నాలజీస్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. అతడి తండ్రి జీటీ వెంటేశ్వరరావు అదే కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సింధు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తోంది. గత ఏడాది కాలంగా సింధు, సాయి మధ్య పరిచయం ఉందని, గత నెలలోనే వీరి పెళ్లికి సంబంధించి ఓ నిర్ణయానికి వచ్చామని సింధు తండ్రి పీవీ రమణ తెలిపాడు. వీరిద్దరూ కొన్ని మ్యాచ్‌లు, సినిమాలకు కలసి హాజరయ్యారు. అయితే, జనవరి నుంచి సింధుకు బిజీ షెడ్యూల్ ఉండడంతో.. ఈనెలలో వివాహం చేయాలని నిర్ణయించుకొన్నట్టు రమణ తెలిపాడు. రెండేళ్లుగా ఫామ్‌లోలేని సింధు గత ఆదివారం సయ్యద్ మోదీ అంతర్జాతీయ టోర్నీలో విజేతగా నిలిచింది. 2013లో వరల్డ్ చాంపియన్‌షిప్ పతకంతో సింధు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత 2019లో ప్రపంచ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకొంది. 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం సాధించిన సింధు.. 2021 టోక్యో క్రీడల్లో కాంస్యం దక్కించుకొంది. ఈ క్రమంలో విశ్వక్రీడల్లో రెండు పతకాలు సాధించిన తొలి భారత ప్లేయర్‌గా రికార్డు సృష్టించింది. 2017లో వరల్డ్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి రెండో ర్యాంక్‌కు చేరుకొంది. 2028 ఒలింపిక్స్ వరకు కెరీర్‌లో కొనసాగాలని సింధు భావిస్తోంది.

అమన్ మెరుపు శతకం

జపాన్‌పై యువ భారత్ ఘన విజయం

అండర్-19 ఆసియా కప్



షార్జా: కెప్టెన్ అమన్ (118 బంతుల్లో ఏడు ఫోర్లతో 122 నాటౌట్) మెరుపు శతకంతో చెలరేగగా, కార్తికేయ (57), ఆయుష్ (54) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకోవడంతో అండర్-19 ఆసియా కప్‌లో భారత్ తొలి విజయం అందుకుంది. గ్రూప్ 'ఎ' మొదటి మ్యాచ్‌లో పాకిస్థాన్ చేతిలో ఓడిన భారత్..సోమవారం 211 పరుగులతో జపాన్‌ను చిత్తు చేసింది. మొదట భారత్ 50 ఓవర్లలో 339/6తో భారీ స్కోరు సాధించింది. సిద్దార్థ్ (35), హార్దిక్ రాజ్ (25 నాటౌట్), వైభవ్ సూర్యవంశీ (23) ఉపయుక్త ఇన్నింగ్స్ ఆడారు. ఛేదనలో జపాన్ 50 ఓవర్లలో 128/8 స్కోరుకే పరిమితమై ఓడింది. హ్యూగో కెల్లి (50), చార్లెస్ (35 నాటౌట్) మాత్రమే రాణించారు. హార్దిక్, చేతన్ శర్మ, కార్తికేయ తలా రెండు వికెట్లు తీశారు.

కేకేఆర్ కెప్టెన్ రహానె?



కోల్‌కతా: కోల్‌కతా నైట్‌రైడర్స్ కొత్త కెప్టెన్‌గా వెటరన్ ఆటగాడు అజింక్యా రహానె నియామకం దాదాపు ఖరారైనట్టు తెలిసింది. ఇటీవలి మెగా వేలంలో రహానెను రూ. 1.5 కోట్ల ఆరంభ ధరతో కోల్‌కతా కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. వేలంలో రూ. 23.75 కోట్ల కళ్లు చెదిరే మొత్తంతో ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్‌ను కోల్‌కతా దక్కించుకోవడంతో అతడికే సారథ్య బాధ్యతలు అప్పగిస్తారని వార్తలొచ్చాయి. కానీ సీనియర్ రహానెను కెప్టెన్‌గా నియమించాలని కోల్‌కతా ఫ్రాంచైజీ యాజమాన్యం నిర్ణయించినట్టు సమాచారం. అందుకే వేలంలో అతడిని కొనుగోలు చేసినట్టు భావిస్తున్నారు. వెంకటేశ్‌ను వైస్-కెప్టెన్ చేయనున్నట్టు తెలిసింది.

చాంపియన్స్ ట్రోఫీపై మళ్లీ పీటముడి!

పాకిస్థాన్ షరతుకు బీసీసీఐ నో?



న్యూఢిల్లీ: హైబ్రిడ్ విధానానికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అంగీకరించిన నేపథ్యంలో చాంపియన్స్ ట్రోఫీపై ఏర్పడిన ప్రతిష్ఠంభన తొలగిపోయినట్టేనని భావించారు. కానీ తాజా పరిణామాలను గమనిస్తే టోర్నీపై మళ్లీ నీలినీడలు కమ్ముకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. చాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ పద్ధతిలో జరిపేందుకు పీసీబీ అంగీకరించిన విషయం తెలిసిందే. అదే సమయంలో ఓ మెలిక కూడా పెట్టింది. అదేంటంటే..భవిష్యత్‌లో భారత్ ఆతిథ్యమిచ్చే ఐసీసీ టోర్నమెంట్లకు పాకిస్థాన్ హాజరుకాకపోతే..ఆ జట్టు ఆడే మ్యాచ్‌లనూ తటస్థ వేదికల్లో నిర్వహించడం. ఈమేరకు ఐసీసీ తమకు రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని పీసీబీ పట్టుపడుతోంది. అప్పుడే చాంపియన్స్ ట్రోఫీ హైబ్రిడ్ విధానానికి అంగీకరిస్తామని పీసీబీ స్పష్టంజేసింది. మొత్తంగా.. వచ్చే ఏడాది జరిగే చాంపియన్స్ ట్రోఫీకి మార్గం సుగమమైనట్టు భావించారు. అయితే పీసీబీ డిమాండ్‌కు బీసీసీఐ ససేమిరా అంటున్నట్టు విశ్వసనీయ సమాచారం. పాకిస్థాన్ డిమాండ్‌కు తలొగ్గితే..భారత్‌లో జరిగే పాకిస్థాన్ మ్యాచ్‌లను ఇతర వేదికలకు తరలించాల్సి వస్తుంది. ఇది బీసీసీఐకి ఆందోళన కలిగిస్తోందట! ఐసీసీ కొత్త చైర్మన్‌గా భారత్‌కు చెందిన జై షా బాధ్యతలు చేపట్టాడు. మరి..పీసీబీ డిమాండ్‌కు అతడు తలొగ్గుతాడా? ఒకవేళ పాకిస్థాన్‌ను షరతుకు అంగీకరించకపోతే చాంపియన్స్ ట్రోఫీ జరగడం కష్టమే!

ఆగని రూపాయి పతనం



- సరికొత్త రికార్డు కనిష్ఠానికి డాలర్-రూపీ మారకం విలువ
- మరో 12 పైసల క్షీణత..
- 84.72కి చేరిక

భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 12 పైసలు క్షీణించి 84.72 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటంతో పాటు దేశీయంగా జీడీపీ, మాన్యుఫాక్చరింగ్ రంగాల పనితీరు గణాంకాలు నిరాశపర్చడం మన రూపాయికి గండి కొట్టాయి. అమెరికా డాలర్‌ను బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తే, బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌతాఫ్రికా) దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడంతో రూపాయితో పాటు ఆసియా కరెన్సీలన్నీ బలహీనపడ్డాయని ఫారెక్స్ వర్గాలు వెల్లడించాయి. గత శుక్రవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించింది. మున్ముందు డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు 84.50-84.95 శ్రేణిలో కదలాడవచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అన్నారు.

ఆరంభ నష్టాల్లోంచి లాభాల్లోకి..

సెన్సెక్స్ 445 పాయింట్లు అప్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం ట్రేడింగ్‌లో ఆరంభ నష్టాల నుంచి తేరుకుని లాభాల్లో పయనించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్లతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు ఇందుకు దోహదపడ్డాయి. సెప్టెంబరు త్రైమాసికానికి జీడీపీ రెండేళ్ల కనిష్ఠానికి పడిపోయిన నేపథ్యంలో స్వల్ప నష్టాలతో ట్రేడింగ్ ఆరంభించిన సెన్సెక్స్.. ఒక దశలో దాదాపు 500 పాయింట్ల వరకు కోల్పోయి 79,308.95 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి లాభాల్లోకి మళ్లిన సూచీ ఒక దశలో 535 పాయింట్ల వృద్ధితో 80,337.82 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని రికార్డు చేసింది. రోజంతా 1,030 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సెన్సెక్స్.. చివరికి 445.29 పాయింట్ల లాభంతో 80,248.08 వద్ద స్థిరపడింది. 80,000 స్థాయిని మళ్లీ నిలబెట్టుకోగలిగింది. నిఫ్టీ విషయానికొస్తే, 144.95 పాయింట్ల లాభంతో 24,276.05 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 21 రాణించాయి.

11 నెలల కనిష్ఠానికి తయారీ రంగ వృద్ధి

భారత మాన్యుఫాక్చరింగ్ రంగ వృద్ధి 11 నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) గత నెలలో 56.5కు పడిపోయింది. మార్కెట్లో పోటీతో పాటు ధరలూ పెరగడంతో పరిశ్రమలకు ఆర్డర్లు మందగించాయి. అయితే, సూచీ ఇప్పటికీ వృద్ధి పథంలోనే కొనసాగిందని హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ ప్రంజుల్ భండారీ అన్నారు. పీఎంఐ స్కోర్ 50కి పైన ఉంటే వృద్ధికి, దిగువన నమోదైతే క్షీణతకు సంకేతం.

ఆడి కార్లు మరింత ప్రియం

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జనవరి 1 నుంచి తమ కార్ల ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం ఆడి సోమవారం ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం, రవాణా ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ధరలు పెంచక తప్పట్లేదని కంపెనీ పేర్కొంది. ప్రస్తుతం ఆడి భారత మార్కెట్లో ఏ4, ఏ6, క్యూ3, క్యూ5, క్యూ7 సహా పలు మోడళ్లను విక్రయిస్తోంది. కాగా వచ్చే జనవరి నుంచి కార్ల ధరలు పెంచుతున్నట్లు జర్మనీకి చెందిన బీఎండబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్ ఇప్పటికే ప్రకటించాయి.

ఆయిల్ కంపెనీలకు ఊరట

విండ్‌ఫాల్ ట్యాక్స్ రద్దు

న్యూఢిల్లీ: చమురు కంపెనీలకు పెద్ద ఊరట లభించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఈ కంపెనీల అసాధారణ లాభాలపై విధిస్తున్న విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. దీనికి సంబంధించిన బిల్లును కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దేశీయంగా ఉత్పత్తి చేసే ముడి చమురు, దేశం నుంచి ఎగుమతి చేసే విమాన ఇంధనం (ఏటీఎఫ్), పెట్రోల్, డీజిల్‌పై గత 30 నెలలుగా ప్రభుత్వం స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ (ఎస్‌ఏఈడీ) పేరుతో ఈ ట్యాక్స్ విధిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు దిగి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ, ప్రైవేట్ రంగంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ బాగా లబ్ధి పొందనున్నాయి. దీంతో పాటు పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ (ఆర్‌ఐసీ) పేరుతో విధిస్తున్న సెస్‌ను కూడా ప్రభుత్వం రద్దు చేసింది.

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి

పెరగనున్న పన్ను వసూళ్లు

2024-25లో రూ.1.21 లక్షల కోట్ల లక్ష్యం

ఇప్పటికే రూ.59,000 కోట్ల వసూళ్లు

ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మధుస్మిత



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఆదాయ పన్ను (ఐటీ) వసూళ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తెలుగు రాష్ట్రాల నుంచి రూ.1.21 లక్షల కోట్ల ఆదాయ పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ (ఏపీ అండ్ తెలంగాణ) మితాలి మధుస్మిత తెలిపారు. వివాదాల్లో ఉన్న పన్ను బకాయిల వసూలు కోసం ఐటీ శాఖ ప్రారంభించిన 'వివాద్ సే విశ్వాస్ 2.0' పథకంపై తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఎఫ్‌టీసీసీ) ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ విషయం వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో వసూలైన మొత్తంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏపీ, తెలంగాణ నుంచి ఆదాయ పన్ను వసూళ్లు 15 శాతం ఎక్కువగా ఉంటాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. అయితే గత ఆర్థిక సంవత్సరం నమోదైన 22 శాతం వృద్ధి రేటుతో పోలిస్తే ఇది తక్కువే. తెలంగాణలో వసూళ్లు బాగున్నా, ఏపీలో పన్ను వసూళ్ల వృద్ధి రేటు తగ్గడం ఇందుకు ప్రధాన కారణమని మధుస్మిత తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి లక్ష్యంగా నిర్ణయించిన రూ.1.21 లక్షల కోట్లలో ఇప్పటికే రూ.59,000 కోట్లు వసూలు చేసినట్టు వెల్లడించారు. మిగతా మొత్తం వసూళ్లలో పెద్ద సమస్యలేమీ ఉండకపోవచ్చన్నారు. ఏపీ, తెలంగాణ నుంచి దాదాపు రూ.2 లక్షల కోట్ల పన్ను బకాయిల వసూళ్లు వివాదాల్లో ఉన్నట్టు ఆమె వెల్లడించారు. వివాద్ సే విశ్వాస్ పథకం ద్వారా పన్ను చెల్లింపుదారులు ఈ వివాదాలు పరిష్కరించుకోవాలని సూచించారు.

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కార్

రూ.65-70 లక్షల స్థాయిలో ధర



న్యూఢిల్లీ: జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా కూడా లగ్జరీ కార్ల విభాగంలోకి ప్రవేశించబోతోంది. సైబర్‌స్టర్ పేరుతో ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారును వచ్చే ఏడాది జనవరిలో మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు సంస్థ తెలిపింది. దీని ధర రూ.65-70 లక్షల స్థాయిలో ఉండే అవకాశం ఉంది. అలాగే, లగ్జరీ కార్ల విక్రయాల కోసం ఎంజీ సెలెక్ట్ పేరుతో కొత్త రిటైల్ చానల్‌ను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపింది. వచ్చే రెండేళ్లలో కంపెనీ 4 లగ్జరీ మోడళ్లను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది.

స్కోడా కైలాక్ బుకింగ్స్ షురూ

ప్రారంభ ధర రూ.7.89 లక్షలు



న్యూఢిల్లీ: చెక్ రిపబ్లిక్ ఆటోమొబైల్ కంపెనీ స్కోడా తన తొలి సబ్ కాంపాక్ట్ ఎస్‌యూవీ మోడల్ కైలాక్ బుకింగ్స్‌ను సోమవారం నుంచి ప్రారంభించింది. కారు డెలివరీ వచ్చే ఏడాది జనవరి 27 నుంచి ప్రారంభం కానుంది. మొత్తం ఏడు రంగులు, ఏడు వేరియంట్లలో లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.7.89 లక్షలు కాగా.. గరిష్ఠ రేటు రూ.14.4 లక్షలుగా ఉంది. మారుతి బ్రెజ్జా, హ్యుండయ్ వెన్యూ, మహీంద్రా ఎక్స్‌యూవీ 300, టాటా నెగ్జాన్, కియా సోనెట్‌కు పోటీగా స్కోడా ఈ కారును అందుబాటులోకి తెస్తోంది.

ఫోన్ పే నుంచి డెంగ్యూ, మలేరియా బీమా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఫోన్ పే నుంచి డెంగ్యూ, మలేరియా బీమా అందుబాటులోకి వచ్చింది. ఏడాదికి కేవలం రూ.59 ప్రీమియంతోనే దీన్ని ప్రవేశపెట్టినట్టు ఫోన్ పే ప్రకటించింది. దోమలు, ఇతర క్రిమి కీటకాల (పరాన్నభుక్కుల) ద్వారా వ్యాపించే రోగాలకు తీసుకునే చికిత్సకు ఇది రూ.లక్ష వరకు ఏడాది పొడవునా బీమా రక్షణ కల్పిస్తుంది. అంటే బీమా కవరేజీ రుతుపవనాల కాలానికి మాత్రమే పరిమితం కాదు. ఫోన్ పే కస్టమర్లకు మాత్రమే అందుబాటులో ఉండే ఈ ప్లాన్ ఆస్పత్రి ఖర్చులు, డయాగ్నోస్టిక్ ఖర్చులు, ఐసీయూ చికిత్స వంటి అన్నింటికీ కవరేజీ కల్పిస్తుంది. ఫోన్ పే యాప్ ద్వారా ఈ పాలసీని కొనుగోలు చేయవచ్చు. పూర్తిగా డిజిటల్ విధానంలోనే క్లెయిమ్ సెటిల్మెంట్ ఉంటుంది. కార్పొరేట్ ఆరోగ్య బీమా కలిగిన వారు కూడా దీన్ని కొనుగోలు చేయవచ్చునని ఫోన్ పే ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సర్వీసెస్ సీఈఓ విశాల్ గుప్తా అన్నారు.

రిలయన్స్ బిగ్ ఆస్తుల జప్తు : సెబీ

న్యూఢిల్లీ : అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు సెబీ మరోసారి షాకిచ్చింది. ఈ సంస్థకు చెందిన బ్యాంకు, డీమ్యాట్, మ్యూచువల్ ఫండ్ ఖాతాలు జప్తు చేయాలని ఆదేశించింది. గత నెల 14న విధించిన రూ.26 కోట్ల జరిమానాను కంపెనీ నిర్దీత 15 రోజుల్లో చెల్లించకపోవడంతో సెబీ ఈ చర్య తీసుకుంది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ నిధుల దారి మళ్లింపులో రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు పాత్ర ఉండడంతో సెబీ ఈ చర్య తీసుకుంది. దీనికి సంబంధించి సెబీ ఇప్పటికే కంపెనీ ప్రధాన ప్రమోటర్ అనిల్ అంబానీపైనా రూ.25 కోట్ల జరిమానా, ఐదేళ్ల పాటు క్యాపిటల్ మార్కెట్ నుంచి బహిష్కరించింది.

బిజినెస్

ట్రంప్ హెచ్చరికలో పస లేదు

- డాలర్ ఆధిపత్యం ఏ మాత్రం తగ్గదు
- బ్రిక్స్ ఉమ్మడి కరెన్సీతో చైనాకే మేలు
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



హైదరాబాద్: బ్రిక్స్ దేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని తీసుకొస్తే ఆ దేశాల దిగుమతులపై 100 శాతం సుంకాలు తప్పవన్న డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ హెచ్చరికలో స్పష్టత లేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. అమెరికా చట్టాలు అందుకు అనుమతిస్తాయా? లేదా? అనే విషయాన్నీ పరిశీలించాల్సి ఉందన్నారు. డాలర్ ఆధిపత్యాన్ని అడ్డుకునేందుకు బ్రిక్స్ దేశాలు ఒకే ఉమ్మడి కరెన్సీని తీసుకు వచ్చే అవకాశాలపైనా ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ దేశాల ఆర్థిక, రాజకీయ పరిస్థితులూ ఇందుకు అనుమతించే అవకాశం లేదన్నారు. ట్రంప్‌ను మాటల మనిషిగా చూడాలే తప్ప, చేతల మనిషిగా చూడలేమని సుబ్బారావు స్పష్టం చేశారు.

బ్రిక్స్ ఉమ్మడి కరెన్సీ కోసం భారత్ వంటి దేశాలు తమ ద్రవ్య విధానాలు, స్వయం ప్రతిపత్తి వదులుకుని బ్రిక్స్‌లోని ఇతర దేశాల్లో ఏర్పడే ఆటుపోట్లకు సిద్ధమవుతాయా? అనే విషయాన్నీ ఆలోచించాల్సి ఉందన్నారు. ఒకవేళ అదే జరిగితే బ్రిక్స్ దేశాలపై చైనా ఆధిపత్యం పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,350 ▼	70,090 ▼	99,500 ▼
ముంబై	76,308 ▼	69,898 ▼	88,611 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	615	విజయవాడ	620
వరంగల్	617	గోదావరి	615
చిత్తూరు	633	విశాఖపట్నం	605
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	85	విజయవాడ	104
వరంగల్	85	గుంటూరు	99
కరీంనగర్	85	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	85	చిత్తూరు	92
కర్నూలు	85	నెల్లూరు	92
విశాఖపట్నం	100	అనంతపురం	92
గోదావరి	104		

కుమారులకు ఆస్తి పంపకంలో వివాదం..
ఖమ్మం వ్యాపార వేత్త ఆత్మహత్య


సత్యంబాబు(ఫైల్)

ఖమ్మం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు కుమారులకు ఆస్తి పంపకానికి సంబంధించిన వివాదంలో ఖమ్మం నగరానికి చెందిన వ్యాపారవేత్త చేకూరి సత్యంబాబు(79) ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోమవారం తెల్లవారుజామున తన నివాసంలోనే విషం తీసుకొని చనిపోయారు. చనిపోయే ముందు సూసైడ్ నోట్ రాశారు. ఐదుగురి కారణంగా తాను చనిపోతున్నట్లు అందులో పేర్కొన్నారు. "మీరు ఐదుగురంటే ప్రాణం. మీకు ఏదైనా జరిగితే నేను బతకలేను. నేను చనిపోతేనే మీరు బతుకుతారని ఆలోచించి చనిపోవడానికి నిర్ణయం తీసుకున్నాను" అని అందులో రాశారు. తన చిన్న కుమారుడు శేఖర్, అతని భార్య సుజాతను తన మృతదేహం వద్దకు, అంత్యక్రియలకు రానివ్వవద్దని కూడా లేఖలో పేర్కొన్నారు. సత్యంబాబుకు ఖమ్మం జిల్లాలో కోల్డ్ స్టోరేజీలు, జిన్నింగ్ మిల్లు ఉన్నాయి. చిట్‌ఫండ్స్ కూడా నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య నాగేంద్రమ్మ, కుమారులు శ్రీధర్, శేఖర్ ఉన్నారు. కొద్ది కాలంగా చిన్న కుమారుడు శేఖర్‌తో ఆస్తికి సంబంధించిన వివాదం నడుస్తోంది. పలుమార్లు పంచాయితీలు జరిగాయి. మరోవైపు, శ్రీధర్ తనకు అప్పు ఉన్నాడంటూ ఓ మహిళతో పాటు మరికొందరు గత శుక్రవారం అతని ఇంటివద్ద ఆందోళనకు దిగారు. దీంతో శనివారం, సత్యంబాబుతో పాటు శ్రీధర్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించినట్టు తెలిసింది. మనోవేదనకు లోనైన సత్యంబాబు సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడ్డారు. సత్యంబాబు ఆత్మహత్య చేసుకున్న గదిలో కుటుంబ సభ్యుల పేర్లతో రాసిన ఆరుపేజీల సూసైడ్ నోట్ ఖమ్మం పోలీస్ కమిషనర్‌కు లభించింది. తనకు ఎక్కువ ఆస్తి కావాలని శేఖర్ పేచీ పెడుతున్నాడని, శేఖర్ అతడి భార్య సుజాత, బావమరిది గంగాధర్ కలిసి.. శ్రీధర్‌తో పాటు ఆరుగురు కుటుంబ సభ్యులను చంపడానికి ప్రయత్నించారని ఆ లేఖలో ఉంది. తాము అప్పు ఉన్న డాక్టర్ మహేంద్ర, పరుచూరి క్రిష్ణమోహన్‌లతో కలిసి తమ పరువుతీశారని సూసైడ్ నోట్‌లో సత్యంబాబు ఆరోపించారు.

ప్రాణాలు పోయినా మా భూములివ్వం

» చౌటుప్పల్‌లో ఆర్‌ఆర్‌ఆర్ భూనిర్వాసితుల ధర్నా

చౌటుప్పల్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణానికి ప్రాణాలు పోయినా భూములు ఇవ్వబోమని నిర్వాసితులు స్పష్టం చేశారు. ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. చౌటుప్పల్, తంగడపల్లి, తాళ్ల సింగారం, నేలపట్ల, మందోళ్లగూడెం గ్రామాలకు చెందిన నిర్వాసితులు పాల్గొన్నారు. ఆర్డీవో వచ్చే వరకు ధర్నాను విరమించేది లేదని రెండు గంటల పాటు నిర్వాసితులు బైఠాయించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కొందరు కార్యాలయం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ మన్మథకుమార్ నిర్వాసితులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

విషప్రయోగం ఆరోపణలు అవాస్తవం:డీజీపీ

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో విషప్రయోగం జరిగినట్లు పౌరహక్కుల సంఘం చేస్తున్న ఆరోపణలను డీజీపీ జితేందర్ ఖండించారు. హక్కుల సంఘం ఆరోపణలు అవాస్తవమని, ఇది పూర్తిగా దుష్ప్రచారమని పేర్కొన్నారు. ఎదురుకాల్పులకు కొద్ది రోజుల ముందు ఇన్‌ఫార్మర్ల నెపంతో ఆదివాసీలు ఉయిక రమేష్, ఉయిక అర్జున్‌ను మావోయిస్టులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారన్నారు. ఆ తరహా ఘటనల్ని అడ్డుకునేందుకు పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులపై మావోయిస్టులు కాల్పులు జరిపారని డీజీపీ వివరించారు. మావోయిస్టులు అత్యాధునిక ఆయుధాలు ఉపయోగించి పోలీసులపై కాల్పులు జరిపారని, పోలీసుల ఎదురుకాల్పుల్లో ఏడుగురు సాయుధ మావోయిస్టులు మరణించారని తెలిపారు.

కస్టడీకి 'లగచర్ల' నిందితుడు సురేశ్ రాజ్

వికారాబాద్, కొడంగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో కీలక పాత్రధారి, ఏ-2 నిందితుడు భోగమోని సురేశ్‌రాజ్‌ను పోలీస్ కస్టడీకి కొడంగల్ కోర్టు అనుమతి ఇచ్చింది. రెండు రోజుల పాటు కస్టడీకి అనుమతివ్వడంతో మంగళ, బుధవారాల్లో నిందితుడ్ని పోలీసులు విచారించనున్నారు. కాగా, చర్లపల్లి జైలులో రిమాండ్‌లో ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి బెయిల్, కస్టడీ పిటిషన్లు గురువారానికి వాయిదా పడ్డాయి. లగచర్లలో అధికారులపై దాడికి పాల్పడిన ఘటనలో మరో నలుగురు నిందితులు సోమవారం కొడంగల్ మున్సిఫ్ కోర్టులో లొంగిపోయారు. న్యాయవాది ముందు లొంగిపోయిన వారిలో రాంచందర్, ఎస్.హన్మంతు, లోకేశ్ నాయక్, కుమ్మరి శివకుమార్ ఉన్నారు. వీరికి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌ను విధించింది.

12లక్షల ఇంజనీర్లకు 20శాతమే ఉపాధి!

నూతన ఆవిష్కరణలతోనే అవకాశాలు: వీసీ ఎం. కుమార్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఏడాదికి 12 లక్షల ఇంజనీర్లను విద్యాసంస్థలు ఉత్పత్తి చేస్తున్నప్పటికీ.. సుస్థిర నైపుణ్యం, అవగాహన కలిగిన 20 శాతం మందికి మాత్రమే ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ తెలిపారు. విద్యాసంస్థలు, పరిశ్రమల అనుసంధానంతో నూతన ఆవిష్కరణలతో పాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయని తెలిపారు. సమాజ అవసరాలకు అనుగుణంగా సాంకేతికత అభివృద్ధి చెందినప్పుడే పరిశోధనల లక్ష్యం నెరవేరుతుందని వివరించారు. శనివారం ఓయూ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ సెమి కండక్టర్ ఐసి డిజైన్ ఇన్ ఇండియన్ పర్స్పెక్టివ్' అనే అంశంపై జరిగిన సదస్సుకు కుమార్ హాజరై ప్రసంగించారు. ఈసీఈ చదివేవారికి చిప్ డిజైన్, సెమీ కండక్టర్ రంగంలో అద్భుతమైన ఉపాధి అవకాశాలున్నాయన్న ఆయన.. ప్రస్తుతం 3 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశముందని చెప్పారు. ఎన్ఐఎన్ శాస్త్రవేత్త డాక్టర్ భానుప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశంగా కాకుండా త్వరలోనే అభివృద్ధి చెందిన భారత్‌ను సాకారం చేసుకునేందుకు పరిశోధకులకు కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల్లో వస్తున్న నూతన ఆవిష్కరణలను వాణిజ్య మార్కెట్‌కు అందించాలని ఈసీఐఎల్ శాస్త్రవేత్త డాక్టర్ అనీష్ కుమార్ శర్మ అభిప్రాయపడ్డారు.

గిరిజన విశ్వవిద్యాలయానికి 890 కోట్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ములుగులో సమ్మక్క సారక్క గిరిజన విశ్వవిద్యాలయాన్ని రూ.890 కోట్లతో నిర్మిస్తున్నట్లు కేంద్రం విద్యా శాఖ సహాయ మంత్రి సుఖాంత మజుందార్ తెలిపారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ బలరాం నాయక్ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణలో ఐఐఎం ఏర్పాటు గురించి సోమవారం లిఖితపూర్వకంగా ప్రశ్నించగా కేంద్రమంత్రి సమాధానాన్ని దాట వేస్తూ.. తెలంగాణలో ఐఐటీ, ఇఫ్లూ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్నాయని చెప్పారు.

ఖమ్మంలో సీపీఐ వందేళ్ల ముగింపు ఉత్సవాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) వందేళ్ల ముగింపు ఉత్సవాలను ఖమ్మంలో నిర్వహించాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా వచ్చే ఏడాది డిసెంబరు 26న ఖమ్మంలో భారీ ర్యాలీ, సమావేశాలను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు సోమవారం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా నవంబరులో జరిగిన పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో తీసుకున్న తీర్మానాలను వెల్లడించారు. సీపీఐ ఆవిర్భావ వందేళ్ల ఉత్సవాలకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఉత్సవాలను యూపీలోని కాన్పూర్‌లో ఈ నెల 26 ప్రారంభించనున్నట్లు చెప్పారు.

సమ్మె బాటలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు

- రెగ్యులరైజ్, కనీస వేతనాల కోసం డిమాండ్
- విద్యా శాఖ అధికారులకు సమ్మె నోటీసులు
- ప్రభుత్వం స్పందించకుంటే 5 నుంచి సమ్మెలోకి
- రాష్ట్రంలో 19,360 మంది ఉద్యోగులు విధుల్లో


డిమాండ్లను పరిష్కరించాలని ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు (ఫైల్)

ఆసిఫాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. తమను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం కల్పించాలని, ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ. 10 లక్షలు, ఆరోగ్య బీమా సౌకర్యం రూ.5 లక్షలు కల్పించాలని, పదవీ విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ కింద రూ.20 లక్షలు ఇవ్వాలనే డిమాండ్ల సాధనకు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల డీఈవోలకు ఇప్పటికే సమ్మె నోటీసులు అందజేశారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే ఈ నెల 5 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగాలని కూడా ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిర్ణయించుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలో అన్ని జిల్లాల్లోని మండలాల్లో సీఆర్పీ, పీటీఐ, మెసెంజర్, ఐఈఆర్పీ, సీపీవో తదితర పోస్టుల్లో మొత్తం 19,360 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో 456 మంది పని చేస్తున్నారు. సీఆర్పీ, ఏఎంఐఎస్‌లకు నెలకు రూ.19,950, సీసీవోలకు రూ.18,200, పీటీఐలకు రూ.11,700, మెసెంజర్లకు రూ.11,000, ఐఈఆర్పీలకు, డీఈవో కార్యాలయ సిబ్బందికి రూ.19,350, కేజీబీవీల్లో పనిచేస్తున్న వారికి కేడర్‌ను బట్టి రూ.7వేల నుంచి రూ. 25వేల వరకు వేతనాలు ఉన్నాయి. ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తుండగా పనికి తగిన వేతనం, ఉద్యోగ భద్రత లేక ఆందోళన చెందుతున్నారు. అటెండర్ స్థాయి సిబ్బందికి రూ.21వేల వేతనం, సీఆర్పీ, డాటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.29వేలు, ఎంఐఎస్‌లకు రూ.32వేలు, కేజీబీవీ ఎస్‌వోలకు రూ.42వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. డిమాండ్ల సాధనకు గతేడాది ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో 25 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా సమస్యలు పరిష్కారం కాలేదని ఎస్ఎస్ఏ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే సమ్మెకు వెళ్తాం



ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేయాలని, మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలని గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 25రోజులపాటు రిలే నిరాహార దీక్షలు చేశాం. సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నేరవేర్చాలి. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే సమ్మెకు వెళ్తాం.

- గెడెకర్ సంతోష్, ఎస్ఎస్ఏ జేఏసీ జిల్లా నాయకుడు, ఆసిఫాబాద్

మిషన్.. ఉత్తర తెలంగాణ!

బీఆర్ఎస్, బీజేపీ బలంగా ఉన్న నార్త్‌పై కాంగ్రెస్ నజర్.. పదేళ్లలో బీఆర్ఎస్ సర్కారు చేయలేని పనులపై ఫోకస్

- బీఆర్ఎస్, బీజేపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా వ్యూహాలు
- కాంగ్రెస్ ఎత్తుగడలతో అప్రమత్తమైన గులాబీ, కమల దళాలు



వరంగల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉత్తర తెలంగాణ ప్రాంతంలో నాలుగు విమానాశ్రయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు.. ప్రసాద్ స్కీంలో ప్రముఖ ఆలయాలకు చోటు. కొత్తగా రైల్వేలైన్లు.. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, డివిజన్ హోదా. రెండో రాజధానిగా వరంగల్ అభివృద్ధిపై కసరత్తు. సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన తరువాత లగచర్ల ఘటనకు నిరసనగా మానుకోటలో కేటీఆర్ ధర్నా. ఇలా.. ఒకదాని వెనక ఒకటిగా పరిణామాలు ఉత్తర తెలంగాణలో చోటుచేసుకుంటున్నాయి. అధికార కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ కూడా ఈ ప్రాంతంపై ఎక్కువగా ఫోకస్ చేసి.. కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. దీంతో ఉత్తర తెలంగాణను అన్ని పార్టీలూ లక్ష్యంగా చేసుకోవడం వెనుక భవిష్యత్తు రాజకీయ వ్యూహాలున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో బీజేపీ ఆధిపత్యం ప్రదర్శించిన విషయం తెలిసిందే. మరోవైపు వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో బీఆర్ఎస్ గట్టిపోటీ ఇచ్చింది. లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ స్థానాలను గెలుచుకున్న బీజేపీ.. వరంగల్, పెద్దపల్లి ఎంపీ స్థానాల్లో రెండో స్థానంలో నిలిచింది. ఖమ్మం, నల్లగొండలో కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో ఓట్లు తెచ్చుకుంది. కానీ, ఈ ప్రాంతంలో బీఆర్ఎస్‌కున్నంత బలమైన నేతలు బీజేపీకి లేరు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు అవకాశం చిక్కితే ఉత్తర తెలంగాణలో తిరిగి బలపడే అవకాశం ఉంది. దీంతో బీఆర్ఎస్ పాలనలోని వైఫల్యాలను ఎత్తిచూపుతూ అభివృద్ధి అస్త్రంతో బలపడేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.

వరంగల్‌పై ఫోకస్..

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. రూ.6 వేల కోట్లతో వరంగల్ అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేసింది. వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి రూ.4,170 కోట్లను రేవంత్‌రెడ్డి సర్కారు కేటాయించింది. ఇక మామునూరు విమానాశ్రయాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు ప్రాథమికంగా రూ.205 కోట్లు కేటాయించింది. మామునూరుతో పాటు కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయటంతో పాటు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రాణహిత- చేవేళ్ల ప్రాజెక్టుకు మళ్లీ జీవం పోసేందుకు కసరత్తు చేస్తోంది. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఇటీవలే ఆ శాఖ మంత్రి స్వయంగా గోదావరి వద్ద పర్యటించి 2026లో పూర్తి చేస్తామని ప్రకటించారు. అందుకు కావాల్సిన నిధులు కూడా విడుదల చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలోని చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు కూడా భారీగా నిధులు కేటాయింపులు చేస్తున్నారు.

కమలం పట్టు పెంచుకునే యత్నాలు..

బీజేపీ సైతం ఉత్తర తెలంగాణపై పట్టు బిగించే ప్రయత్నం చేస్తోంది. కాజీపేట రైల్వే జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా మార్చేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. ఇక్కడ కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అలాగే పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి భూపాలపల్లి, రామప్ప, మేడారం మీదుగా మణుగూరు వరకు సుమారు రూ.4,100కోట్ల అంచనా వ్యయంతో 207కి.మీ. రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్ నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వరకు 105కి.మీ రైల్వే లైన్ కోసం రైల్వేశాఖ రూ.2,100కోట్ల నిధులు కేటాయించింది. డోర్నకల్ నుంచి గద్వాల వరకు 296కి.మీరైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే కాజీపేట(నష్కల్)-కరీంనగర్ మధ్య రూ.464కోట్ల అంచనా వ్యయంతో 62కి.మీ రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. భద్రాచలంలో రైల్వే స్టేషన్ ఏర్పాటు కానుంది. ఉత్తర తెలంగాణలో కీలకమైన ప్రసాద్ స్కీంలో రామప్ప, వేములవాడ, భద్రాచలం ఆలయాలను చేర్చి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తోంది.

వ్యూహాలకు బీఆర్ఎస్ పదును..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఎత్తుగడలను గమనించిన బీఆర్ఎస్ కూడా ప్రజల్లోకి వెళ్లేందుకు వ్యూహాలకు పదును పెడుతోంది. కొడంగల్‌లోని లగచర్లలో జరిగిన వివాదంపై మహబూబాబాద్‌లో కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ధర్నాకు దిగింది. ఈ ప్రాంతంలో అధికంగా గిరిజనులు ఉండటంతో వారి ఓటుబ్యాంకు చెదరకుండా కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది. అలాగే కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌పై కూడా కేటీఆర్ వరంగల్‌లో ప్రెస్‌మీట్ పెట్టి విమర్శనాస్త్రాలు సంధించారు. మరోవైపు కాంగ్రెస్‌లో అసంతృప్తిని కూడా క్యాష్ చేసుకునేందుకు గులాబీ పార్టీ ప్లాన్ చేస్తోంది. కాంగ్రెస్ ఏడాది పాలన తరువాత జనవరి లేదా ఫిబ్రవరిలో వరంగల్ కేంద్రంగా సీఎం రేవంత్‌రెడ్డి విజయోత్సవ సభకు దీటుగా కేసీఆర్‌తో భారీ సభ నిర్వహించాలని బీఆర్ఎస్ ఇప్పటికే నిర్ణయించింది. దీంతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు ఏకపక్షంగా కాంగ్రెస్ వైపు కాకుండా చూడాలని బీఆర్ఎస్ ఎత్తులు వేస్తోంది.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆకునూరి మురళి

ఆహారం కలుషితం కాకుండా
చర్యలు తీసుకోవాలి

అలాంటి ఘటనలు జరిగితే అధికారులపై చర్యలు

రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

ఖమ్మం, ఖానాపురం హవేలి, వలిగొండ, మోటకొండూరు, కాటారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, కేజీబీవీ, గురుకులాల్లో ఆహారం కలుషితం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఆదేశించారు. అలాంటి ఘటనలు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఖమ్మం జిల్లా కూసుమంచి, జీళ్లచెర్వు, ఖమ్మం నగరంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాలను ఆకునూరి మురళి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రఘునాథపాలెంలోని మైనారిటీ బాలికల పాఠశాలలో ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మెనూను పాటించకుంటే కఠిన చర్యలు ఉంటాయని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్నారెడ్డి అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ, మోటకొండూరు మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. కాగా, భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతిగృహానికి చెందిన విద్యార్థిని మారపాక వైష్ణవి సోమవారం అస్వస్థతకు గురైంది. పాఠశాలలో ఉండగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉండటంతో విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆమె కోలుకోవడంతో తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లారు.

వర్మపై తొందరపాటు చర్యలొద్దు

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ
- ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ 9కి వాయిదా



అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టడంపై వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దర్శకుడు రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను ఈ నెల 9వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది. అప్పటి వరకు ఆయనపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.హరినాథ్ ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై గతేడాది సామాజిక మాధ్యమాలలో అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టారనే ఆరోపణలతో అనకాపల్లి జిల్లా రావికమతం, గుంటూరు జిల్లా తుళ్లూరు, ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు నమోదు చేసిన మూడు వేర్వేరు కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రాంగోపాల్‌వర్మ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు.

పాత గోనె సంచుల ధర సవరణ!?

- రూ.15గా నిర్ణయించడంతో పౌరసరఫరాల శాఖకు నష్టం వస్తుందన్న ఆరోపణలు
- పునరాలోచనలో పడ్డ రాష్ట్ర ప్రభుత్వం
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై సీఎంవో ఆరా

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాత గోనె సంచుల ధరపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు తెలిసింది. ధాన్యం నింపడానికి ప్రభుత్వం సేకరించినపుడు ఎక్కువ ధర చెల్లించారని, ఇప్పుడు మిల్లర్ల నుంచి తిరిగి తీసుకోవడానికి తక్కువ ధరను నిర్ణయించడం ద్వారా పౌర సరఫరాల సంస్థకు నష్టం జరుగుతుందని ఆరోపణలు వచ్చాయి. దీంతో గోనె సంచుల ధరను సవరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు ధాన్యం సేకరణపై కొత్త విధానం తయారు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ముందు పాత గోనె సంచుల ధరల సవరణ ప్రతిపాదన పెట్టే అవకాశాలున్నాయి. గడిచిన పంట కాలాల్లో ప్రభుత్వం నుంచి రైస్ మిల్లర్లు తీసుకొని.. తిరిగివ్వని గోనె సంచులకు ఇటీవల రూ.15.50 పైసల ధర ఖరారు చేసింది. అయితే పదేళ్లలో ఆడిట్ చేయకపోవడంతో 250 కోట్ల గోనె సంచులు రైస్‌మిల్లర్ల వద్దే ఉండిపోయాయి. 'ఆంధ్రజ్యోతి' ఈ ఉదంతాన్ని సోమవారం వెలుగులోకి తీసుకొచ్చింది. 'రూ.3,875 కోట్ల గోనె సంచులను మింగేశారు!' శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనంపై ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు కూడా ఆరా తీసినట్లు తెలిసింది. మిల్లర్ల వద్ద ఎన్ని గోనె సంచులు ఉన్నాయి? ఎంత ఆదాయం రావాల్సి ఉంది? ఇంతకాలం ఆడిట్ చేయకపోవడానికి కారణాలేంటి? తదితర అంశాలపై పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారుల నుంచి నివేదిక కోరినట్లు సమాచారం. ఏళ్ల తరబడి విల్లర్ల వద్ద ఉండిపోయిన గోనె సంచుల సొమ్మును వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. మూడేళ్ల క్రితం 10 కోట్ల గోనె సంచులను మిల్లర్లు, రేషన్ డీలర్లు, వ్యాపారుల నుంచి కొనుగోలు చేసినప్పుడు రూ.30 ఎలా చెల్లించారు? ఇప్పుడు రూ.15.50 పైసలు ఎందుకు ఖరారు చేశారు? అనే అంశాలపై సీఎంవో వివరణ కోరినట్లు సమాచారం. అంతర్గతంగా జరిగిన గూడుపుఠాణీ బయటకు పొక్కడంతో పాత గోనె సంచుల ధరను సవరించాలనే ఆలోచనకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే మూడేళ్ల కిందటి ధర ప్రకారమైతే రూ.30 అవుతుంది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తొలుత నిర్ణయించిన ధరను తీసుకుంటే రూ.27 అవుతుంది. ఈ ధరలు పరిగణనలోకి తీసుకుంటారా? లేక పెంచుతారా? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.

ప్రమాదవశాత్తు తుపాకీ పేలి గల్ఫ్ ప్రవాసీ మృతి

యజమాని తుపాకీ శుభ్రం చేస్తుండగా దుర్ఘటన

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: యజమాని తుపాకీని శుభ్రం చేస్తుండగా అది ప్రమాదవశాత్తు పేలడంతో ఓ గల్ఫ్ ప్రవాసీ మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా కల్లా మండలం కొలనపల్లి గ్రామానికి చెందిన యాల్ల జాన్ డేవిడ్(26) ప్రపంచంలోకెల్లా సంపన్నులలో ఒకరైన ఖతర్‌లోని ఓ ప్రముఖ అరబ్బు కుటుంబం వద్ద వ్యక్తిగత సిబ్బందిగా పనిచేస్తున్నాడు. యజమానికి విశ్వాసపాత్రుడిగా ఉన్న డేవిడ్ యజమానితో పాటు ఇతర దేశాలకు వెళ్తుంటాడు. అలా ఏడు నెలల క్రితం లెబనాన్ వెళ్లి అక్కడే పనిచేస్తున్నాడు. గతవారం లెబనాన్‌లోని యజమాని ఇంట్లో తుపాకీని శుభ్రం చేస్తుండగా అది ప్రమాదవశాత్తు పేలడంతో డేవిడ్ మరణించినట్లు తెలిసింది. డేవిడ్ మృతికి సంబంధించి పోలీసు, వైద్య నివేదికలు ఇంకా భారత రాయబార కార్యాలయానికి అందలేదని సమాచారం. లెబనాన్‌లో ఉన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా అందుకు మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని భారత అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

ఏడాదిలో 12 వేల ఉద్యోగాల భర్తీ

మరిన్ని పోస్టులకు నియామకాలు

- పారదర్శకంగా పరీక్షల నిర్వహణ
- 100 శాతం బయోమెట్రిక్ హాజరు
- ఫలితాలకు ఆటోమేషన్ ప్రాసెసింగ్
- టీఎస్‌పీఎస్సీ ప్రగతి నివేదిక విడుదల
- చైర్మన్ మహేందర్‌రెడ్డి పదవీ విరమణ



హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఏడాది కాలంలో పబ్లిక్ సర్వీసు కమిషన్ ఆధ్వర్యంలో సుమారు 12 వేల పోస్టులను భర్తీ చేశారు. మరికొన్ని పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. పదవీ కాలం ముగియడంతో పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చైర్మన్ మహేందర్‌రెడ్డి సోమవారం బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఒకటి రెండు రోజుల్లో కొత్త చైర్మన్‌గా బుర్రా వెంకటేశం బాధ్యతలను స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కాలంలో టీఎస్‌పీఎస్సీ ద్వారా జరిగిన నియామకాలు, ఇతర ప్రగతిపై అధికారులు ఒక నివేదికను విడుదల చేశారు. ఈ నివేదిక ప్రకారం.. గత ఏడాది కాలంలో 12,403 పోస్టులను భర్తీ చేశారు. మరికొన్ని పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. పోటీ పరీక్షలను ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా నిర్వహించినట్లు ఇందులో పేర్కొన్నారు. 100 శాతం బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేసినట్లు వివరించారు. మానవ తప్పిదాలు జరగకుండా ఫలితాల వెల్లడిలో ఆటోమేషన్ ప్రాసెసింగ్‌ను ప్రవేశపెట్టినట్టు చెప్పారు. తద్వారా సుదీర్ఘకాలం పట్టే గ్రూపు-4 నియామక ప్రక్రియను వేగంగా పూర్తి చేసినట్టు వివరించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలి గ్రూపు-1 పరీక్షను విజయవంతంగా పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. ఈ విషయంలో గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్త చర్యల్ని తీసుకున్నట్టు చెప్పారు. కమిషన్‌ను బలోపేతం చేయడం కోసం 142 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతించినట్టు వివరించారు. కమిషన్ పని తనం, నిర్మాణాత్మకంగా, గుణాత్మకంగా మెరుగు పరిచే విధంగా సిబ్బందికి 55 అంశాలపై శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

ఈ ఏడాది కాలంలో భర్తీ చేసిన పోస్టుల వివరాలు...

పోస్టుల పేరు	భర్తీ చేయాల్సినవి	భర్తీ చేసిన పోస్టులు
హార్టికల్చర్ ఆఫీసర్స్	22	19
డ్రగ్ ఇన్‌స్పెక్టర్	18	18
ఏఈఈ (అగ్రికల్చర్)	100	95
ఏఈఈ (మెడికల్)	97	96
ఏఈఈ (ఎలక్ట్రికల్)	163	163
ఏఈఈ (సివిల్)	1180	1154
గ్రౌండ్‌వాటర్‌లో గెజిట్ పోస్టులు	32	30
అకౌంట్స్ ఆఫీసర్స్	78	76
అగ్రికల్చర్ ఆఫీసర్స్	148	145
ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2	325	282
పీఈటీలు	616	596
వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్	185	171
లైబ్రేరియన్స్	71	64
ఏఎంవీఐ	113	113
గ్రూపు-4	8180	8143
ఫిజియో థెరపిస్ట్	52	48
జూనియర్ లెక్చరర్లు	1392	882
పాలిటెక్నికల్ లెక్చరర్లు	247	206
ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్	24	24
గ్రౌండ్ వాటర్‌లో నాన్-గెజిటెడ్	25	25
డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్	53	53
మొత్తం	13,121	12,403

పనుల భారంతో ఉక్కిరి బిక్కిరి

- గంపెడాదేశాలు.. చేయాల్సింది ఒక్కరే!
- పంచాయతీ కార్యదర్శుల ఆవేదన

హైదరాబాద్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): పనుల భారం పెరిగి ఉక్కిరిబిక్కిరవుతున్నట్లు రాష్ట్రంలోని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారిగా పారిశుద్ధ్యపనుల పరిశీలన, సర్పంచుల్లేని పంచాయతీల భారం మోయడం, గ్రామాల్లో ప్రజాపాలన ఏడాది విజయోత్సవాల నిర్వహణ, ఇంటింటి సమగ్రసర్వే పర్యవేక్షణ ఇలా అనేక బాధ్యతలు వారిపై పడ్డాయి. వీటికి తోడు పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సప్లిమెంటరీ ఓటరు జాబితా రూపొందించాల్సి రావడం, పంచాయతీలకు సంబంధించిన జమ, లెక్కలు, ఖాతాల ఏడాది ముగింపు లెక్కలు తక్షణమే పంపాలంటూ రాష్ట్ర కార్యాలయం నుంచి వారికి ఆదేశాలు అందాయి. ఒకవైపు పంచాయతీ రాజ్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు, జిల్లా కలెక్టర్ల మార్గదర్శకాలు, మరోవైపు జిల్లా పంచాయతీ అధికారులు(డీపీఓ), జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు(డీఆర్‌డీఓ) వరుసబెట్టి పనులు అప్పగిస్తుండటంతో ఒత్తిడికి గురికావాల్సి వస్తోందని పంచాయతీ కార్యదర్శులు చెప్పారు. మానసిక ఒత్తిడితో సతమతంఅవుతూ విధులు నిర్వహించడం కష్టతరంగా మారిందని వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొందరు వివిధ కారణాలు చూపుతూ సెలవుపై వెళ్తున్నారని కార్యదర్శుల సంఘం ప్రతినిధులు తెలిపారు.

డిపార్ట్‌మెంటల్ పరీక్షకూ హాజరుకాలేని పరిస్థితి

వరుస పనుల కారణంగా.. పదోన్నతి పొందేందుకు శాఖాపరంగా ఏటా రెండుసార్లు నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు కూడా హాజరు కాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం స్థానిక సంస్థల ఉద్యోగులకు సంబంధించి అకౌంట్స్ టెస్ట్ ఫర్‌ది ఎంప్లాయిస్ ఆఫ్ లోకల్‌బాడీ 146, 147 పరీక్షలకు ఫీజు చెల్లించి కూడా హాజరుకాలేక పోయామన్నారు. సంబంధిత విభాగాలు ఇచ్చిన సమాచారం ప్రకారం 80శాతం మందికిపైగా కార్యదర్శులు డిపార్ట్‌మెంటల్ పరీక్షకు గైర్హాజరయినట్లు సమాచారం.

31 మందితో వన్య ప్రాణుల బోర్డు

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అడవులు, వన్య ప్రాణుల రక్షణే లక్ష్యంగా తెలంగాణ వన్య ప్రాణుల మండలిని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ బోర్డుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఛైర్మన్‌గా, రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి వైస్ ఛైర్మన్‌గా ఉంటారు. 31 మందితో కూడిన బోర్డులో ఖానాపూర్, అచ్చంపేట, మహబూబాబాద్, పినపాక, వైరా ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, వంశీకృష్ణ, మురళీనాయక్, పాయం వెంకటేశ్వర్లు, రాందాస్ మాలోత్ సభ్యులుగా ఉన్నారు. స్వచ్ఛంద సంస్థల నుంచి వరల్డ్‌వైడ్ ఫండ్ రాష్ట్ర డైరెక్టర్ ఫరీదా తంపల్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి ఇమ్రాన్ సిద్దిఖీ, ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ కార్యదర్శి అవినాశ్ విశ్వనాథన్‌లను సభ్యులుగా నియమించారు. అలాగే ప్రముఖ పర్యావరణవేత్తలను కూడా సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. వీరిలో డాక్టర్ ఉమాపతి, ఎంఏ వహీద్, డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ వాసుదేవరావు, డాక్టర్ సి.శ్రీనివాసులు, కె.సుధీర్ మూర్తి, ఎ.శంకరన్, ఆలోక్ పర్ణసేన్ గుప్తా ఉన్నారు. ఒక మెంబర్ సెక్రటరీతోపాటు అటవీ, గిరిజన, పశుసంవర్ధక, పర్యాటక శాఖలకు చెందిన వారిని సభ్యులుగా నియమిస్తూ అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మహాకుంభమేళా జిల్లా!

- యోగి సర్కారు అసాధారణ నిర్ణయం

లఖ్‌నవూ: పుష్కారానికి ఒక పర్యాయం జరిగే మహాకుంభమేళా మహోత్సవం కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అసాధారణ ఏర్పాట్లు చేస్తోంది. మేళా నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఒక కొత్త జిల్లాను ఏర్పాట్లు చేస్తూ, తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాలో కుంభమేళా నిర్వహించడం సంప్రదాయంగా వస్తున్న ఆనవాయితీ. మేళా జరిగే ప్రాంతాన్ని ఇప్పుడు ఈ జిల్లా నుంచి వేరు చేసి.. ప్రత్యేక సరిహద్దులతో కొత్త జిల్లాను నెలకొల్పారు. దీనికి మహాకుంభమేళా జిల్లాగా నామకరణం చేసింది.

‘బిల్డ్‌నౌ’గా టీజీ-బీపాస్

5 నిమిషాల్లో డిజైన్లకు అనుమతి.. ఏఆర్ ద్వారా భవనాలు, లేఅవుట్ల వీక్షణ

- జీవోల నిబంధనల కోసం ఏఐ సేవలు
- బ్లాక్‌చైన్ ద్వారా విశ్వాసం పెంచే ప్రయత్నం
- తొలుత జీహెచ్ఎంసీలో తదుపరి దశలో హెచ్ఎండీఏలో అమలు



హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భవనాలు.. లేఅవుట్ల అనుమతులు, ఆక్యుపెన్సీ పత్రాల జారీ, భూవినియగ మార్పిడి వంటి సేవలకు ప్రభుత్వం ఆధునికతను జోడించింది. ఈ తరహా సేవలను ఏక గవాక్ష(సింగిల్ విండో) విధానంలో అందజేస్తున్న టీజీ-బీపాస్‌ను ‘బిల్డ్‌నౌ’గా మార్చి.. ‘ఒకే రాష్ట్రం.. ఒకే విధానం’ పేరుతో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానుంది. ప్రజల్లో విశ్వాసాన్ని పెంచేలా.. ఈ విధానంలో మార్పులకు శ్రీకారం చుట్టింది. ఆమ్యామ్యాలు ముట్టచెబితేగానీ అనుమతులు దొరకవనే పరిస్థితి నుంచి.. ఆన్‌లైన్‌లో అంతా పారదర్శకంగా, అవినీతిరహితంగా వ్యవస్థను పరిచయం చేయనుంది. లేఅవుట్, భవనాల డ్రాయింగ్ పరిశీలనకు వారాల సమయం పట్టేది. ఇకపై ఆ ప్రక్రియను నిమిషాల్లో పూర్తిచేసేలా చర్యలు తీసుకోనుంది. దరఖాస్తుదారుల సందేహాల నివృత్తికి, సమస్యలను తక్షణం పరిష్కరించడానికి, దరఖాస్తుల్లో లోపాలుంటే.. వాటిని ఎత్తిచూపుతూ.. సంబంధిత జీవోను.. వాటిల్లోని నిబంధనలను దరఖాస్తుదారులకు అర్థమయ్యేలా కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. డిజైన్లకు అనుగుణంగా నిర్మాణాలున్నాయా? లేదా? అనే విషయాన్ని గుర్తించేందుకు అగ్మెంటెడ్ రియాల్టీ(ఏఆర్) విధానాన్ని ఉపయోగించనుంది. ఇలా మార్పులు చేసిన బిల్డ్‌నౌ వివరాలను.. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పురపాలక అధికారులు వివరించారు.

> **ఫిబ్రవరి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి**
>
> ప్రస్తుతానికి బిల్డ్‌నౌ పేరుతో టీజీ-బీపాస్‌ను ఆధునీకరించాం. తొలుత జీహెచ్ఎంసీ, ఆ తరువాత హెచ్ఎండీఏలో దీన్ని అమలు చేస్తాం. ఫిబ్రవరి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థానిక సంస్థల్లోనూ ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తాం. కొత్త విధానంపై పట్టణ ప్రణాళిక సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంది.
>
> \- ఎస్. దేవేందర్ రెడ్డి, డీటీసీపీ

5 నిమిషాల్లో అనుమతులు

డ్రాయింగ్ పరిశీలనలను వేగవంతం చేయడం వల్ల.. అనుమతుల ప్రక్రియ 5 నిమిషాల్లోనే పూర్తి కానుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో ఈ ప్రక్రియకు 2 నుంచి 30 రోజుల సమయం పడుతోంది. 40, అంతకంటే ఎక్కువ అంతస్తులున్న భవనాల డ్రాయింగ్ పరిశీలనకు 20-30 రోజులు తప్పనిసరిగా మారింది. అయితే.. బిల్డ్‌నౌ విధానంలో ఈ ప్రక్రియలన్నీ 3 నిమిషాల్లో పూర్తయ్యి.. అనుమతులు వస్తాయి. 150 కంటే ఎక్కువ విల్లాలను నిర్మించే లేఅవుట్‌లకు సంబంధించిన అనుమతులకు 10-15 రోజులు పడుతుండగా.. కొత్త విధానంలో 5 నిమిషాల్లో పూర్తికానుంది. ఇక ఓపెన్ ప్లాట్స్ లేఅవుట్ అనుమతి నిమిషంలో పూర్తవ్వనుంది. ఇక ఆక్యుపెన్సీ జారీకి ఇప్పటి వరకు 15 రోజుల సమయం పడుతుండగా.. కొత్త విధానంలో 10 రోజులకు కుదించినట్లు అధికారులు చెబుతున్నారు.

ఏఆర్ టెక్నాలజీతో..

బిల్డ్‌నౌలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏఆర్ విధానంలో కియోస్క్‌లు అందుబాటులోకి రానున్నాయి. ఈ విధానంలో భవన నిర్మాణానికి ముందే ఆకృతి ఎలా ఉండబోతుందో చూసుకునేలా 3డీ విజువలైజేషన్ ఉంటుంది. ఇంటరాక్టివ్ 3డీ మోడల్స్ ద్వారా కంప్యూటర్ లేదా హెడ్‌సెట్‌లో డిజైన్ ప్రకారం భవన నిర్మాణం పూర్తయితే ఎలా ఉంటుందో చూసే వీలు కలుగుతుంది. రూల్స్ అసిస్టెంట్ సిస్టమ్ పేరుతో ఏఐ విధానంలో ప్లాట్ విస్తీర్ణం, భవనం ఎత్తు, వెడల్పు, సెట్ బ్యాక్ ఎలా ఉండాలి అనే అంశాలను తెలుసుకునేలా మార్పులు చేశారు. తక్షణ డేటా విశ్లేషణకు ఏఐని వినియోగిస్తారు. జీఐఎస్ ఇంటిగ్రేషన్, సులభతరమైన పేమెంట్ గేట్‌వే, అనుబంధ విభాగాలతో అనుసంధానం, డాక్యుమెంట్ మేనేజ్‌మెంట్ సిస్టిమ్(డీఎంఎస్) వంటి వ్యవస్థలను బిల్డ్‌నౌలో పరిచయం చేస్తారు. అంతేకాదు.. బ్లాక్‌చైన్ టెక్నాలజీ ద్వారా దరఖాస్తుదారుడు ఎప్పటికప్పుడు పురోగతిని తెలుసుకునే వీలుంటుంది.

విశ్వ బ్రాహ్మణులను ఒకటిగానే లెక్కించండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ సమగ్ర కులగణన సర్వేలో విశ్వబ్రాహ్మణ లేదా విశ్వకర్మ కులంలోని కంసాలి, వడ్ల, కంచరి, కమ్మరి, శిల్పి వర్గాలను ఒకటే కులంగా లెక్కించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. కులగణనలో విశ్వబ్రాహ్మణులను ఒక్కటిగా లెక్కించకుండా ఆయా వర్గాలకు ప్రత్యేకంగా కోడ్ కేటాయించడాన్ని సవాల్ చేస్తూ విశ్వ బ్రాహ్మణ అడ్వొకేట్స్ అసోసియేషన్, న్యాయవాది పెందోట శ్రీనివాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సూరేపల్లి నంద ధర్మాసనం విచారణ చేపట్టింది. విశ్వబ్రాహ్మణ కులంలో వివిధ వర్గాలకు ప్రత్యేకంగా కోడ్ ఇచ్చి లెక్కించడం వల్ల వారి జనాభా చాలా తక్కువగా నమోదవుతుందని.. మొత్తం జనాభాను ఒక్కటిగానే లెక్కించాలని పిటిషనర్ కోరారు. ప్రభుత్వం తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆయా సబ్ క్యాటగిరీ వర్గాల్లో వెనుకబాటుతనాన్ని అంచనా వేయడానికి మాత్రమే ప్రత్యేక కోడ్‌లు ఇచ్చామని తెలిపారు. విశ్వబ్రాహ్మణ వర్గాలకు ఇచ్చిన సీరియల్ నంబరు 75 నుంచి 79 వరకు వచ్చిన లెక్కలను కలిపి చూపించేలా సాఫ్ట్‌వేర్‌ను సవరించాలని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సంస్థను ఆదేశిస్తామని తెలిపారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. విశ్వబ్రాహణ కులంలోని వివిధ వర్గాల లెక్కలను కలిపి ఒకే కులంగా పరిగణించాలని పేర్కొంటూ ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు పిటిషన్‌ను ముగించింది. కాగా, హైకోర్టు తీర్పు పట్ల పిటిషనర్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు పెందోట శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణులను వేర్వేరు కులాలుగా పేర్కొనడం వల్ల జనాభా సంఖ్య తగ్గుతుందని.. ప్రభుత్వ పథకాల్లో అన్యాయం జరిగే అవకాశం ఉన్నందునే హైకోర్టును ఆశ్రయించామని పేర్కొన్నారు.



మంచిర్యాల రైల్వే స్టేషన్ ప్రతిపాదిత డిజైన్

26.49 కోట్లతో మంచిర్యాల రైల్వే స్టేషన్ అభివృద్ధి:కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని మంచిర్యాల రైల్వేస్టేషన్ కొత్తరూపు సంతరించుకోనుంది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.26.49 కోట్లతో మంచిర్యాల రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ప్రయాణికులకు ఆధునిక ప్రయాణ అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఈ రైల్వేస్టేషన్‌లో అత్యాధునిక సౌకర్యాలతోపాటు మెరుగైన సేవలను అందించాలని సంకల్పించినట్లు సోమవారం ఆయన ‘ఎక్స్’ వేదికగా పేర్కొన్నారు. మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు సంబంధించిన ప్రతిపాదిత డిజైన్‌ను ఆయన పంచుకున్నారు.

తెలంగాణ సంక్షేమ కార్యక్రమాలు.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్నాయా?

- ఉనికి కోసమే మీ చార్జిషీటు: జీవన్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అమలవుతోన్న సంక్షేమ కార్యక్రమాలు దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా అమలవుతున్నాయా అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఉనికిని కాపాడుకునేందుకే ఏడాది కాంగ్రెస్ పాలనపై బీజేపీ.. చార్జిషీటును విడుదల చేసిందన్నారు. పంటల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించని బీజేపీ.. రైతుల గురించి మాట్లాడుతుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసినట్లుగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రైతులకు రుణమాఫీని అమలు చేశారా.. అని నిలదీశారు.

మాఫీపై కాంగ్రెస్ అబద్ధపు ప్రచారం: బీజేపీ

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు ప్రచారం చేస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు ఆరోపించారు. రుణమాఫీకి రూ. 79 వేల కోట్లు అవసరం కాగా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ. 23 వేల కోట్లు మాత్రమే ఇచ్చి మొత్తం రుణమాఫీ చేసినట్లు ప్రచారం చేసుకుంటోందని ఆయన విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో 41సార్లు పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను రద్దు చేశారన్నారు. రాజ్యాంగాన్ని అవమానపరిచిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని ఆయన మండిపడ్డారు.

బీఆర్ఎస్ సినిమా అయిపోయింది: ఆది

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ సినిమా అయిపోయిందని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఎపిసోడ్ నడుస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రంలోని రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇస్తున్న మద్దతు చూసి.. హరీశ్‌రావు కళ్లలో నిప్పులు పోసుకుంటున్నాడన్నారు. పదేళ్లలో రైతుల ఖాతాల్లో రూ. 80 వేల కోట్లు వేసినట్లుగా హరీశ్‌రావు అబద్ధాలు చెబుతున్నాడన్నారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే రైతులకు రూ. 22 వేల కోట్ల మేరకు రుణాలను మాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికే రైతులపై పేటెంట్ హక్కు ఉందన్నారు.

వివేక్‌కి మంత్రి పదవి ఇవ్వాలి: సతీష్ మాదిగ

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వాలంటూ ఆ పార్టీ నేత దేవని సతీష్ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. జనరల్ కోటా కింద ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో జరిగిన మాలల సభ విజయవంతమైందన్నారు. వెంకటస్వామి కుటుంబాన్ని తిట్టడాన్ని, మాలల సభను అవమానించడాన్ని మంద కృష్ణ మాదిగ మానుకోవాలని సూచించారు.

6న యాదాద్రి తొలి యూనిట్ ప్రారంభోత్సవం

నల్లగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న నాలుగు వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్‌లో తొలి యూనిట్‌ను(800 మెగావాట్ల సామర్థ్యం) ఈ నెల 6వ తేదీన ప్రారంభించనున్నారు. ప్రజాపాలన విజయోత్సవాలపై సోమవారం అధికారులతో నిర్వహించిన సమీక్షలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ విషయాన్ని ప్రకటించారు. పవర్‌ప్లాంట్ యూనిట్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆహ్వానించారు. అయితే ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాక షెడ్యూల్ ఇంకా ఖరారవ్వాల్సి ఉంది.

గోదావరి-కావేరి అనుసంధానమే అజెండా

- నేడు ఢిల్లీలో ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశం

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరి-కావేరి అనుసంధాన ప్రాజెక్టు పురోగతితో పాటు పలు అంశాలపై చర్చించేందుకు జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) సమావేశం కానుంది. మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీలో ఎన్‌డబ్ల్యూడీఏ 74వ పాలకమండలి సమావేశం జరగనుంది. హైబ్రిడ్ విధానం (ప్రత్యక్షంగా లేదా వర్చువల్)లో జరిగే ఈ భేటీలో గోదావరి-కావేరి అనుసంధానం ప్రధాన అజెండాగా ఉంది. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలు లేవనెత్తిన అంశాలపైనా సమావేశంలో చర్చించనున్నారు.

ఆర్ట్స్ కాలేజీకి ట్రేడ్‌మార్క్ గుర్తింపు?

హైదరాబాద్ సిటీ, డిసెంబర్2(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలకు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ ట్రేడ్‌మార్క్ గుర్తింపు రానుంది. తాజ్ మహల్ హోటల్, బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ భవనాలు ఇప్పటికే ట్రేడ్‌మార్క్ గుర్తింపు పొందగా, వాటి సరసన మూడో భవనంగా ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కళాశాల చేరనుంది. ట్రేడ్‌మార్క్ గుర్తింపు కోసం ఇప్పటికే దరఖాస్తు చేయగా ట్రేడ్‌మార్క్ అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురణకు ఆమోదం పొందింది. నాలుగైదు నెలల్లో రిజిస్ట్రేషన్ పూర్తవుతుందని ట్రేడ్‌మార్క్ ఏజెంట్ సుభజిత్ సాహ వెల్లడించారు.

మరో 3నెలలు దొడ్డు బియ్యం!

- 6 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు ఉత్తర్వులు
- సీఎంఆర్ కోటాలో రాష్ట్ర వాటా కింద తీసుకోవాలని నిర్ణయం



హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సన్న బియ్యం పంపిణీని సంక్రాంతి నుంచి ఉగాదికి వాయిదా వేసిన రాష్ట్ర ప్రభుత్వం.. రాబోయే మూడు నెలలకు సరిపడా దొడ్డు బియ్యం సేకరణపై దృష్టి సారించింది. 6 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు జిల్లాలు, రైస్ మిల్లుల వారీగా కేటాయింపు ఉత్తర్వులు జారీ చేసింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోటాలో రాష్ట్ర వాటా (స్టేట్ పూల్) కింద ఆ బియ్యాన్ని పౌర సరఫరాల సంస్థ సేకరిస్తుంది. 2023-24 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన బియ్యాన్ని ఈ కోటాలో సేకరించనున్నారు. రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని మర ఆడించిన తర్వాత భారత ఆహార సంస్థకు అప్పగించాల్సి ఉంటుంది. ఏ గోదాముల్లో జాగా చూపిస్తే అక్కడికి బియ్యం తీసుకెళ్లి ఇవ్వాల్సి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆహార భద్రత కార్డులు, ఇతర సంక్షేమ పథకాలకు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతాయి. మూడు నెలలకు (2025 జనవరి, ఫిబ్రవరి, మార్చి) కలిపి 6 లక్షల టన్నుల బియ్యం అవసరం ఉంటుంది. ఈ బియ్యం సేకరణకు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డీఎస్ చౌహాన్ జారీ చేయడంతో రైస్ మిల్లర్లు ఎగిరి గంతేస్తున్నారు. ఎందుకంటే.. భారత ఆహార సంస్థకు సీఎంఆర్ డెలివరీ ఇవ్వటం కొంత కష్టంగా ఉంటుంది. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటేనే ఎఫ్‌సీఐ బియ్యం తీసుకుంటుంది. అయితే పౌరసరఫరాల సంస్థ కోటాలో బియ్యం ఇవ్వటానికి రైస్ మిల్లర్లు ఇష్టపడతారు. మామూళ్లు ముట్టచెబితే బియ్యం ఎలా ఉన్నా స్థానిక అధికారులు కిమ్మనరన్న నమ్మకమే కారణం. ఇదిలా ఉండగా ఎఫ్‌సీఐకి బియ్యం ఎగ్గొట్టి.. పౌర సరఫరాల సంస్థకు బియ్యం కోటా కేటాయింపులు ఇప్పించినందుకు కొందరు మధ్యవర్తులు రైస్ మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేసే ఆనవాయితీ ఉంది. టన్నులు, జిల్లాల లెక్కన, కోటా ప్రకారం... డబ్బులు వసూలు చేసి అధికారులకు ముట్టజెపుతుంటారు. వాస్తవానికి ఇప్పుడిచ్చిన 6 లక్షల టన్నుల కోటాలో ఎవరి ప్రమేయం, పైరవీలు లేవు. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాల నిమిత్తం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనిని కూడా తమ ఖాతాలో వేసుకొని కొందరు మధ్యవర్తులు వనపర్తి, కామారెడ్డి, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల రైస్ మిల్లర్ల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో వనపర్తి జిల్లా నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయటంతో మధ్యవర్తులు, మిల్లర్ల మధ్య గొడవలు జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

బ్యారేజీలను డ్యామ్‌లుగా గుర్తిస్తారా?

మేడిగడ్డ ఎప్పుడు దెబ్బతింది?

- ఎస్‌డీఎస్‌వో మాజీ ఎస్ఈపై కమిషన్ ప్రశ్నలు
- అమెరికాలో ఉన్న అధికారితో వర్చువల్ విచారణ
- నేడు కోల్‌కతాకు తిరిగి వెళ్లనున్న జస్టిస్ ఘోష్



హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బ్యారేజీలను డ్యామ్‌లుగా ఏ విధంగా గుర్తించారు? 2019లో బ్యారేజీలు పూర్తయితే 2021లో జాతీయ ఆనకట్టల భద్రత చట్టం (ఎన్‌డీఎస్ఏ) వచ్చింది.. 2023 జులైలో కాళేశ్వరం బ్యారేజీలను స్పెసిఫైడ్ డ్యామ్‌లుగా గుర్తించడం వెనుక ఆంతర్యం ఏమిటి? అని స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్‌డీఎస్‌వో)ను కాళేశ్వరం విచారణ కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరంపై విచారణలో భాగంగా సోమవారం అమెరికాలో ఉన్న ఎస్‌డీఎస్‌వో మాజీ ఎస్ఈ మురళీకృష్ణను వర్చువల్ విధానంలో కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. జాతీయ ఆనకట్టల భద్రత చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది? అఫిడవిట్‌లో పేర్కొన్నదంతా వాస్తవమేనా? మీ విధులు బాధ్యత లేమిటి? అని కమిషన్ ప్రశ్నించగా 2021 డిసెంబరు 30వ తేదీన ఎన్‌డీఎస్ఏను నోటిఫై చేశామని బదులిచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను డ్యామ్‌లుగా పరిగణించారా? బ్యారేజీలను ఏ విధంగా డ్యామ్‌లుగా పరిగణించారు? అని ప్రశ్నించింది. దీనికి మురళీకృష్ణ బదులిస్తూ 15 మీటర్ల ఎత్తు కలిగి, నీటిని నిల్వ చేసే వాటితో పాటు చెక్‌డ్యామ్‌ల ఎత్తు 10 మీటర్లు దాటినా డ్యామ్‌లుగా పరిగణించాలని చట్టంలో ఉందని చెప్పారు. నీటిని మళ్లించడానికే బ్యారేజీలు కడతారు... మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను ఏ విధంగా డ్యామ్‌లుగా పరిగణించారని మళ్లీ కమిషన్ ప్రశ్నించింది. జాతీయ ఆనకట్టల భద్రత చట్టం ప్రకారం స్పెసిఫైడ్ డ్యామ్‌లుగా బ్యారేజీలను నోటిఫై చేయడం జరిగిందని మురళీకృష్ణ వివరించారు. మీ విధులు, బాధ్యతలేమిటి? అని కమిషన్ ప్రశ్నించగా జాతీయ ఆనకట్టల భద్రత చట్టాన్ని అమలు కోసం పలు క్షేత్రస్థాయి అధికారులతో పలు వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి, ఆయా డ్యామ్‌లను సమగ్రంగా పరిశీలించి, నోటిఫై చేయించామని తెలిపారు. బ్యారేజీలు పూర్తయిందెప్పుడు? అని కమిషన్ ప్రశ్నించగా 2023లో స్పెసిఫైడ్ డ్యామ్‌లుగా నోటిఫై చేశామని గుర్తు చేశారు. చట్టం ఎప్పుడు వచ్చింది? 2021లో చట్టం వస్తే.. 2019లోనే బ్యారేజీ పూర్తయింది వాస్తవమా? కాదా.? అని ప్రశ్నించగా... అవును అని బదులిస్తూ... పదే పదే విజ్ఞప్తుల అనంతరం స్పెసిఫైడ్ డ్యామ్‌ల లిస్టులో బ్యారేజీలను చేర్చారని బదులిచ్చారు. మేడిగడ్డ ఎప్పుడు దెబ్బతింది? బ్యారేజీకి తొలి వరదలు ఎప్పుడొచ్చాయి? అని ప్రశ్నించగా... 2019లో వరదలొచ్చాయని, తొలుత సుందిళ్ల, అన్నారంలో బుంగలు (పైజీలు) ఏర్పడ్డాయని, ఆ తర్వాత మేడిగడ్డ దెబ్బతిందని, అయితే బ్యారేజీల అథారిటీ రిపోర్టు మాత్రం చేయలేదని మురళీకృష్ణ చెప్పారు. ఈ సందర్భంగా అమెరికాలోని ఏ రాష్ట్రంలో ఉన్నారు? అని కమిషన్ ప్రశ్నించగా... సియాటెల్‌లో అని బదులివ్వగా... స్వామి వివేకానందుడు సేదతీరిన వృక్షాన్ని పరిశీలించారా? అని అడుగుతూ వీలు చేసుకొని పరిశీలించాలని సూచించారు.

రెండో వారంలో మళ్లీ విచారణ

ఈ షెడ్యూల్‌లో క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి చేసిన జస్టిస్ ఘోష్, మంగళవారం కోల్‌కతాకు తిరిగి వెళ్లనున్నారు. రెండో వారంలో తిరిగి, హైదరాబాద్‌కొచ్చి ఈఎన్‌సీలతో పాటు మాజీ ఈఎన్‌సీలను ప్రశ్నించనున్నారు. ఇక కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలోనూ, ఆ బ్యారేజీల వైఫల్యానికి ప్రధాన కారణాల్లో ఒకటైన వాటిలో ఎక్కువ కాలం నీటి నిల్వకు ఆదేశాలు జారీ చేశారని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌పై కమిషన్‌కు ఇప్పటికే ఫిర్యాదులు రావడంతో వీరిద్దరినీ జనవరిలో కమిషన్ క్రాస్ ఎగ్జామిన్ చేయనుంది.

నిధుల్లేక నిలిచిపోయిన
భూపాలపల్లి సీతారామ ప్రాజెక్టు

తొమ్మిది కిలోమీటర్ల మేర పైపు లైన్లు

- ప్రభుత్వం మారడంతో పనులకు బ్రేక్
- పైపు లైను వేసిన వరకైనా విద్యుత్ కనెక్షన్ ఇచ్చి నీరందించాలని రైతుల డిమాండ్

భూపాలపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంత రైతులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో ప్రారంభించిన మినీ ఎత్తిపోతల పథకాలు నిధుల్లేక నిలిచిపోతున్నాయి. రూ.64 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన భూపాలపల్లి జిల్లాలోని సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టే ఇందుకు ఓ నిదర్శనం. దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా ఈ ప్రాజెక్టును 2020లో ప్రారంభించారు. రూ.22కోట్లతో 9 కిలోమీటర్ల మేర పైపులైను నిర్మించారు. ఇంకా 5కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉంది. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి చెందిన చల్లా ఇన్‌ఫ్రా అనే సంస్థ కాంట్రాక్ట్‌ను చేజిక్కించుకుంది. అయితే, 2021లో పైపులైన్ నిర్మాణానికి సంబంధించి అటవీ శాఖ అడ్డంకులు సృష్టించడంతో పాటు నిర్మాణ సంస్థ యంత్ర సామగ్రిని జప్తు చేసి పనులను అడ్డుకొంది. దీంతో, ఈ ప్రాజెక్టు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో 2023లో అప్పటి కలెక్టర్ భవేష్ మిశ్రా అటవీ శాఖ అధికారులతో చర్చించి మార్గం సుగమం చేయగా, నిర్మాణ సంస్థ అటవీ శాఖకు రూ.6లక్షల జరిమానాను స్వంతంగా చెల్లించి పనులను కొనసాగించే ప్రయత్నం చేసింది. ఇదే సమయంలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో మిగతా పనుల పూర్తికి నిధుల సమస్య ఏర్పడింది. పనులకు బ్రేక్ పడింది. మిగతా పనులను పూర్తి చేయడానికి ఇంకా రూ.14 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా ఇప్పట్లో అవి మంజూరయ్యే పరిస్థితి లేకపోవడంతో ప్రతిష్టంభన ఏర్పడింది. ఏడాది గడుస్తున్నా పనులు ప్రారంభం కాలేదు. దీంతో, రైతులు.. పైపు లైను వేసిన వరకైనా నీటిని అందించాలని కోరుతున్నారు. ఇందుకోసం విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాలని అధికారులు ప్రభుత్వానికి ఇప్పటికే మూడు సార్లు ప్రతిపాదనలు పంపారు. విద్యుత్ కనెక్షన్‌కు రూ.90లక్షలు అవసరం కాగా.. ఆ నిధులు కూడా విడుదల కాక ప్రాజెక్టు అర్ధంతరంగా ఆగిపోయింది. భూపాలపల్లి, మహాముత్తారం మండలాల పరిధిలోని దీక్షకుంట, దూదేకులపల్లి, గొల్ల బుద్దారం, మహా ముత్తారం మండలంలోని నాలుగు గ్రామాలు.. మొత్తం కలిపి 4,980 ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును 2020లో ప్రారంభించారు. అయితే, 9కిలోమీటర్ల పైపు లైను వరకు విద్యుత్ కనెక్షన్ ఇస్తే 4వేల ఎకరాల వరకు సాగులోకి వస్తుందని అంచనా.

ఉపరితల జలాలే ఆధారం

సీతారామ ప్రాజెక్టులో భాగంగా నీరందించాలనుకున్న పలు గ్రామాల్లోని సాగుభూములకు ఉపరితల జలాలే ప్రధాన ఆధారం. ఇక్కడి భూభాగమంతా రాతినేలలతో కూడుకుని ఉండడం వల్ల భూగర్భ జలాలు అందే పరిస్థితి లేదు. దీంతో, మిగిలిన పైప్‌లైన్ విస్తరణ మాట ఎలా ఉన్నా ఇప్పటివరకు పూర్తయిన తొమ్మిది కిలోమీటర్ల పైప్‌లైన్ వరకైనా సాగునీటిని అందించాలనేది రైతుల డిమాండ్. ప్రస్తుతం ఇక్కడ మోటార్ల బిగింపు ప్రక్రియ కూడా పూర్తైందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం కేవలం రూ.90లక్షలు మంజూరు చేస్తే విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం ద్వారా ప్రస్తుత పైప్‌లైన్ల పరిధి వరకు సాగునీటిని అందించవచ్చని, నిధుల లభ్యతను బట్టి మిగతా పనులను కూడా పూర్తి చేసే అవకాశం ఉంటుందని నీటిపారుదల శాఖ అధికారులంటున్నారు.

పారిపోలేదు.. నా డెన్‌లోనే ఉన్నా

- అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తే.. సినిమా కథలు రాసుకుంటా: ఆర్జీవీ

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో తనపై నమోదైన కేసుల విషయంలో దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ స్పందించారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, డెన్‌లోనే ఉన్నానని పేర్కొన్నారు. వర్మపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఏపీ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఆయన హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆర్జీవీ గోడ దూకి పారిపోయాడు, దాక్కున్నాడు.. అంటూ మీడియానే కథ, స్క్రీన్‌ప్లే తయారు చేసిందని అసహనం వ్యక్తం చేశారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, షూటింగ్‌లతో బిజీగా ఉన్నానని పేర్కొన్నారు. అయినా పోలీసులు ఇంతవరకూ నన్ను అరెస్ట్ చేస్తామని చెప్పలేదని అన్నారు. ఒకవేళ అరెస్టు చేస్తే.. జైలుకెళ్లి, అక్కడ ఖైదీలతో పరిచయం పెంచుకొని, నాలుగు సినిమా కథలు రాసుకుంటానని చెప్పారు. సినిమాకు సెన్సార్ ఉంటుంది కానీ.. సోషల్ మీడియాకు సెన్సార్ లేదని, దాన్ని నియంత్రించడం ఎవరి తరం కాదన్నారు.

ఎన్టీపీసీ రెండో దశకు అడుగులు

2,400 మెగావాట్ల విద్యుదుత్పత్తికి టెండర్లు పూర్తి

- రూ.29,345.85 కోట్లతో మూడు ప్లాంట్ల నిర్మాణాలు
- యాష్ పాండ్‌కు 606 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్
- 800 మెగావాట్లు కొనే యోచనలో రాష్ట్ర సర్కారు



పెద్దపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(టీఎస్‌టీపీపీ) రెండో దశలో చేపట్టాల్సిన మూడు యూనిట్ల నిర్మాణాల కోసం ఎన్టీపీసీ ముందుకు సాగుతోంది. రూ.29,345.85 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు ఎన్టీపీసీ ఇప్పటికే ప్రకటించింది. ఇందుకు సంబంధించిన గ్లోబల్ టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కావచ్చింది. వచ్చే వారం కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో రామగుండంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. గురువారం ఢిల్లీలో రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా టీఎస్‌టీపీపీ రెండో దశ పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మొదటి దశలో ఇప్పటికే పూర్తయిన రెండు 800 మెగావాట్ల యూనిట్ల నుంచి 1,600 మెగావాట్ల విద్యుత్‌ను తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పీపీఏ) చేసుకోగా, రెండో దశలో చేపట్టనున్న 2,400 మెగావాట్ల మూడు ప్లాంట్లలో ఒక యూనిట్ నుంచి 800 మెగావాట్ల విద్యుత్‌ను తీసుకునేందుకు ప్రభుత్వం ఎన్టీపీసీతో పీపీఏ చేసుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అలాగే మిగిలిన 1,600 మెగావాట్లలో అవసరాన్ని బట్టి కరెంటు తీసుకునేలా ఒప్పందం చేసుకోనుందని తెలిసింది. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఈ ప్రాజెక్టు నుంచి వెలువడే బూడిద కోసం యాష్ పాండ్ నిర్మాణానికి కావాల్సిన 606 ఎకరాల భూమిని సేకరించేందుకు జిల్లా రెవెన్యూ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ మేరకు సర్వే చేపట్టారు.

విభజన చట్టంలో భాగంగా నిర్మాణం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టం 2014, షెడ్యూల్ 13 ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి సరిపడా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీలో 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం ప్లాంట్ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. నిర్మాణ వ్యయాన్ని ఎన్టీపీసీ భరిస్తే, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో 85 శాతం తెలంగాణకే కేటాయించారు. 800 మెగావాట్ల చొప్పున 5 యూనిట్లను చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎన్టీపీసీ 800 మెగావాట్ల 2 యూనిట్ల నిర్మాణానికి 2016 జనవరి 29న శ్రీకారం చుట్టింది. తద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ కొనుగోలు కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. మొదటి యూనిట్‌ను గత ఏడాది అక్టోబరు 3న, రెండో యూనిట్‌ను ఈ ఏడాది మార్చి 4న ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రస్తుతం ఈ రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. రెండో దశలో 2,400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు యూనిట్లను నిర్మించాల్సి ఉంది. అయితే, గత ప్రభుత్వం పీపీఏ కుదుర్చుకోని కారణంగా ఎన్టీపీసీ నిర్మాణ పనులను ప్రారంభించలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పీపీఏ చేసుకునేందుకు సుముఖత వ్యక్తం చేసినా, తర్వాత వెనుకడుగు వేసింది. అయితే 800 మెగావాట్ల పీపీఏకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం పీపీఏ చేసుకున్నా, చేసుకోకపోయినా స్థలం, బొగ్గు, నీరు, అన్ని సౌకర్యాలు ఉండటంతో ప్రాజెక్టును పూర్తి చేయాలని ఎన్టీపీసీ నిర్ణయం తీసుకుంది. పీపీఏల సంగతి ఎలా ఉన్నా త్వరలోనే రెండో దశ పనులను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది.

ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో హెలిప్యాడ్

» కొత్తగా అందుబాటులోకి తెచ్చిన సర్కారు

» ఇక్కడి నుంచే సిద్దిపేటకు సీఎం రేవంత్



హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మరో హెలిప్యాడ్ అందుబాటులోకి వచ్చింది. ఇప్పటి వరకు బేగంపేట విమానాశ్రయ ప్రాంగణంలోనే అందుబాటులో ఉండగా.. తాజాగా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో మరొక హెలిప్యాడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. నిజానికి, ఇక్కడ గతంలోనే ఓ హెలిప్యాడ్ ఉండేది. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంలు, ప్రముఖులు వచ్చి వెళ్లేందుకు వీలుగా దీనిని నిర్మించారు. ఆ తర్వాత వినియోగించలేదు. ఏళ్ల తరబడి పడావు పడింది. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనలకు వెళ్లాలనుకున్నప్పుడు బేగంపేట వెళ్లి.. అక్కడి నుంచి హెలికాప్టర్ ప్రయాణం చేయాల్సి వస్తోంది. అప్పుడు సీఎం జూబ్లీహిల్స్ నివాసం నుంచి బేగంపేట వరకు ట్రాఫిక్‌ను నిలువరించాల్సి వస్తోంది. అంబులెన్స్‌లు, అత్యవసర వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటుండడంతో ప్రజలకు అసౌకర్యం కలుగుతోంది. దాంతో, సీఎం నివాసానికి దగ్గర్లోనే ఉన్న ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని హెలిప్యాడ్‌పై అధికారులు దృష్టిసారించారు. అది పడావు పడడం, దాని పక్కన కొన్ని భవనాలను నిర్మించడంతో దానిని వినియోగించలేమనే అభిప్రాయానికి వచ్చారు. దానికి 200 మీటర్ల దూరంలో కొత్త హెలిప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచే సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మొదటిసారి హెలికాప్టర్ ప్రయాణం చేశారు. అంతకుముందు అక్కడ అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సిద్దిపేట జిల్లాలోని బండ తిమ్మాపూర్‌కు వెళ్లారు. ఇది అందుబాటులోకి రావడంతో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం ఉండబోదని అధికారిక వర్గాలు అంటున్నాయి.

వాన నీటి సంపుల డిజైన్‌లను మార్చండి

» హైదరాబాద్‌వ్యాప్తంగా 141 పాయింట్ల దగ్గర సంపులు నిర్మించండి

» వానాకాలంనాటికి పనులను పూర్తి చేయండి: రేవంత్

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురిసినపుడు రోడ్డుపైకి వచ్చే వరదను మళ్లించగలిగితే, వరదల వల్ల ఏర్పడే ట్రాఫిక్‌జామ్‌లను తగ్గించవచ్చని సీఎం రేవంత్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని లేక్‌వ్యూ అతిథిగృహం దగ్గర వరద నివారణ కోసం నిర్మిస్తున్న వాన నీటి సంపు పనులను రేవంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా వాన నీటి సంపుల డిజైన్‌లను మార్చాలని అధికారులకు సీఎం సూచించారు. వరద నివారణ నేపథ్యంలో హైదరాబాద్‌వ్యాప్తంగా గుర్తించిన 141వాటర్ లాగింగ్ పాయింట్ల దగ్గర వాన నీటి సంపులను నిర్మించాలని, వచ్చే వానాకాలం నాటికీ అన్నిచోట్ల పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వరదనివారణ చర్యలపైనా అధికారులకు పలు సూచనలు చేశారు.



భద్రాద్రి జిల్లా ముత్యాలంపాడులో రాళ్లవాగుపై నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

10 రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

టేకులపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వచ్చే పది రోజుల్లో రాష్ట్రంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో సోమవారం ఆయన ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తదితరులతో కలిసి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రానున్న పది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం చేపడుతామని, మొదటి విడతలో స్థలం ఉండి ఇంటి నిర్మాణానికి ఆర్థిక స్థోమతలేని వారికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ రాజ్యంలో ఇల్లు ఇస్తామని తెలిపారు. అనంతరం మంత్రి టేకులపల్లి మండలం గంగారం ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు.

జిల్లాల పర్యటనకు వర్గీకరణ కమిషన్

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణను అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన ఏకసభ్య కమిషన్ బుధవారం నుంచి జిల్లాల పర్యటన చేపట్టనుంది. తమ పర్యటనను సంగారెడ్డి జిల్లా నుంచి ప్రారంభించనున్నట్లు కమిషన్ చైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డా. షమీం అక్తర్ తెలిపారు. పర్యటనలో భాగంగా తమ దృష్టికి వచ్చిన అర్జీలతో పాటు ప్రతి అంశాన్ని కూలంకషంగా అధ్యయనం చేసి వర్గీకరణపై ప్రభుత్వానికి ఒక నివేదికను అందజేస్తామని ఆయన చెప్పారు. సోమవారం కమిషన్ కార్యాలయం బీఆర్‌కే భవన్‌లో మాల, మాదిగలతో పాటు, జంగము, చిందు, బేడ/బుడగ జంగము, బైండ్ల, మాంగ్, అరుంధతీయ, మిత అయ్యల్వార్ సహా పలు కులాల వారు కమిషన్ చైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై వారి అభిప్రాయాలను కమిషన్‌కు తెలియజేశారు. తమ కులాల వెనుకబాటుతనంతో పాటు, విద్య, ఉద్యోగాల సాధనలో రిజర్వేషన్లను అందుకోవడంలో జరుగుతున్న అన్యాయం గురించి రాతపూర్వకంగా విజ్ఞప్తులను కమిషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా చిందు కులానికి చెందిన ప్రతినిధులు, తమ కులవృత్తి అయిన భాగోతం కళను కమిషన్ ఎదుట ప్రదర్శించారు.

ఉద్యోగుల అంత్యక్రియల చార్జీలు 30వేలకు పెంపు

» సర్వీసులో ఉన్నప్పుడు మరణిస్తేనే వర్తింపు

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల అంత్యక్రియల చార్జీలను రూ.30 వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సర్వీసులో ఉన్నప్పుడు ఉద్యోగులు మరణిస్తే అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం వారి కుటుంబసభ్యులకు రూ. 20వేలు ఇచ్చేది. అయితే మొదటి వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ఈ చార్జీలను రూ.30 వేలకు పెంచాలంటూ ప్రభుత్వానికి సిఫారసు చేయగా ఆర్థికశాఖ ప్రతిపాదనలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించింది. ఈ మేరకు అంత్యక్రియల చార్జీలను రూ.30 వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అన్ని క్యాటగిరీల ఉద్యోగులకు ఇది వర్తిస్తుందని, సర్వీసులో ఉన్నప్పుడు మరణించినవారికి మాత్రమే అంత్యక్రియల చార్జీలు ఉంటాయని తెలిపింది. వీటికి సంబంధించి సప్లిమెంటరీ బిల్లులు పెట్టుకోవచ్చని అన్ని శాఖలకు సూచించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి సోమవారం జారీ చేశారు.

31న అంబేడ్కర్ వర్సిటీ బీఈడీ ప్రవేశ పరీక్ష

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డా.బీ.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఈడీ, బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) అర్హత పరీక్ష 2024-25కు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డా. భోజు శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రవేశ పరీక్ష ఫీజు ఓసీ, బీసీలకు రూ. 1000, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు రూ.750గా నిర్ణయించినట్లు తెలిపారు. డిసెంబరు 31న ఉదయం 9నుంచి 11గంటల వరకు బీఈడీ (జనరల్) పరీక్ష, అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. వివరాలకు 040-23680333/444/555, విశ్వవిద్యాలయ వెబ్‌పోర్టల్ www.braouonline సంప్రదించొచ్చన్నారు.

సర్పంచి ఎన్నికలకు

సంక్రాంతి గంగిరెద్దుల్లా!

(మొదటిపేజీ తరువాయి)

గ్రీన్ ఫీల్డ్ ఫ్యాక్టరీని ఆయన ప్రారంభించారు. ఈ రెండు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.. సమగ్ర విధానం అనుసరిస్తున్న హెచ్‌సీసీబీని అభినందిస్తున్నానని, ఉద్యోగ ఉపాధి కల్పనతోపాటు ఈ ప్రాంత అభివృద్ధికి గణనీయంగా ఉపయోగపడుతుందని వివరించారు. రుణ మాఫీ, రైతు భరోసాతో కొంతమంది గుండెల్లో పిడుగులు పడుతున్నాయని బీఆర్‌ఎస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గత పాలకులు వరి వేసుకుంటే ఉరేనని అన్నారని, తమ ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తోందని, సన్న వడ్లకు ఇస్తున్న బోనస్‌తో కౌలు రైతులు కూడా సంతోషంగా ఉన్నారని వివరించారు. వచ్చే పదేళ్లు తామే అధికారంలో ఉంటూ బోనస్‌ను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా కచ్చితంగా ఇచ్చి తీరతామని పునరుద్ఘాటించారు. అందుకే, "ఫామ్ హౌజ్‌లో పడుకున్నోళ్లకి మనశ్శాంతి లేదు. వాళ్ల గుండెల్లో మంటకు మందు లేదు. ఆయనకు కావాల్సిన మందును మా మంత్రి జూపల్లి కృష్ణారావు శాఖ నుంచే ఇవ్వగలం" అని ఎద్దేవా చేశారు.

త్వరలోనే గ్రూప్-1 నియామక పత్రాలు

గ్రూప్ 1 ఉద్యోగాల నియామక పత్రాలను త్వరలోనే అందజేస్తామని, 563 మంది అధికారులను తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములను చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. 2011 తర్వాత గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేదని, 13 ఏళ్ల తర్వాత గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి ప్రశ్న పత్రాలను జిరాక్స్ సెంటర్లలో అమ్ముకున్నారని మండిపడ్డారు. ఇప్పుడు 563 మంది గ్రూప్-1 అధికారులు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కాబోతున్నారని, టీజీపీఎస్సీ పనితీరుకు ఇది గీటురాయి అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం టీజీపీఎస్సీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చిందని, ఆర్‌ఎంపీ డాక్టర్లు, డిప్యూటీ ఎమ్మార్వోలను దానికి సభ్యులుగా నియమించిందని మండిపడ్డారు. సర్వీస్ కమిషన్‌ను బీఆర్‌ఎస్ పూర్తిగా రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్లలా టీజీపీఎస్సీని తాము రాజకీయ పునరావాసంగా మార్చబోమని స్పష్టం చేశారు. "ఇప్పుడు చిన్న ఆరోపణ కూడా లేకుండా టీజీపీఎస్సీ పని చేస్తోంది. మూడున్నరేళ్ల సర్వీసు ఉన్నప్పటికీ సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశాన్ని కమిషన్ చైర్మన్‌గా, ఉన్నత చదువులు చదువుకున్న వారిని సభ్యులుగా నియమించాం" అని స్పష్టం చేశారు. ఉద్యోగాలు, ఉపాధి కోసం తెలంగాణ ఉద్యమంలో యువత రోడ్లపైకి వచ్చి పోరాడిందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. కానీ, గత ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వలేదని, ఇచ్చినా పరీక్షలు పెట్టకుండా ప్రశ్నపత్రాలను అమ్ముకుందని మండిపడ్డారు. కేసీఆర్ ఇంట్లో వాళ్లను ఉద్యోగాల నుంచి బర్తరఫ్ చేసిన తర్వాతే తెలంగాణ యువతకు ఉద్యోగాలు వచ్చాయని మరోమారు గుర్తు చేశారు. "డీఎస్సీ వాయిదా వేయాలని రాజకీయ ప్రేరేపిత కృత్రిమ ఆందోళన చేశారు. ఎవరు అడ్డుపడినా డీఎస్సీ పరీక్షలు నిర్వహించి 55 రోజుల్లో నియామక పత్రాలు అందించాం. తెలంగాణ యువతపై మా ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని కోర్టులకు వెళ్లినా న్యాయస్థానాలు సమర్థించలేదు. పరీక్ష వాయిదా కోసం కొందరు కృత్రిమ ఉద్యమాలు చేశారు. పదేళ్లపాటు రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వైస్ చాన్స్‌లర్లను బీఆర్‌ఎస్ నియమించలేదు. మేం వచ్చిన తర్వాత నియమించాం. ఆరోగ్యశ్రీ పథకాన్ని గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కాంగ్రెస్ వచ్చాక ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచాం. ఏడాది కాలంలో రూ.835 కోట్ల ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రజలకు ఇవ్వడం ఒక రికార్డు" అని స్పష్టం చేశారు.

వైద్య శాఖలో ఏడాదిలో 14వేల ఉద్యోగాలు

ఒక్క ఏడాది కాలంలోనే ఆరోగ్య శాఖలో 14 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, 7,750 మంది పారామెడికల్ సిబ్బందికి ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలను అందజేశామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా దామోదర రాజనర్సింహ సమర్థంగా పని చేస్తున్నారని కితాబిచ్చారు. గత ప్రభుత్వం ఎనిమిది వైద్య కళాశాలలకు జీవోలిచ్చి చేతులు దులుపుకొందని, ఎలాంటి వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. తాము వచ్చిన తర్వాత వాటిలో అన్ని రకాల సదుపాయాలు కల్పించడమే కాకుండా కేంద్రాన్ని ఒప్పించి వాటికి అనుమతులు సాధించామని వివరించారు. వైద్య శాఖలో 6,500 మందిని నియమించాలని నిర్ణయించామని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యం విద్య, వైద్యమేనని స్పష్టం చేశారు. "తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో పెట్టాలన్న ఆలోచన కూడా గత పాలకులకు రాలేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గత పాలకులు నెరవేర్చలేదు. పదేళ్లపాటు అధికారంలో ఉండి జయ జయహే పాటను జాతికి అంకితం చేయకపోవడం ద్రోహం కాదా?" అని రేవంత్ నిలదీశారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో తెలంగాణ ప్రభుత్వ ఏడాది విజయోత్సవాలకు ప్రజలు తరలిరావాలని కోరారు.

రూ.2,091 కోట్లతో కోకాకోలా ఫ్యాక్టరీ

బండ తిమ్మాపూర్‌లో 49 ఎకరాల్లో రూ.2,091 కోట్లతో కోకాకోలా ఫ్యాక్టరీని ఏర్పాటు చేశామని, ప్రస్తుతం ఏడు రకాల ఉత్పత్తులను అందించనున్నామని సీఎం రేవంత్‌కు మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. పారిశ్రామికాభివృద్ధితోపాటు పర్యావరణ పరిరక్షణకు ఈ ఫ్యాక్టరీ నిదర్శనంగా నిలుస్తుందని చెప్పారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, టీజీఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి, సంస్థ సీఈవో జువాన్ పాబ్లో రోడ్రిగ్స్‌తో కలిసి రేవంత్‌రెడ్డి కోకాకోలా ఫ్యాక్టరీని సందర్శించారు.

రసాభాసగా కార్యక్రమం

కోకాకోలా ఫ్యాక్టరీని ప్రారంభించడానికి సీఎం రేవంత్ లోపలికి వెళుతున్న సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ గేట్లు దూకి రావడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. సీఎం వెంట తనతోపాటు తన అనుచరులను అనుమతించలేదని, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తనను కాదని మరో నేత బండారు శ్రీకాంత్‌రావు వర్గానికి ప్రాధాన్యం ఇస్తున్నారని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆందోళనకు దిగారు. ఆయనకు మద్దతుగా కార్యకర్తలు టెంటు తొలగించి, ఫ్లెక్సీలు చింపేశారు. దాంతో, నర్సారెడ్డి వర్గీయులను పోలీసులు అడ్డుకున్నారు. అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో నర్సారెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి లోపలికి పిలిపించి మాట్లాడారు. కొద్దిసేపటికే ఆందోళన సద్దుమణిగింది.



డాక్టర్స్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్‌కు నియామక పత్రాలను అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, దామోదర తదితరులు

వైద్యులకు నియామక పత్రాలు అందించిన సీఎం

ఇటీవలే నియమితులైన 422 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లలో కొందరికి; ఫుడ్ సేఫ్టీ అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం 16 కొత్త నర్సింగ్ కాలేజీలు, 28 ఎలైడ్ హెల్త్ సైన్స్ కాలేజీలు; ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేసిన 32 మైత్రి క్లినిక్‌లను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. కొత్తగా కొనుగోలు చేసిన 213 అంబులెన్స్‌లను జెండా ఊపి ప్రారంభించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఒక్కోదాంట్లోకి వెళ్లి పరిశీలించారు.

హైదరాబాద్ అభివృద్ధికి 3,446 కోట్లతో ప్రాజెక్టులు

» నేడు శంకుస్థాపన చేయనున్న రేవంత్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన ఏడాది విజయోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంకురార్పణ చేయనున్నారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ) ప్రాజెక్టులో భాగంగా వేర్వేరు ప్రాంతాల్లో రూ.3,446 కోట్లతో వీటికి శంకుస్థాపన చేయనున్నారు. జీహెచ్‌ఎంసీ చేపట్టనున్న ఈ ప్రాజెక్టులకు ప్రసాద్ ఐ మ్యాక్స్ పక్కనున్న హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి భూమి పూజ చేస్తారు. వంతెనలు, అండర్‌పాస్‌లు, కారిడార్ల అభివృద్ధి, నాలాల విస్తరణ, రీ మోడలింగ్ వంటి పనులను హెచ్-సిటీలో భాగంగా చేపడుతున్నారు. గ్రేటర్‌లోని ప్రధాన కూడళ్లు, రహదారులపై రూ.150 కోట్లతో చేపడుతున్న సుందరీకరణ పనులూ ప్రారంభిస్తారు. రోడ్లపై వరద నీరు నిలవకుండా ప్రధాన రహదారుల్లోని 12 ప్రాంతాల్లో రూ.16.50 కోట్లతో నీటి సంపులను నిర్మిస్తున్నారు. సచివాలయం ఎదురుగా, లేక్‌వ్యూ గెస్ట్ హౌస్ తదితర ప్రాంతాల్లో నాలుగు నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. వాటిని సీఎం ప్రారంభించనున్నారు. ట్యాంక్ బండ్‌లో 9న నిర్వహించనున్న విజయోత్సవాల ముగింపు వేడుకలకు జీహెచ్‌ఎంసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.



ట్రాన్స్‌జెండర్లతో ముఖ్యమంత్రి మాటా ముచ్చట

స్టాల్స్‌ను పరిశీలిస్తున్న క్రమంలో వైద్య ఆరోగ్య, దివ్యాంగ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌జెండర్ల స్టాల్‌లోకి సీఎం, మంత్రులు వెళ్లారు. అక్కడ ప్రేమలీల అనే ట్రాన్స్‌జెండర్ సీఎంతో మాట్లాడారు. తమకు మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తమ కోసం మైత్రి క్లినిక్‌లను ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. తమను జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, ట్రాఫిక్ కంట్రోల్ చేసే సిబ్బందిగా త్వరలో ట్రాన్స్‌జెండర్లను నియమిస్తామని సీఎం వారికి హామీ ఇచ్చారు.

మేం సరైన మార్గంలోనే ఉన్నాం

» ఇటీవల పునరుద్ధరించిన అమీన్‌పూర్ చెరువులో రెడ్ బ్రెస్టెడ్ ఫ్లై క్యాచర్ పక్షి

» ఇది భగవంతుని ఆమోదం వంటిది

» ఎక్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ వ్యాఖ్య

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైడ్రా పునరుద్ధరించిన అమీన్‌పూర్ చెరువులో 12 సెంటీమీటర్ల రెడ్ బ్రెస్టెడ్ ఫ్లై క్యాచర్ (ముక్కు కింద రొమ్ము భాగంలో ఎర్రగా ఉండే ఒక పక్షి) కనిపించిందని, దాంతో, తాము సరైన మార్గంలోనే ఉన్నామని స్పష్టమవుతోందని, ఇది భగవంతుని ఆమోదం వంటిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. ఈ పక్షి తూర్పు యూరప్‌లో ఉంటుంది. అక్కడ చలి బాగా పెరిగిపోయినప్పుడు దక్షిణాసియా దేశాలకు వలస వెళతాయి. ఇలా గతంలోనూ హైదరాబాద్‌లోని అమీన్‌పూర్ చెరువుకు వచ్చేవి. ఇక్కడ ఆక్రమణలు పెరిగిన తర్వాత కనుమరుగయ్యాయి. తాజాగా ఇప్పుడు మళ్లీ కనిపించాయి. దాంతో, ఇదే విషయాన్ని రేవంత్ తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. "మనం ప్రకృతిని కాపాడితే అది మనల్ని కాపాడుతుందని నేను బలంగా విశ్వసిస్తాను. గత కొన్నేళ్లుగా ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలు, సహజ వనరులను మేం అడ్డుకున్నాం. కొన్ని శతాబ్దాలుగా వారసత్వంగా వచ్చిన నీటి వనరులను ఆక్రమణదారుల చెర నుంచి రక్షించాం. ఇది పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యాన్ని కాపాడుతుంది. అమీన్‌పూర్ చెరువులో రెడ్ బ్రెస్టెడ్ ఫ్లై క్యాచర్ కనిపించడంతో మేం సరైన మార్గంలో ఉన్నామని స్పష్టమవుతోంది" అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పేదల ఇంట విద్యుత్ వెలుగులు పంచాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పం సత్ఫలితాలను ఇస్తోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న 'గృహజ్యోతి' పథకం కింద ఒక్క హైదరాబాద్ నగరంలోనే 10.52 లక్షల కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'సంక్షేమానికి కేరాఫ్ అడ్రస్.. ఇందిరమ్మ పాలన' అంటూ పేర్కొన్నారు.

అప్పులు దాటి అభివృద్ధి బాట

» ఆర్థిక క్రమశిక్షణకు పెద్దపీట వేస్తున్నాం

» ఏడాది వ్యవధిలో తెచ్చిన అప్పులు రూ.52,118 కోట్లు

» వడ్డీలు, కిస్తీల చెల్లింపులకు.. రూ. 64,516 కోట్లు

» ప్రతిష్ఠాత్మక పథకాలకు రూ.61,194 కోట్ల వ్యయం

» ఇప్పటివరకూ 54,520 ఉద్యోగాల భర్తీ: సీఎంవో



హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నాలు చేపట్టామని.. అప్పుల పరిస్థితిని దాటి అభివృద్ధి బాట పడుతున్నామని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈమేరకు.. ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంఓ) సోమవారం ఒక ప్రకటనను విడుదల చేసింది. అప్పులతో అతలాకుతలమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తున్నామని అందులో పేర్కొంది. "2014 నుంచి 2023 వరకు.. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసింది. వాటికి చెల్లించాల్సిన వడ్డీలు, కిస్తీలు కొత్తగా చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు అవరోధాలుగా మారాయి. వాటిని అధిగమించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే.. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై శ్వేత పత్రం విడుదల చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసినట్లుగా ఇష్టారాజ్యంగా అప్పుల జోలికి వెళ్లకుండా నియంత్రణ పాటిస్తున్నాం. బడ్జెట్ పరిమితులకు లోబడి మార్కెట్ రుణాలు తీసుకుని, ప్రణాళిక, ప్రణాళికేతర ఖర్చులకు సరిపడేలా నిధులను సర్దుబాటు చేస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగులకు నెలలో ఎప్పుడు జీతాలు పడతాయో తెలియని పరిస్థితి నుంచి.. ఒకటో తేదీన జీతాలు చెల్లించే పద్ధతిని పునరుద్ధరించాం. గత ప్రభుత్వం బకాయి పెట్టిన దాదాపు రూ.లక్ష కోట్ల బిల్లులను క్రమపద్ధతిలో క్లియర్ చేసే విధానాన్ని అనుసరిస్తున్నాం" అని సీఎంవో వివరించింది. గత ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా చేసిన అప్పులు తీర్చేందుకు ప్రాధాన్యమిస్తున్నట్టు తెలిపింది. తెచ్చిన అప్పు కంటే ఎక్కువగా చెల్లింపులు చేసి.. తెలంగాణ ప్రజలపై మోపిన రుణ భారాన్ని తగ్గిస్తున్నట్లు పేర్కొంది.

ఇవీ లెక్కలు..

సీఎంవో విడుదల చేసిన ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ నెలాఖరు వరకూ రాష్ట్ర ప్రభుత్వం రూ.52,118 కోట్ల మేర అప్పులు చేసింది. అదే సమయంలో వడ్డీలు, కిస్తీల కింద చేసిన చెల్లింపులు రూ.64,516 కోట్లు. అలాగే, ఇచ్చిన మాట ప్రకారం.. చేయూత, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత గృహ విద్యుత్తు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, బియ్యం సబ్సిడీ, ఉపకారవేతనాలు, డైట్ చార్జీల పెంపు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు రూ.61,194 కోట్లను వ్యయం చేశామని సీఎంవో తన ప్రకటనలో తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి నవంబర్ నాటికే దాదాపు రూ.9,888 కోట్లను ఖర్చు చేశామని వివరించింది. ఇలా ఒకవైపు అప్పులను తీరుస్తూనే.. గ్యారెంటీల అమలుకు ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు తెలిపింది. మరీ ముఖ్యంగా.. ఏక కాలంలో రైతులకు రూ.20,617 కోట్ల రుణాన్ని మాఫీ చేసి రికార్డు నెలకొల్పామని.. రాష్ట్రంలోని 25.36 లక్షల రైతు కుటుంబాలను రుణవిముక్తం చేశామని చెప్పింది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒక్క ఏడాదిలోనే.. రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి దాదాపు రూ.57 వేల కోట్లు ఖర్చు చేశామని పేర్కొంది. రుణమాఫీతో పాటు రైతు భరోసా, పంటల బీమా, రైతు బీమా, పంట నష్ట పరిహారం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, సన్న వడ్లకు బోనస్ కింద భారీగా నిధులను ఖర్చు చేశామని వివరించింది. రాష్ట్రంలో ఆగస్టు, సెప్టెంబర్‌లలో కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంటలకు పరిహారంతో పాటు, బాధితులకు సాయం అందించేందుకు రూ.260 కోట్లు కేటాయించినట్లు తెలిపింది. అప్పులను తీరుస్తూనే మొదటి ఏడాదిలోనే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టామని.. మహాలక్ష్మి, గృహజ్యోతితో పాటు యువ వికాసం పథకాలను అమలు చేశామని వివరించింది. అలాగే. గతంలో నిర్లక్ష్యానికి గురైన నిరుద్యోగులకు ఉద్యోగాలపై భరోసాను కల్పించామని సీఎంవో తన ప్రకటనలో తెలిపింది. తొలి ఏడాదిలోనే వార్షిక ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదల చేసి 54,520 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని పేర్కొంది.

పది నిమిషాల్లోనే అంబులెన్స్

» మా ప్రభుత్వ లక్ష్యం ఇదే: దామోదర

» కొత్తగా 213 అంబులెన్స్‌లు అందుబాటులోకి

» ప్రజలను రెచ్చగొడితే ఊరుకోం: భట్టి



అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు దామోదర, పొన్నం ప్రభాకర్ తదితరులు

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా 213 అంబులెన్స్‌లను సోమవారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చామని, వీటితో కలిపి మొత్తం అంబులెన్స్‌ల సంఖ్య 1003కి పెరిగిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. కొత్త వాహనాల రాకతో అంబులెన్స్ రెస్పాన్స్ టైమ్ సగటున 18 నిమిషాల నుంచి 13 నిమిషాలకు తగ్గుతుందన్నారు. పది నిమిషాల్లోనే అంబులెన్స్‌ను పంపించి ప్రాణాలు కాపాడాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో, ఇతర ఎమర్జెన్సీ సమయంలో బాధితుల ప్రాణాలు కాపాడేలా రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రతి 30 కిలో మీటర్లకు ఒకటి చొప్పున 74 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పేద ప్రజలను దోచుకోవద్దని, నిబంధనలకు ప్రకారం వైద్యం అందించాలని ప్రైవేటు ఆస్పత్రులను హెచ్చరించారు. అనారోగ్యంతో ప్రజలు అప్పుల పాలు కాకూడదని, రోగం వస్తే ఉచితంగా వైద్యం అందుతుందనే భరోసా వారికి కలగాలని, ఆ భరోసాను కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. నాడైనా, నేడైనా విద్య, వైద్యం వంటి కనీస వసతుల కల్పన అనేది కాంగ్రెస్ పార్టీ మొదటి ప్రాధాన్యమని తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆరోగ్య ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ అయినా, ఫీజు రీయింబర్స్‌మెంట్ అయినా వాటిని తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆరోగ్యశ్రీ ప్యాకేజీ ధరలను పెంచామని, ఏడాదిలో ఆరోగ్య శాఖలో 7,774 పోస్టులను భర్తీ చేశామని, మరో 6,470 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశామని వివరించారు. 16 నర్సింగ్, 28 పారామెడికల్ కాలేజీలను ప్రారంభించామన్నారు.

ప్రజలను రెచ్చగొడితే ఊరుకోం: భట్టి

కొన్ని రాజకీయ పార్టీలు అడ్డగోలుగా రోడ్లపైకి వచ్చి ప్రజలను రెచ్చగొడితే చూస్తూ ఊరుకోబోమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హెచ్చరించారు. పనిలేని నాయకులు ప్రజలను రెచ్చగొట్టి రాజకీయంగా జీవించాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే బీఆర్‌ఎస్, బీజేపీలను దూరంగా ఉంచాలని ప్రజలను కోరారు. ఏడాది కూడా అధికారం లేకుండా బీఆర్‌ఎస్ ఉండలేకపోతోందని విమర్శించారు. ప్రజారోగ్యాన్ని పదేళ్లపాటు బీఆర్‌ఎస్ సర్కారు గాలికి వదిలేసిందని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 6 నెలలు ఎన్నికలతోనే సరిపోయిందని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.